ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




శనివారం 19 సెప్టెంబర్ 2026 | Saturday 19 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad | ➩ పేజీలు: 12+12 | ➩ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 157 | Vol.No 28 Issue No .157 | www.visionandhra.in

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..

- సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!
- చైర్మన్‌గా సీసీఎల్‌ఏ కమిషనర్ లోకేశ్ కుమార్
- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం
- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి
- పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ



హైదరాబాద్, సెప్టెంబర్ 18 : తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక మిగతా 2లో..

## ఏళ్ల నిరీక్షణకు తెర.. టీజీఎస్ఆర్టీసీలో ఎన్నికల నగారా

- అక్టోబర్ 9న పోలింగ్, 17న ఓట్ల లెక్కింపు, • విడుదలైన ఆర్టీసీ ఎన్నికల పూర్తి షెడ్యూల్, • 2016లో చివరిసారిగా జరిగిన ఎన్నికలు, • కార్మికుల వేతనాలపై చర్చించే అధికారం గుర్తింపు సంఘానికే

హైదరాబాద్, సెప్టెంబర్ 18 : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ ఎట్టకేలకు విడుదలైంది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం కార్మిక సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, యాజమాన్యం ఎట్టకేలకు తేదీలను ఖరారు చేసింది. అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించి, అక్టోబర్ 17న ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రకటించిన మిగతా 2లో..




## నాంపల్లి కోర్టులో సంచలన పిటిషన్

- మీనాక్షి నటరాజన్ పాస్ పోర్ట్ సీజ్ చేయండి!
- కుంభం శివకుమార్ రెడ్డి కేసులో కీలక మలుపు
- బాధితురాలు శ్రీలత అత్యవసర పిటిషన్



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 18: కుంభం శివకుమార్ రెడ్డి కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. నిందితురాలు మీనాక్షి నటరాజన్ పాస్ పోర్ట్ ను సీజ్ చేయాలని కోరుతూ కేసు బాధితురాలు శ్రీలత నాంపల్లి కోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. మీనాక్షి నటరాజన్ పై ఇప్పటికే కోర్టు పరిధిలో రెండు క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఆమె ఉన్నత చదువుల పేరుతో విదేశాలకు మిగతా 2లో..

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి

- కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారన్న పొంగులేటి
- 2004లో ఒక ఎకరా మాత్రమే చూపించిన కేసీఆర్‌కు
- వందల కోట్ల భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- తమ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని వ్యాఖ్య



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మిగతా 2లో..

# రాష్ట్రానికి 9.56 లక్షల ఇళ్లను కేటాయించాలి

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్ మాదాపూర్‌లో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన గృహ నిర్మాణం, వ్యవసాయం, ఎల్నినో ప్రభావం, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై చర్చించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనగ్రామీణ్ (PMAY`G) పథకంలో భాగంగా తెలంగాణకు మొదటి విడతలో 2 లక్షల ఇళ్లను కేటాయించినందుకు కేంద్ర మంత్రికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని గత జూలైలో ఢిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇళ్లను కూడా కేటాయించాలని కోరారు. ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం పెరిగిందని సీఎం వివరించారు. తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు.



వ్యవసాయ రంగంపై ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కేంద్ర మంత్రిని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్నామని సీఎం తెలిపారు. సన్న వడ్ల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని వివరించారు. ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 250 ఎకరాల్లో ఫ్రూట్స్, వెజిటెబుల్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పంట మార్పిడిని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి కేంద్రం సహకరించాలని కోరారు.

## ‘మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ’..

- ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్
- టీఎంసీ పేరు, గుర్తును తాత్కాలికంగా ఫ్రీజ్ చేసిన ఎన్నికల సంఘం
- మమతా వర్గానికి రాహుల్ గాంధీ మద్దతు
- ఈసీ, బీజేపీపై రాహుల్ తీవ్ర ఆరోపణలు
- రెండు టీఎంసీ వర్గాల మధ్య పేరు, గుర్తుపై వివాదం
- కొత్త పేర్లు, గుర్తులు ఎంచుకోవాలని ఈసీ ఆదేశం

పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పేరు, ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేయడంపై కాంగ్రెస్ అగ్రనేత మిగతా 2లో..



## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం

- భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే భూములు స్వాధీనం చేసుకోవాలన్న బండి సంజయ్
- కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం అర్థమవుతోందని వ్యాఖ్య
- కేసీఆర్ గతమంతా అవినీతి, భూదందాలతో నిండిపోయిందని ఆరోపణ

హైదరాబాద్, సెప్టెంబర్ 18 : సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మిగతా 2లో..



## బారీగా పోలీసులు ఎందుకు..?

- నా జీవితం తెరిచిన పుస్తకం , • మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 18: రంగనాయక సాగర్ వద్ద హరీష్ రావు ఫామ్ హౌస్ కు కాంగ్రెస్ నాయకుల పర్యటన సందర్భంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బైండ్ల కులాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ నాజీవితం తెరిచిన పుస్తకం అన్నారు. 2018-2023 ఎన్నికల ఆపిడవిట్ లో ఆస్తుల వివరాలను పూర్తిగా మిగతా 2లో..



## బీసీ కులాల జనాభాను తక్కువ చేసి చూపే కుట్ర జరుగుతోంది



- కేంద్రం చేసే జనగణనలో బీసీ ఉప కులాలను కూడా కలిపి లెక్కించాలి
- కులం కోసం ప్రత్యేక కాలం ప్రత్యేకంగా ఉండాల్సిందే
- కుల గణనకు ఇంకా నాలుగు నెలల సమయం ఉంది.. కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలి
- మన ఆలోచన విధానం మారితేనే కుల వివక్ష నిర్మూలన సాధ్యం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ సెప్టెంబర్18:( విజన్ ఆంధ్ర) : బీసీ కులాల జనాభాను తక్కువగా చూపి...వారు ఐక్యంగా పోరాడకుండా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. జనగణనలో ఓబీసీ కాలాన్ని కులాల వారీగా చూపకుండా బలహీన వర్గాలను కులాల సమూహాలుగా విడగొట్టి ఐక్య పోరాటాలు జరగకుండా ప్రయత్నాలు చేస్తోందన్నారు. బంజారాహిల్స్ లోని ఓ హోటల్ లో శుక్రవారం ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్, సకల జన సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన “పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్” సదస్సులో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం చేపట్టే కుల గణనలో బీసీ జనాభా విషయంలో ఎలాంటి గందరగోళం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కేవలం క్యాస్ట్ కాలం పెట్టేసి చేతులు దులుపుకుంటామంటే మిగతా 2లో..

## మా ఆస్తులు తీసుకుని రూ.1,000 కోట్లు ఇవ్వండి

### - రేవంత్ కు కేటీఆర్ సవాల్

- బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్న కేటీఆర్
- హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రంబవళ్లు ప్రయత్నించామని వెల్లడి
- కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 : ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను మిగతా 2లో..



## పోర్టు ఆధారిత అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి..

# ఒకేసారి 28 ప్రాజెక్టులు.. 20,000 ఉద్యోగాలు

- రూ.22,177 కోట్ల విలువైన 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 19,739 మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు
- ఏపీని హార్డ్‌వేర్, పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం
- ఎగుమతుల ర్యాంకింగ్‌లో దేశంలోనే 10వ స్థానంలో నిలిచిన తిరుపతి జిల్లా
- ఆమోదం పొందిన ప్రాజెక్టులను 6 నెలల్లో ప్రారంభించాలని సీఎం ఆదేశం

అమరావతి సెప్టెంబర్ 18 : ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ.22,177.84 కోట్ల విలువైన 28 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో కొత్తగా 19,739 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇంధన,




ఐటీ, ఆహార శుద్ధి, తయారీ, పర్యాటక రంగాలకు చెందిన ఈ ప్రతిపాదనలతో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

**హార్డ్‌వేర్, పోర్టు ఆధారిత అభివృద్ధిపై ఫోకస్**

ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు రెండు ప్రధాన లక్ష్యాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే కీలకమైన హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా (హబ్) తీర్చిదిద్దడంతో పాటు, తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టు ఆధారిత పారిశ్రామిక వ్యవస్థను (ఎకో సిస్టమ్) నిర్మించాలని ఆదేశించారు. సెమీ కండక్టర్లు, చిప్ తయారీ, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో భారీ పెట్టుబడులను మిగతా 2లో..

## సుప్రీంకోర్టుకు వెళ్లను

### దానం నాగేందర్ కీలక ప్రకటన

- అనర్హత వేటుపై హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నట్టు తెలిపిన దానం

హైదరాబాద్, సెప్టెంబర్ 18 : తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించే ఉద్దేశం మిగతా 2లో..



## బారీగా పోలీసులు ఎందుకు..?

వెల్లడించినట్టు తెలిపారు.కాంగ్రెస్ సర్కార్ కొత్తగా బయటపెట్టింది ఏం లేదన్నారు.రామంచలో 13 ఎకరాల భూమి కొనుగోలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రాద్ధాంతం చేస్తుందన్నారు.కాంగ్రెస్ నాయకుల మాదిరి కబ్జాలు చేయలేదు... దోచుకోలేదన్నారు...ఏడు పర్యాయాలు సిద్దిపేట ప్రజలు తన పనితీరును చూసి గెలిపించారని స్పష్టం చేశారు.సిద్దిపేట ప్రేమ ఆత్మీయతకు ఆదిత్యానికి మారుపేరన్నారు. 3000 మంది పోలీసులు ఎందుకు..? బుల్లెట్ ప్రూఫ్ బండ్లు ఎందుకు...? పోలీస్ పహారాల మధ్య రావడం ఎందుకు.. మాఇంటికి వస్తే అన్నం పెట్టి దగ్గరుండి తోటను చూపిస్తా అని కాంగ్రెస్ నాయకులకు హరీష్ రావు స్వాగతం పలికారు.సిద్దిపేట అభివృద్ధి కి కేరాఫ్ అడ్రస్ అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టుకు వెళ్లను

తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పును తాను గౌరవిస్తున్నట్టు పేర్కొన్న ఆయన, మీడియా సమావేశంలో తన తదుపరి నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ, "ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే అన్ని విషయాలు తేల్చుకుంటాం. నాకు ఎన్నికల్లో పోటీ చేయడం కొత్తేమీ కాదు. అనేక పోరాటాల ద్వారానే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మద్దతుతో పోరాడి విజయం సాధిస్తాను" అని ధీమా వ్యక్తం చేశారు. న్యాయపోరాటం కంటే రాజకీయంగానే దీనిని ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారు.గతంలో స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టిన హైకోర్టు, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, నాగేందర్ మాత్రం తన పోరాటాన్ని ప్రజాక్షేత్రానికే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారు.

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..

నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

## ఏళ్ల నిరీక్షణకు తెర.. టీజీఎస్ఆర్టీసీలో ఎన్నికల నగారా

షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆర్టీసీలో చివరిసారిగా 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి 2018లోనే ఈ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రభుత్వం వీటిని జరపలేదు. దీంతో కార్మికుల నిరీక్షణ సుదీర్ఘంగా కొనసాగింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి గుర్తింపు పొందే సంఘానికే కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏ, సర్వీస్ నిబంధనల వంటి కీలక అంశాలపై యాజమాన్యంతో మరియు ప్రభుత్వంతో అధికారికంగా చర్చలు జరిపే హక్కు ఉంటుంది. అందుకే ఈ ఎన్నికలను కార్మిక సంఘాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. రాష్ట్ర, రీజనల్ స్థాయిలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. రీజనల్ స్థాయిలో ఆఫీసర్ హోదాలో ఉన్నవారు మినహా, మిగిలిన కార్మికులు, ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తాజా షెడ్యూల్ విడుదలవడంతో ఆర్టీసీలో ఎన్నికల సందడి మొదలైంది.

## కేసీఆర్, హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావుపై కూడా పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. వట్టినాగులపల్లి భూమిపై హరీశ్ రావు మాటలు మార్చుతున్నారని, ట్రస్ట్ పేరిట భూములను దారి మళ్లించారని ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 13 ఎకరాల భూమిని డిలీట్ చేయించి, అతి తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రూ. 5.40 కోట్ల ప్రభుత్వ నిధులతో ఆ ల్యాండ్‌కు ప్రయోజనం చేకూరేలా రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ వ్యాపార కుటుంబాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్న మంత్రి, ఈ భూ అక్రమాలకు సహకరించిన అధికారులు ఎంతటివారైనా సరే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, సిద్దిపేటలో ఆక్రమణకు గురైన భూముల్లో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మిస్తామని స్పష్టం చేశారు.

## నాంపల్లి కోర్టులో సంచలన పిటిషన్

వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని పిటిషన్ లో శ్రీలత పేర్కొన్నారు. క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తులు విదేశాలకు వెళితే న్యాయ ప్రక్రియకు తీవ్ర అంతరాయం కలుగుతుందని, దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందని ఆమె కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల మీనాక్షి నటరాజన్ విదేశీ పర్యటనను అడ్డుకోవాలని, ఆమె పాస్ పోర్ట్ ను వెంటనే జప్తు చేయాలని శ్రీలత తన పిటిషన్ లో కోరారు. ఈ పిటిషన్ పై నాంపల్లి కోర్టు త్వరలో విచారణ చేపట్టనుంది.

## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

## మా ఆస్తులు తీసుకుని రూ.1,000 కోట్లు ఇవ్వండి

అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. "మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి" అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# బీసీ కులాల జనాభాను తక్కువ చేసి చూపే కుట్ర జరుగుతోంది

ఊరుకునేది లేదన్నారు. ప్రతి రాష్ట్రంలో ఉన్న కులాల జాబితాను కచ్చితంగా అప్ లోడ్ చేయాలని...అదే విధంగా ఉపకులాలను కూడా కలిపి లెక్కించాలి. లేదంటే బీసీల జనాభా తక్కువగా కనిపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకే కులానికి సంబంధించి దేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో స్టేటస్ ఉందని...ఆ సమస్యను పరిష్కరించాలంటే బీసీ కులాల ఉపకులాలను కూడా కలిపి లెక్కించటం జరగాలన్నారు. లేదంటే ఉప కులాల్లో ఉండే వారికి న్యాయం జరగదని వారిని కూడా ఒక కులంగా లెక్కల్లో చూపే ముప్పు ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ లో ఉన్న 57 ఉపకులాల కారణంగా ఉప కులాల్లో వారికి న్యాయం జరగటం లేదన్న విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. అయినప్పటికీ వేల కోట్లు ఖర్చు చేస్తూ బీసీ జన గణనలో కూడా సొలుష్యన్ లేకుండా చేయటం సరికాదన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కుల గణన పేరుతో బీసీ జనాభాను తక్కువ చేసి చూపిందని కవిత చెప్పారు. కేంద్రం చేపట్టే కుల గణన ద్వారా ఆ సమస్య తీరుతుందని భావిస్తే...వాళ్లు సమస్యను మరింత జఠిలం చేస్తున్నారని మండిపడ్డారు. కుల గణనకు సంబంధించి మరో నాలుగు నెలల సమయం ఉందని...ఈ లోగా కేంద్రం ఈ సమస్య పరిష్కరించటంపై దృష్టి సారించాలన్నారు.

***మన డీఎన్ఏ లోనే కుల వివక్ష***

కుల వివక్ష అనేది మన డీఎన్ఏ లోనే పాతుకుపోయిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి, స్పీకర్ లాంటి వాళ్లు కూడా కుల వివక్ష కు గురికావటం అన్యాయమన్నారు. ఈ జఠిలమైన సమస్యకు మల్టీ డైమన్షన్ సొలుష్యన్స్ అవసరమన్నారు. ఈ సమస్యకు అప్పర్ కాస్ట్, బాధితుడు అనే రెండు కోణాలున్నాయని...బాధితుడి కోణం నుంచి చూసినప్పుడు మాత్రమే సరైన పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మారోజు వీరన్న చెప్పినట్లుగా ప్రతి కులాన్ని ఎంపావర్ చేయాల్సిన అవసరముందన్నారు. రాజ్యాధికారంతో పాటు ఆర్థికంగా ఆయా కులాలను బాగు చేయాలని...అధికారంలో ఉన్న పార్టీలే ఆ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. చట్టాల పరంగా ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ ఆలోచన విధానంలో మార్పు వచ్చినప్పుడే కుల వివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు.

***పురుషులతో సమానంగా మహిళలకు వేతనం ఇవ్వాలి***

పురుషులతో సమానంగా పనిచేసినప్పటికీ మహిళలకు వేతనాల్లో వ్యత్యాసం చూపించటం అన్యాయమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతన చట్టాలు ఉన్నప్పటికీ...2026 లో కూడా వేతన వ్యత్సాసం చూపుతున్నారన్నారు. శుక్రవారం అంతర్జాతీయ సమాన వేతన దినోత్సవం సందర్భంగా ఈ అంశంపై ఎక్స్ లో ట్వీట్ చేశారు. మహిళల శ్రమకు సమానమైన విలువ ఇచ్చినప్పుడు మాత్రమే నిజమైన పురోగతి సాధ్యమవుతుందన్నారు.

# జోగిపేటలో భారీ అగ్ని ప్రమాదం రెండు ఏటీఎంలు, పరికరాలు, నగదు అగ్నికి ఆహుతి





జోగిపేట:విజన్ఆంధ్ర, సెప్టెంబర్18: సంగారెడ్డి జిల్లా,జోగిపేట పట్టణంలోని కూరగాయల మార్కెట్ గల్లీలో గురువారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో పక్కపక్కనే ఉన్న యూనియన్ బ్యాంక్,ఎస్‌బీఐకి చెందిన రెండు ఏటీఎంలు మంటల్లో పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.

ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. రెండు ఏటీఎంలు పక్కపక్కనే ఉండటంతో ఒక ఏటీఎంలో చెలరేగిన మంటలు మరో ఏటీఎంకు వ్యాపించినట్లు తెలుస్తోంది.దీంతో కొద్దిసేపటికే మంటలు భారీగా ఎగిసిపడి, దట్టమైన పొగ పరిసర ప్రాంతాల్లో వ్యాపించింది.

ఏటీఎంల నుంచి దట్టమైన పొగలు రావడాన్ని సమీపంలోని ఉన్న ప్రజలు గమనించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్‌స్టేషన్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సకాలంలో స్పందించడంతో మంటలు పక్కనే ఉన్న ఇళ్లకు,ఇతర దుకాణాలకు వ్యాపించకుండా నివారించగలిగారు.

ఈప్రమాదంలో రెండు ఏటీఎంలలోని పరికరాలు, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు సమాచారం. ఏటీఎంలలో ఉన్న నగదు కూడా అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. అయితే ఎంత మొత్తంలో నగదు,ఎంత మేర ఆస్తి నష్టం జరిగిందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.బ్యాంకు అధికారులు,సాంకేతిక సిబ్బంది పరిశీలన అనంతరం నష్టం వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

***పోలీసులు, బ్యాంకు అధికారుల పరిశీలన***

ప్రమాదంపై జోగిపేట పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.జోగిపేట సీఐ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా, సంబంధిత బ్యాంకు అధికారులకు సమాచారం అందించామని తెలిపారు. సాంకేతిక సిబ్బంది సంఘటనా స్థలానికి వస్తున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారని, ప్రస్తుతం పూర్తి స్థాయి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. నష్టం ఎంత మేరకు జరిగిందనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉందన్నారు.

***తప్పిన పెను ప్రమాదం***

అర్ధరాత్రి సమయంలో ప్రమాదం జరగడంతో మార్కెట్ ప్రాంతంలో ప్రజల రాకపోకలు తక్కువగా ఉండటంతో ప్రాణనష్టం తప్పింది. ఫైర్‌స్టేషన్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రమాదం మరింత విస్తరించకుండా నివారించగలిగారు. ఏటీఎంల వద్ద విద్యుత్ వ్యవస్థలు, భద్రతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

# స్పేస్ ఆన్ వీల్స్‌తో అంతరిక్ష విజ్ఞానం

- రాకెట్లు, ఉపగ్రహాలు, చంద్రయాన్‌పై విద్యార్థులకు అవగాహన
- ప్రత్యక్ష నమూనాలతో శాస్త్రీయ ఆలోచనకు ప్రోత్సాహం
- విద్యార్థుల సందేహాలకు ఇస్రో శాస్త్రవేత్తల సమాధానాలు



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర): విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో జీడిమెట్ల విలేజ్ పైప్‌లైన్ రోడ్డులోని హోలీ స్పిరిట్ పాఠశాలలో 'స్పేస్ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా భూగోళం, చంద్రుడు, రాకెట్లు, ఉపగ్రహాలు తదితర అంతరిక్ష నమూనాలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త, ఎన్ఆర్ఎస్‌సీ ఔట్‌రీచ్ స్టూడెంట్ ఫెసిలిటీ హెడ్ డా. ఆర్. శ్రీనివాస్, ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త, ఎన్ఆర్ఎస్‌సీ హార్డ్‌వేర్ క్వాలిటీ డివిజన్ డిప్యూటీ హెడ్ శ్రీమతి చ. శ్రీదేవి విద్యార్థులకు రాకెట్ల ప్రయోగ విధానం, ఉపగ్రహాల ఉపయోగం, వ్యోమగాముల జీవనం, చంద్రయాన్ మిషన్లు, గ్రహాలు, గెలాక్సీలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా ప్రశ్నలు అడగగా, శాస్త్రవేత్తలు వాటికి సమాధానాలు ఇచ్చారు. ప్రొవిన్షియల్ సుపీరియర్ రెవ. సిస్టర్ చిన్నమ్మ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ సుశీల, ప్రిన్సిపాల్ సిస్టర్ సిసిల్, వైస్ ప్రిన్సిపాల్ విజయదర్శిని, సిస్టర్స్, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రత్యక్ష నమూనాలు, ప్రశ్నోత్తరాల ద్వారా సాగిన కార్యక్రమం విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధన, విజ్ఞానశాస్త్రం పట్ల ఆసక్తిని పెంచింది.

# ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు

- ఎల్లారెడ్డిపేట, కిషన్‌దాస్‌పేటలో పల్లె దవాఖానాలు ప్రారంభం
- ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం, కిషన్‌దాస్‌పేట (కిష్టంపల్లి)లో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దవాఖానాల్లోని వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు నిరంతరం వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సలహాలు అందించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సబేరా బేగం, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, సర్పంచ్ నరసింహులు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ రజని, ఎంపీడీఓ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# రంజిత్ ఆశయాలను అభినందించిన సీఎం రేవంత్



భీమారం సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర): ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్, భీమారం ముద్దుబిడ్డ దాసరి రంజిత్ శుక్రవారం తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఒక మారుమూల పల్లెలో జన్మించిన రంజిత్, తన సందేశాత్మక ప్రసంగాలతో వేలాది మంది విద్యార్థులు, యువతలో మనోధైర్యాన్ని నింపుతూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు. సామాజిక బాధ్యతతో రాష్ట్రంలోని ప్రతీ చిన్నారి భవిష్యత్తుకు బాటలు వేయాలనే ఉన్నత లక్ష్యంతో ఆయన 'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్' అనే సామాజిక సంస్థను స్థాపించి సేవలను విస్తరిస్తున్నారు.ఈ సందర్భంగా తన సంస్థ ఆశయాలను, సమాజ శ్రేయస్సు కోసం చేపడుతున్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. రంజిత్ ఆలోచనలను, సామాజిక దృక్పథాన్ని అభినందించిన సీఎం, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ'..

రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గానికి మద్దతు ప్రకటించిన ఆయన.. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ప్రతిపక్ష పార్టీలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్' అంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రతిపక్ష పార్టీని చీల్చి, ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాక్కునే విధంగా ఒకే తరహా పరిణామాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. 'ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ కూడా' అంటూ విమర్శలు చేశారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం టీఎంసీలో రెండు వర్గాలు పార్టీపై హక్కు కోరుతున్న నేపథ్యంలోనే ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మమతా బెనర్జీ వర్గం, మరో వర్గం ఇకపై 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఫ్లవర్స్ అండ్ గ్రాస్' గుర్తును ఉపయోగించకూడదని ఆదేశించింది. రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తుల నుంచి తమకు కావాల్సిన వాటిని ఎంచుకోవాలని సూచించింది. ఈ నిర్ణయం తుది తీర్పు కాదని, వివాదంపై తుది నిర్ణయం తర్వాత తీసుకోనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలోనే ప్రస్తుత టీఎంసీ పేరు, గుర్తుపై తాత్కాలిక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఇదే సమయంలో మమతా వర్గం ప్రత్యామ్నాయ పేరు, గుర్తు ఎంపికలను ఈసీకి పంపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈసీ నిర్ణయాన్ని తప్పుబట్టారు. టీఎంసీని బలహీనపరిచే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. బీజేపీకి ఈసీ అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు చేశారు. ఇవన్నీ కాంగ్రెస్ నేతల ఆరోపణలేనని, ఎన్నికల సంఘం మాత్రం తన మధ్యంతర ఉత్తర్వుల్లో రెండు వర్గాల హక్కులను సమానంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

## రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం

- 15 మంది కూలీలకు గాయాలు






సిద్దిపేట జిల్లా,18 సెప్టెంబర్ 2026 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : సిద్దిపేట జిల్లా పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలో రాజీవ్ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీలతో వెళ్తున్న ఒక ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న 15 మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి బాధితులను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రమాద తీవ్రత కారణంగా రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

## కొమురవెల్లి స్టేజి వద్ద ఆర్టీసీ బస్సు ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా

- గాయపడిన ప్రయాణికులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం



సిద్దిపేట: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి స్టేజి వద్ద సికింద్రాబాద్ - సిద్దిపేట మధ్య ప్రయాణిస్తున్న సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఆర్టీసీ ఎండీతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడగా, క్షతగాత్రులను అధికారులు వెంటనే సిద్దిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గాయపడిన ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్షణ వైద్య సహాయం అందించడంతో పాటు, అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# సంపాదకీయం

## కీలక నేతలు గుడ్ బై...

విశాఖపట్టణం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక నేతలంతా వరుసగా గుడ్ బై చెబుతుండటం, మౌనం వహించడంతో అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రంగంలోకి దిగారు. బెంగళూరు నుంచి తాడేపల్లికి తిరిగొచ్చిన జగన్ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాంలను ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో శ్రేణులకు ధైర్యం చెప్పేందుకు ఈ అత్యవసర భేటీలను నిర్వహించినట్లు తెలుస్తోంది.ఈ భేటీలో ప్రధానంగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు ..పార్టీకి ఒక్క సీటు కూడా రాదని చేసిన ప్రకటనపై చర్చ జరిగింది. సాధారణంగా పార్టీ గీత దాటి మాట్లాడే నేతలను దూరంగా పెట్టే జగన్, ఈసారి మాత్రం విభిన్నమైన వ్యూహాన్ని అమలు చేశారు. వ్యాఖ్యలు ఎలా ఉన్నా, ప్రస్తుతం పార్టీ సీనియర్లను కాపాడుకోవడమే ప్రాధాన్యంగా భావించిన జగన్..పార్టీలో అంతర్గత పోరును పరిష్కరిస్తానని చెప్పకుండా.. ఎవరైనా ఏమనుకున్నా సరే, రాబోయే ఎన్నికల్లో శ్రీకాకుళం లోక్‌సభ ఎంపీ అభ్యర్థిగా నీకే హామీ ఇస్తున్నా అని తమ్మినేనితో నేరుగా చెప్పినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.మరోవైపు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతోనూ జగన్ విడిగా భేటీ అయ్యారు. విజయనగరం జిల్లా రాజకీయాల్లో బొత్స తీరుపై రకరకాల చర్చలు జరుగుతున్న సమయంలో ఎన్నికల దిశగా పూర్తి స్పష్టత ఇచ్చారు. రాబోయే అసెంబ్లీ పోరులో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి నియోజకవర్గం నుంచే మళ్లీ పోటీకి సిద్ధమవ్వాలని అధినేత తేల్చిచెప్పినట్లు సమాచారం. నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా క్యాడర్‌ను సమాయత్తం చేసుకోవాలని సూచించారు.అయితే, అధినేత ఆఫర్ చేసిన టికెట్ల హామీలపై ఈ ఇద్దరు సీనియర్ నేతల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. ప్రస్తుత రీజియన్‌లో ఒకట్రెండు సీట్లు కూడా గెలిచే వాతావరణం కనిపించనప్పుడు, ఇప్పటి నుంచే ఈ సీట్ల ఖరారు వల్ల ప్రయోజనం ఏంటనే నిరాశ వారిలో కనిపిస్తోందని భావిస్తున్నారు. అందుకే ఈ సమావేశం ముగిసిన తర్వాత కూడా బొత్స గానీ, తమ్మినేని గానీ మీడియాతో ఏమీ మాట్లాడలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం విచిత్రమైన రాజకీయ వాతావరణం నెలకొంది. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను నడిపించిన తీరు, నేడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుసరిస్తున్న వ్యూహాలు పార్టీని మరింత నిరాశలోకి నెడుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో బలమైన నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై చాపరం భూకబ్జా కేసు నమోదు అయింది. .. హైకోర్టు వారికి తాత్కాలిక ఊరట నిచ్చింది. అయితే, కూటమి ప్రభుత్వ హయాంలో పోలీసులు కేసులు నమోదు చేసినప్పటికీ అరెస్టు కాకపోవడమే నేరమైనట్లు వైసీపీ అధిష్టానం భావించడం విడ్డూరంగా మారింది. అరెస్టు కాకుండా తప్పించుకున్నారంటే వారు కూటమి ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లేనని, కోవర్టులుగా మారిపోయారనే ముద్ర వేస్తున్నారు. ఈ అనుమానాల రాజకీయం కేవలం తమ్మినేని కుటుంబానికే పరిమితం కాలేదు. గతంలో వైఎస్సార్‌సీపీకి మూలస్తంభంగా ఉండి, ఇటీవలే రాజీనామా చేసి బయటకు వచ్చిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కూడా సరిగ్గా ఇదే తరహా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు అందరు కీలక నేతలపై ఏదో ఒక కేసు నమోదు కావడం లేదా అరెస్టులు జరగడం జరుగుతుంటే.. పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డిపై మాత్రం ఎలాంటి కేసులు, అరెస్టులు ఎందుకు నమోదు కావడం లేదని విజయసాయిరెడ్డి నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టానికి అతీతంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొన్న సజ్జల, ఇప్పుడు కూడా ఎలాంటి చిక్కులు లేకుండా బయటపడటం కోవర్టు రాజకీయమే కాదా అన్న ప్రశ్నను ఆయన అధిష్టానం ముందే ఉంచారు.వైసీపీ అధిష్టానానికి మొదటి నుంచీ ఒక అలవాటు ఉందనే విమర్శలు బలంగా ఉన్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రాణపణంగా నిలిచే సీనియర్ నేతలను సైతం.. చిన్నపాటి అనుమానం రాగానే వెన్నుపోటుదారులు గా ముద్రవేసి పక్కన పెట్టేస్తారు. గతంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను వంటి పలువురు సీనియర్లు పార్టీకి దూరం కావడం వెనుక ఈ అధిష్టానం అనుమానాస్పద వైఖరి ప్రధాన పాత్ర పోషించింది. ఇప్పుడు శ్రీకాకుళంలో తమ్మినేని వర్గాన్ని కూడా పార్టీ సమావేశాలకు పిలవకుండా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి నుంచి తప్పించి రాజకీయంగా ఏకాకిని చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ధోరణి వల్ల సీనియర్లు తమ ఆత్మాభిమానం కోసం ప్రత్యామ్నాయ దారులు చూసుకోవడం అనివార్యమవుతోంది.ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం వైసీపీలో ఉన్న ఈ బలహీనతను పక్కాగా వాడుకుంటోందనే విశ్లేషణలు వస్తున్నాయి. సీనియర్ నాయకులపై కేసులు నమోదు చేయడం , కొంతమంది విషయంలో చట్టపరమైన ప్రక్రియను సాగదీయడం ద్వారా వైసీపీ అధిష్టానంలో గందరగోళాన్ని సృష్టించడంలో కూటమి వ్యూహాత్మకంగా సఫలమవుతోంది. చట్టం తన పని తాను చేసుకుపోతున్నప్పటికీ, ఫలానా నేతను అరెస్టు చేయలేదంటే ఆయన తమతో కుమ్మక్కయ్యాడు అనే సందేశం వైసీపీ క్యాంపులోకి వెళ్లేలా మైండ్ గేమ్ ఆడటంలో అధికార పక్షం పైచేయి సాధిస్తోంది. ఆ ఉచ్చులో పడిన వైసీపీ నేతలు సొంత పార్టీ క్యాడర్‌లోనే అనుమానాల దావానాలాన్ని రగిల్చి నేతలను రోడ్డున పడేస్తున్నారు. అనుమానపు పక్షి కరిచిన చందంగా తయారైన వైసీపీ పరిస్థితి వల్ల దశాబ్దాలుగా పార్టీకి అండగా నిలిచిన క్షేత్రస్థాయి నాయకత్వం పూర్తిగా దెబ్బతింటోంది. ప్రతి చిన్న అంశాన్ని కోవర్టు కోణంలోనే చూస్తే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీలో మిగిలేది కొద్దిమంది చుట్టూ ఉన్న కోటరీ మాత్రమే తప్ప, ప్రజాక్షేత్రంలో నిలబడే నాయకులు ఉండరనేది పచ్చి నిజం

## గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర)మహబూబ్‌నగర్ పట్టణంలోని మెట్టుగడ్డ సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని గదులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో బోర్ లో భూగర్భ మట్టం తగ్గడంతో నీటి ప్రవాహం తక్కువగా ఉందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు వెల్లడించిన సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వసతి గృహ పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, క్రమశిక్షణతో మెలగాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతి, విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని శ్రద్ధగా చదివితే తమ లక్ష్యాలను సాధించవచ్చని ఆమె విద్యార్థులకు సూచించారు.అనంతరం వార్డెన్ కార్యాలయంలోని రికార్డులు, హాజరు



రిజిస్టర్, సి.సి టీవీ కెమెరాల నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. ఈ విషయంపై జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి (ఋఋా)తో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని కలెక్టర్ వెంట ఉన్నారు.

## కొత్త మొల్గర జడ్.పి.ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

### పారిశుధ్యం, తాగునీరు, విద్యార్థుల వసతులపై పరిశీలన

మహబూబ్ నగర్ విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 18భూత్పూర్ మండల పరిధిలోని కొత్త మొల్గర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యాలను ఆయన పరిశీలించారు. తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం, క్రీడా మైదానం, మరుగుదొడ్లను స్వయంగా పరిశీలించి పరిశుభ్రత పరిస్థితులను సమీక్షించారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి పరిశుభ్రమైన వాతావరణం ఎంతో అవసరమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యం, గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు.అనంతరం విద్యార్థులతో అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి లభ్యత, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్ల పనితీరు, మధ్యాహ్న భోజనం నాణ్యత తదితర అంశాలపై విద్యార్థులను అడిగి వివరాలు సేకరించారు.పాఠశాలలో మౌలిక వసతులకు



సంబంధించి ఏవైనా సమస్యలు, లోపాలు ఉంటే వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

## బీచుపల్లి శ్రీ ఆంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.39.85 లక్షలు

### 205 రోజుల హుండీ లెక్కింపులో 1.680 కిలోల వెండి

ఎర్రవల్లి సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం లోని బీచుపల్లి శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.39,85,166 వచ్చినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు.శుక్రవారం విజయరాయ కల్యాణ మండపంలో దేవాదాయ శాఖ గద్వాల డివిజన్ పరిశీలకురాలు వెంకటేశ్వరి, ఆలయ ఈఓ, సిబ్బంది, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గద్వాల శాఖ సిబ్బంది, గద్వాల మహిళా సేవా సమితి సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు.205 రోజుల కాలానికి సంబంధించిన హుండీని లెక్కించగా నోట్ల రూపంలో రూ.37,19,705, నాణేల రూపంలో రూ.2,65,461 కలిపి మొత్తం రూ.39,85,166 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.హుండీలో 1.680 కిలోల మిశ్రమ వెండి వచ్చిందని బంగారం మాత్రం లభించలేదని తెలిపారు.



## మాతృ మరణాల నివారణకు పటిష్ట చర్యలు

### డిఎంహెచ్ఓ.డాక్టర్. సంధ్యా కిరణ్మయి

గద్వాల సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లాలో నమోదైన మాతృ మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. సంధ్యా కిరణ్మయి ఆధ్వర్యంలో, జిల్లా ఎంహెచ్ఎన్.ప్రోగ్రాం అధికారి డా. ప్రసూన రాణి పర్యవేక్షణలో ప్రత్యేక వైద్య నిపుణులు డా. ప్రియాంక (డిజిఓ), డా. దామ వంశీ జనరల్ ఫిజీషియన్ల ద్వార సమగ్ర మాతృ మరణాల సమీక్షను డిఎంహెచ్ఓ. కార్యాలయంలో నిర్వహించారు.ప్రతి మాతృ మరణాన్ని కేసు వారిగ పరిశీలించి, వైద్య, సామాజిక, కుటుంబ, గర్భధారణ, ప్రసవ, ప్రసవానంతర కారణాలను లోతుగ విశ్లేషించారు. ముఖ్యంగ ఏఎన్సీ. సేవలు, ప్రమాద గర్భిణుల ముందస్తు గుర్తింపు, రక్తహీనత నివారణ, సకాలంలో రిఫరల్, ప్రసవ సమయంలో అత్యవసర వైద్య సేవలు, ప్రసవానంతర సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేకంగ సమీక్షించారు.ప్రమాద గర్భిణులను ముందుగానే గుర్తించి, నిర్ణీత సమయంలో ఏఎన్సీ. పరీక్షలు నిర్వహించడం, రక్తహీనతను గుర్తించి సమర్థవంతమైన చికిత్స అందించడం, అధిక ప్రమాద పరిస్థితుల్లో సకాలంలో ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయడం, ప్రసవానంతరం తల్లి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం వంటి చర్యలను పటిష్టంగ అమలు చేయాలని సూచించారు.అలాగే గర్భిణులు, ప్రసవానంతర మహిళల్లో అధిక రక్తస్రావం, అధిక రక్తపోటు, తీవ్రమైన తలనొప్పి,



చూపు మసకబారడం, శ్వాసలో ఇబ్బంది, మూర్ఛలు, తీవ్రమైన బలహీనత వంటి ప్రమాద సంకేతాలను కుటుంబ సభ్యులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం.లు సకాలంలో గుర్తించి వెంటనే వైద్య సేవలు అందేల చర్యలు తీసుకోవాలని తెలిపారు."ప్రతి తల్లి ప్రాణం ఎంతో విలువైనది. ఒక్క మాతృ మరణం కూడా పునరావృతం కాకుండ క్షేత్రస్థాయి నుంచే నివారణ చర్యలను పటిష్టంగ అమలు చేయాలి. ప్రతి కేసులోని లోపాలను గుర్తించి సరిదిద్దుతు మాతృ మరణాల నివారణకు సమష్టిగ కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సంబంధిత వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎం.లు,ఎస్ఓ. తిరుమల్ రెడ్డి,డిపిహెచ్ఎన్ఓ. వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## యూపీఐతో గ్లోబల్ రెమిటెన్స్‌కు విజ్ ఫైనాన్సియల్ యాప్



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) : యూపీఐ ఆధారిత చెల్లింపులను అంతర్జాతీయ మనీ ట్రాన్స్‌ఫర్లతో అనుసంధానిస్తూ విజ్ ఫైనాన్సియల్ కొత్త డిజిటల్ యాప్‌ను జిఎఫ్ఎఫ్-2026లో ఆవిష్కరించినట్లు విజ్ ఫైనాన్సియల్ వ్యవస్థాపకుడు, గ్రూప్ సీఈఓ అమీర్ నాగమ్మీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజ్ ఫైనాన్సియల్ ఇండియా డైరెక్టర్, సీఈఓ ఆర్.కృష్ణన్ తోకలసి ఆయన మాట్లాడుతూ స్విచ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా భారత్, అమెరికా, యూఏఈలను అనుసంధానించి, 80కి పైగా దేశాలకు క్రాస్-బోర్డర్ పేఔట్స్ అందించనున్నట్లు తెలిపారు. యాప్ ద్వారా రెమిటెన్సులు, ఫారెక్స్, మల్టీ-కరెన్సీ కార్డులు, యూపీఐ, బిల్ పేమెంట్లు, రీచార్జ్‌లు, ట్రావెల్, వీసా సేవలు అందనున్నాయని తెలిపారు. భారత్‌లో 22 రాష్ట్రాల్లో 360కి పైగా బ్రాంచ్‌లతో 50 లక్షలకు పైగా కస్టమర్లకు సంస్థ సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## సింహపురి వైసీపీ నేతల కొత్త రాజకీయం

నెల్లూరు, ,నెల్లూరు జిల్లా రాజకీయాల్లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను లక్ష్యంగా చేసుకుని వైసీపీ నేతలు రోజుకొకరు చొప్పున ప్రెస్‌మీట్లు పెట్టి అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో, నిధుల కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగాయని, తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయంటూ ప్రకటనలు చేస్తున్నారు. అయితే, చేతిలో నిజంగా ఒక్క కాగితమైనా ఉంటే సాక్షి టీవీ మొదలుకుని సోషల్ మీడియా వరకు భూతద్దంలో పెట్టి రోజుకు వందల వార్తలు, రీల్స్‌తో హోరెత్తించే వైసీపీ ప్రచార యంత్రాంగం.. ఆధారాలు ఉన్నాయని సొల్లు చెబుతూంటే.. ఎవరూ నమ్మడం లేదు.సాధారణంగా ఏ రాజకీయ నేతపైనైనా అవినీతి ఆరోపణలు చేస్తే ప్రజల్లో కొంతైనా చర్చ జరుగుతుంది. కానీ, మంత్రి నారాయణ విషయానికి వస్తే నెల్లూరు ప్రజల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా ఈ ఆరోపణలను విశ్వసించే పరిస్థితి లేదు. నారాయణ విద్యాసంస్థల ద్వారా వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని స్వయంగా నిర్మించిన ఆయన.. రాజకీయాల్లోకి వచ్చి చిల్లర అవినీతికి పాల్పడతారంటే నెల్లూరు నగర ఓటర్లు ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. ఆపదలో ఉన్నవారికి విద్య, వైద్యం, వ్యక్తిగత ఆర్థిక సహాయం అందించే దాతృత్వ స్వభావం ఆయనదని, ప్రజలకు ఎప్పుడూ ఇచ్చే చేతే తప్ప ఆశించే మనస్తత్వం కాదని నగరంలో బలంగా ఒక ముద్ర ఉంది. అటువంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నేతపై బురదజల్లితే అది తిరిగి ఎదురుదెబ్బే కొడుతుందన్న ప్రాథమిక స్పృహ వైసీపీ నాయకత్వానికి కొరవడింది.ఈ ఆరోపణల వెనుక అసలు ఎజెండా రాబోయే నెల్లూరు నగర పాలక సంస్థ సహా జిల్లాలోని స్థానిక సంస్థల ఎన్నికలేనని స్పష్టమవుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని అన్ని స్థానాలను కోల్పోయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న వైసీపీ.. కేడర్‌లో స్థైర్యం నింపేందుకు, ఉనికిని చాటుకునేందుకు నారాయణపై టార్గెట్ ఫిక్స్ చేసుకుంది. నగర ఓటర్లలో నారాయణకు ఉన్న పట్టును, అభివృద్ధి రూపకర్తగా ఉన్న ఇమేజ్‌ను దెబ్బతీయకపోతే కార్పొరేషన్ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవనే భయం వైసీపీ నేతల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే ఎటువంటి పూర్వాపరాలు, పత్రాలు లేకుండా కేవలం మీడియా ముఖంగా మైకులు పట్టుకుని బురదజల్లే సరికొత్త రాజకీయ డ్రామాకు తెరతీశారు.విచిత్రమేమిటంటే.. నారాయణపై అవినీతి మరకలు అద్దాలని చూస్తున్న కాకాణి గోవర్ధన్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వంటి నాయకుల బ్యాక్‌గ్రౌండ్ ఏమిటన్నది నెల్లూరు జిల్లా ప్రజలకు తెలియనిది కాదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కోర్టు ఫైళ్ల మాయం కేసు నుంచి అక్రమ మైనింగ్, ఇసుక దందాలు, సెటిల్‌మెంట్ల వరకు కాకాణిపై వచ్చిన ఆరోపణలు నెల్లూరు చరిత్రలోనే తీవ్రమైనవిగా నిలిచాయి. మరోవైపు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వ్యవహార శైలి, పెత్తనం గురించి స్థానికంగా కథలు కథలుగా చెప్పుకుంటారు. తమ పాలనలో వేల కోట్ల దోపిడీకి తెరతీసి, ప్రజాధనాన్ని స్వాహా చేశారని విమర్శలు ఎదుర్కొంటున్న ఈ నేతలు.. నేడు నారాయణ నీతి గురించి లెక్చర్లు ఇస్తుండటాన్ని చూసి నెల్లూరు పౌర సమాజం విస్మయం చెందుతోంది.నిరాధార ఆరోపణలతో ప్రత్యర్థులను అప్రతిష్టపాలు చేయాలనే వ్యూహం కొన్నిసార్లు పనిచేయవచ్చు కానీ, ప్రజల్లో నమ్మకం ఉన్న వ్యక్తిపై గుడ్డిగా దాడికి దిగితే అది సెల్ఫ్ గోలే. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ నారాయణపై విషం చిమ్మే ప్రయత్నం చేయడం ద్వారా వైసీపీ తన మిగిలిన పరువును కూడా పోగొట్టుకుంటోంది.

## తల్లి-చెల్లితో సెటిల్మెంట్ దిశగా పావులు

కడప, సెప్టెంబర్ 18,కుటుంబం విషయంలో జగన్ తప్పుల్ని దిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వైఎస్సార్ కుటుంబ అంతర్గత కలహాలు ఇప్పటికే రాజకీయంగా, సామాజికంగా ఊహించని నష్టాన్ని మిగిల్చాయి. ఎన్నికల వేళ చెల్లి షర్మిల, తల్లి విజయమ్మ రోడ్డెక్కి బహిరంగ లేఖలు రాయడం, పంపకాలపై కోర్టు మెట్లెక్కడం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ విశ్వసనీయతను దారుణంగా దెబ్బతీశాయి. ఇంట్లోనే న్యాయం చేయలేని నాయకుడు రాష్ట్రానికి ఏం చేస్తాడన్న విపక్షాల ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లిందన్నది కాదనలేని సత్యం. ఈ క్రమంలో ఈ నష్టాన్ని ఇలాగే కొనసాగనిస్తే భవిష్యత్తు మరింత అగమ్యగోచరంగా మారుతుందని గ్రహించిన జగన్.. కుటుంబంతో వివాదాలకు తెరదించి, తల్లి-చెల్లితో సెటిల్మెంట్ దిశగా పావులు కదుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది.ఈ పరిణామాల వెనుక ఉన్న ముఖ్య కారణం.. చుట్టూ ఉన్న సొంత కోటరీ పై జగన్‌కు నమ్మకం సన్నగిల్లడమేనని తెలుస్తోంది. వైఎస్ వివేకా హత్య కేసు నుంచి మొదలుకొని, షర్మిలకు వాటాల నిరాకరణ, ఎన్‌సీఎల్‌టీ వరకు వివాదాన్ని తీసుకెళ్లడంలో జగన్ పక్కనున్న కొందరు కీలక నేతలు, సలహాదారులే తప్పుడు మార్గదర్శనం చేశారన్న భావన ఇప్పుడు ఆయనలో బలపడినట్లు చెబుతున్నారు. కుటుంబంలో సయోధ్య కుదిర్చే బదులు చిచ్చు రాజేసి, తమ సొంత ప్రయోజనాలను కాపాడుకున్నారని ఆయన గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. తల్లి, చెల్లిని దూరం చేసుకుని పార్టీ పరంగానే కాకుండా నైతికంగా తీవ్ర ఏకాకిగా మారిన పరిస్థితుల్లో.. తన కోటరీ మాటలను పక్కనపెట్టి నేరుగా రాజీకి సిద్ధపడటమే మేలనే ఆలోచనకు జగన్ వచ్చినట్లు భావిస్తున్నారు.జగన్ ఆలోచనా విధానంలో వస్తున్న ఈ మార్పుకు జాతీయ రాజకీయ సమీకరణాలు కూడా ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. కేంద్రంలో బీజేపీతో ఉన్న సమీకరణాలు, రాష్ట్రంలో కూటమి పటిష్టత దృష్ట్యా.. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పుంజుకుంటుందనే గట్టి నమ్మకం వైఎస్సార్‌సీపీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. బీజేపీ అండ లేకపోతే కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి రక్షణ కష్టమని ఇన్నాళ్లూ భావించినప్పటికీ.. రేపటి రోజున కేంద్రంలో కాంగ్రెస్ కీలకంగా మారితే తన రాజకీయ భవిష్యత్తు కోసం ఆ పార్టీతో సఖ్యత తప్పనిసరి అని జగన్ అంచనా వేస్తున్నట్లు వినికిడి. అయితే, కాంగ్రెస్‌తో తెరవెనుక చర్చలు జరగాలన్నా, పార్టీ పెద్దల మద్దతు లభించాలన్నా.. ముందుగా రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్‌గా ఉన్న చెల్లెలు వైఎస్ షర్మిలతో ఉన్న వైరాన్ని పూర్తిగా పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఇరువర్గాల మధ్య రాయబారానికి చొరవ చూపుతున్నారన్న గుసగుసలు బలపడుతున్నాయి.ఒకవేళ ఈ సెటిల్మెంట్ నిజంగానే పట్టాలెక్కితే.. గతంలో కుదిరిన ఎంవోయూ ప్రకారం సరస్వతి పవర్, భారతి సిమెంట్స్, సాక్షి , బెంగుళూరు ఎలహంక ప్యాలెస్ వంటి ఆస్తుల వాటాలను షర్మిల, విజయమ్మ పేర్లపైకి బదలాయించేందుకు జగన్ సిద్ధపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రాజకీయాల్లో అక్రమ సంపాదనగా ప్రత్యర్థులు ముద్రవేసిన ఆస్తుల్లో సైతం తన హక్కు కోసం పోరాడుతున్న షర్మిలకు ఆమె వాటా దక్కితే వివాదం సమసిపోవచ్చు. అయితే, జగన్ ఉచితంగా ఈ పంపకాలకు ఒప్పుకుంటారా అంటే కాదనే చెప్పాలి. ఆస్తుల సర్దుబాటుతో పాటుగా.. భవిష్యత్తులో జగన్‌ను రాజకీయంగా టార్గెట్ చేయకుండా ఉండాలని, రాజకీయంగా సహకరించారని షరతు పెట్టే అవకాశం ఉంది. అయితే, గత ఐదేళ్లలో వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్ర అవమానాలను ఎదుర్కొన్న షర్మిల.. కేవలం ఆస్తుల సర్దుబాటుతో జగన్ పెట్టే రాజకీయ షరతులకు ఏమేరకు తలొగ్గుతారు, కాంగ్రెస్ అధిష్టానం జగన్‌ను ఎంతవరకు విశ్వసిస్తుందనేది మాత్రం ఎవరూ చెప్పలేరు.

## మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో పురిటి బిడ్డ మృతి

మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం వేకువ జామున పురిటి బిడ్డ మృతి చెందాడు. బాధితుల కథనం ప్రకారం.. పుంగనూరు పట్టణానికి చెందిన సాదిక్ భాషా భార్య సుమియా సుల్తానా 2 రోజుల క్రితం పురిటి నొప్పులతో ఆసుపత్రిలో చేరింది. డెలివరీ ఆలస్యం కావడంతో స్థానిక సిబ్బంది సలహాతో జిల్లా ఆస్పత్రిలో నీటి కొరత కారణంగా స్నానం చేసుకోని గురువారం బసినికొండలోని బంధువుల ఇంటికివెళ్లి, స్నానం చేసి అదేరోజే రాత్రి 10.30 గంటలకు తిరిగి ఆసుపత్రిలో జాయిన్ అయ్యింది.

## రేణిగుంటలో విషాదం విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య

రేణిగుంటహాస్టల్లో ఉండలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. కార్యాలయం సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఘటన జరిగింది. పదహారేళ్ల బాలుడు ఫ్యాన్కు ఉరివేసుకుని ప్రాణాలు విడిచాడు. మృతుడు పిచ్చాటూరు గ్రామానికి చెందిన కె. పవన్ కళ్యాణ్ (16)గా గుర్తించారు,. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. విద్యార్థి మృతిని గమనించిన కళాశాల యాజమాన్యం వెంటనే అమర హాస్పిటల్కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. రేణిగుంట పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు

## సందీప్ నగర్ శివాలయంలో వినాయకుని దర్శించుకున్న చైర్మన్, కౌన్సిలర్, కమిషనర్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్18:(విజన్ ఆంధ్ర) ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు సందీప్ నగర్‌లోని శివాలయంలో ప్రతిష్ఠించిన శ్రీ వినాయకుడిని మున్సిపల్ చైర్మన్ ఆకాష్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, స్థానికులతో కలిసి వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ సిబ్బంది చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు,ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ రాపర్తి కార్తీక్, వినోద్ , బాలకృష్ణ ,మున్సిపల్ సిబ్బంది శివాలయం కమిటీ సభ్యులు రామగిరి అశోక్, చంద్ర శేఖర్, రాపర్తి నాగరాజు, రాపర్తి శంకర్, రాజేందర్, సాయి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

### ప్రశాంత వాతావరణంలో ఉత్సవం జరిగేలా చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్ లతో కలిసి వివిధ శాఖల అధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన నిమజ్జన ఘాట్లు, భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రత తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. భోరాజ్ పెన్‌గంగా నది, గ్రామీణ ప్రాంతంలోని చందా వాగు వద్ద నిమజ్జన ఘాట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రధాన ఘాట్ల వద్ద భారీ క్రేన్లు, విద్యుత్ దీపాలు, జనరేటర్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు లైటింగ్ కల్పించాలని సూచించారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అనుభవజ్ఞులైన ఈతగాళ్లు, లైఫ్‌జాకెట్లు, బోట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విగ్రహాలను తరలించే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా రాకపోకల మార్గాలను ముందుగానే గుర్తించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, చెత్త తొలగింపు, తాగునీరు, వైద్య సిబ్బంది, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. నిమజ్జనోత్సవం పూర్తయ్యే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన



సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అధికారులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని పెన్‌గంగా నది తీరం, చందా వాగు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల్లో విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు గస్తీ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెన్‌గంగా ప్రాంతం సరిహద్దు ప్రాంతం కావడంతో అంతర్రాష్ట్ర రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు, ఇతర శాఖల అధికారులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అనూష, డీఎస్పీ జీవన్, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకే మా ప్రాధాన్యత: సిద్దిపేట షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) మహిళల రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న సిద్దిపేట జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణ పాఠశాలలో లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ దుర్గ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు వేధింపులకు గురైనప్పుడు మౌనంగా ఉండకుండా షీ టీమ్‌ను సంప్రదించాలని కోరారు. షీ టీమ్ ఎలా పనిచేస్తుంది మరియు ఆపదలో ఉన్నవారికి ఎలాఅండగాఉంటుందనీవివరించారు. ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, సైబర్ బుల్లీయింగ్ మరియు మానవ అక్రమ రవాణాపై అప్రమత్తత, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, చైల్డ్ అబ్యూజ్ మరియు 'గుడ్ టచ్ – బాడ్ టచ్' పట్ల అవగాహన గురించి వివరించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు మరియు ం-ఘుటవ యాప్ యొక్క ప్రాముఖ్యతతెలియజేశారు. ఎక్కడైనా, ఎప్పుడైనా వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే డైల్ 112 లేదా సిద్దిపేట షీ టీమ్ నంబర్ 8712667434 కు సమాచారం అందించాలి. బాధితుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని పిపిటి ప్రజెంటేషన్ ద్వారా ఇన్స్పెక్టర్ దుర్గా తెలియజేశారు.

## రెవెన్యూ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) రెవెన్యూకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా నడికూడ మండల తహసిల్దార్ కార్యాలయంలో జరుగుతున్న భూభారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి తహసీల్దార్ రాణి, ఇతర అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యాలయంలోని రికార్డు రూము నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. రికార్డు రూముకు సంబంధించిన పలు అంశాలను తహసిల్దార్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. నడికూడలో నిర్మాణంలో ఉన్న పాల శీతలీకరణ కేంద్రం భవనం పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ధర్మారం " నడికూడ మధ్య కొత్తగా నిర్మించిన బ్రిడ్జిని కలెక్టర్ పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణ, ఇతర శాఖల అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

### నడికూడా మండలం రామకృష్ణాపూర్, కంఠాత్మకూర్ గ్రామాలలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గా ఉండే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని రామకృష్ణాపూర్ , కంఠాత్మకూర్ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు, తాగునీటి సరఫరాను స్వయంగా పరిశీలించారు. రామకృష్ణాపూర్ లోని మండల ప్రాథమిక పాఠశాల లలో గల అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రం నిర్వహణ, పిల్లలకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న వి ఓ భవన పురోగతి ని కుడా చూశారు అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల వివరాల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాల వివరాలను కలెక్టర్



అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంఠాత్మకూర్ లోని మండల ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, విద్యా ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక బోధన, కేంద్రంలో ఉన్న మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం వంటలు చేసారా లేదా అని వంటశాల కి వెళ్లి పరిశీలించారు గుడ్లు, ఇతర వంట సామాగ్రి సరిపడా నిల్వలు ఉన్నాయా లెవా అని అడిగారు మహ్మద్ షరీఫ్ కుంటను కలెక్టర్ పరిశీలించి.. కుంట పరిరక్షణకు వీబీజీ రాంజీ పథకం కింద అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ, 8వ, 10వ తరగతి గదులను జిల్లా కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. ఆంగ్ల, తెలుగు భాషలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థుల వివరాలను పరిశీలించి, విద్యార్థులు పాఠశాలకు ఎందుకు హాజరు కావడం లేదనే కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు నిరంతరం సురక్షితమైన తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందుతున్న సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం అంచనా వేయాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థుల హాజరును మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యంతో పాటు క్రీడా, సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించే విధంగా బోధన కొనసాగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ సర్పంచ్ పెండ్లి లక్ష్మి, కంఠాత్మకూర్ సర్పంచ్ కొంగంటి తిరుపతి, తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ రామకృష్ణ,పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఈజీఎస్, విద్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్ట్ ల దీక్ష... సంఘీభావం తెలిపిన నార్కట్ పల్లి విలేకరులు

ంనార్కట్‌పల్లి, సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర): ంజర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నల్గొండలో టీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు నార్కట్‌పల్లి జర్నలిస్టులు సంఘీభావం తెలిపారు. శుక్రవారం నిర్వహించిన దీక్షలో జిల్లా అధ్యక్షుడు గారపాటి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలిమామిడి మహేందర్‌రెడ్డి, దొడ్డి శ్రీనివాస్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.ంఈ సందర్భంగా నార్కట్‌పల్లి టీయూడబ్ల్యూజే " ఐజేయూ మండల కమిటీ నాయకులు దీక్షకు మద్దతు ప్రకటించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో టీయూడబ్ల్యూజే " ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రజ్ఞాపురం శివశంకర్, మండల అధ్యక్షుడు వసునూరి చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు బాశెట్టి శ్రీనివాస్, కోశాధికారి సోమ వెంకట్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి రాధారపు రమేష్,సభ్యులు కన్నబోయిన నరసింహ, సిరిశెట్టి సంతోష్, గూడూరు అంజిరెడ్డి, కే. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను చెప్పబోతే...తోసెయ్యడమా !

### ఓర్పుతో విని పరిష్కరించే మార్గం చూపాల్సిన అధికారులే కన్నెర్ర చేశారు

### ప్రజా సమస్యలపై గళమెత్తితే గొంతు నొక్కి పోలీస్ కేసులు


### మీడియా సమావేశంలో తన ఆవేదనను వెల్లడించిన బిజెపి రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 ( విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులో మౌలిక వసతులు కల్పించాలని కోరిన బిజెపి నాయకులపై కన్నెర్ర చేసి పోలీస్ కేసులు నమోదు చేయించారని బిజెపి రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో గల జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు తొడిగల సదానంద్ రెడ్డినివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత కొన్ని రోజుల క్రితం వికారాబాద్ బ్లడ్ బ్యాంక్ ను పరిశీలించేందుకు వెళ్లగా.. అక్కడ బ్లడ్ బ్యాంక్ లో సరైన సౌకర్యాలు, ఏసీలు లేక పోవడంతో బ్లడ్ బ్యాంక్ సవ్యంగా కొనసాగడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ లేక ప్రైవేటు బ్లడ్ బ్యాంక్ లు వెలువడడంపైఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో అవసరం వచ్చే బ్లడ్ బ్యాంక్ ప్రజలకు అందుబాటులో లేక పోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా



స్పందించిన కలెక్టర్ ఈ సమస్య తమ దృష్టికి వచ్చిందని సమాధానం చెప్పారన్నారు. అయినప్పటికి ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో త్వరగా పరిష్కరించాలని కోరేందుకు జిల్లా కలెక్టర్ ఛాంబర్ కు వెళ్లడం జరిగిందని తెలిపారు. సమస్యను పరిష్కరించడంలో జిల్లా అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించకుండా వారిని చాంబర్ నుండి బయటికి బలవంతంగా తోసేశారని ఆయన ఆరోపించారు. సెల్ ఫోన్ లో రికార్డు చేసిన నాయకుల నుంచి పోలీసులు రికార్డులను డిలిట్ చేయించి 5 మందిపై కేసులు నమోదు చేయించారన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్రరావు,ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి లుతమకు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారన్నారు. వారి సహకారంతోనే నాయకులు బయటకు రావడం జరిగిందన్నారు. ప్రజలసమస్యలు పరిష్కరించాలని అడిగితే తమపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా ప్రజల సమస్యలపై నిరసనలు తెలియజేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కలెక్టర్ అంటే తమకేంతో గౌరవమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్, మోహన్రెడ్డి, శ్రీకాంత్, సుధాకర్, స్వాతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'యారీ కీ నయా వైబ్' పేరుతో విజయ్ దేవరకొండ ప్రచారం



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) : హౌస్ ఆఫ్ మెక్‌డొవెల్స్ సోడా తన దీర్ఘకాల బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండతో కలిసి 'యారీ కీ నయా వైబ్' పేరుతో తాజా ప్రచారాన్ని ఆవిష్కరించిందని డయాజియో ఇండియా మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్, కేటగరీ హెడ్ ఆనందితా దత్తా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాచి అండ్ సాచి ఇండియా చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ కార్తీక్ స్మెటాసెక్ తోకలసి ఆయన మాట్లాడుతూ స్నేహంతో బ్రాండ్‌కు ఉన్న అనుబంధాన్ని కొనసాగిస్తూ, కొత్త తరం స్నేహాన్ని అనుభవించే విధానంలో వస్తున్న మార్పులను ఈ ప్రచారం ప్రతిబింబిస్తుందని తెలిపారు. కేవలం కలిసి సమయం గడపడం కాకుండా, ప్రతి కలయికను మరింత గుర్తుండిపోయేలా చేసే కొత్త అనుభవాలను సృష్టించడమే ప్రచార లక్ష్యమని పేర్కొన్నారు.

# రోడ్డు భద్రతపై పటిష్ట చర్యలు చేపట్టాలి

### అధికారులు సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.

### – నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) రోడ్డు భద్రత పై పటిష్టమైన చర్యలు చేపట్టి, సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్ లో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రత సమావేశంలో కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవసరమైన సైనేజీలు, రోడ్డు భద్రతా సూచికలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల పరిసర ప్రాంతాలను పరిశీలించి, విద్యార్థుల భద్రతకు అవసరమైన చోట అదనపు సైనేజీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్‌అండ్‌బీ, పోలీస్, మున్సిపల్, గ్రామపంచాయతీ తదితర శాఖలు తమ పరిధిలోని రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదాలకు కారణమయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు, రిఫ్లెక్టివ్ స్ట్రిప్స్ తదితర భద్రతా చర్యలను ప్రతిపాదించి అమలు చేయాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి, వాటికి సంబంధించిన వివరాలను తదుపరి సమీక్షా సమావేశానికి సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. నిధులు అందుబాటులోకి వచ్చిన వెంటనే రోడ్డు భద్రతకు సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు సకాలంలో వైద్య సహాయం అందేలా అంబులెన్స్, లైఫ్ సపోర్ట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. 108 అంబులెన్స్ సేవలపై సమగ్రంగా సమీక్షించి, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు వేగంగా సంఘటనా స్థలానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న అంబులెన్స్‌ల సంఖ్య, వాటి సేవల లభ్యత, 24 గంటల అత్యవసర సేవల పరిస్థితి, ప్రమాద ప్రాంతాలకు చేరుకునే మార్గాలు తదితర అంశాలపై స్పష్టమైన వివరాలతో తదుపరి సమావేశానికి ప్రెజెంటేషన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఎన్‌హెచ్ అధికారులతో సమన్వయం చేసి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు, అత్యవసర వైద్య సహాయక వ్యవస్థ, అంబులెన్స్ రూట్ ప్లాన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. రాబోయే గణేష్ నిమజ్జనం కార్యక్రమాల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్, మున్సిపల్, గ్రామపంచాయతీ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు



చేపట్టాలన్నారు. నారాయణపేట మున్సిపల్ పరిధిలో రోడ్లకు అడ్డుగా ఉన్న చెట్లు, కొమ్మలను గుర్తించి అవసరమైన మేరకు తొలగింపు/కొమ్మల కత్తిరింపు చర్యలు చేపట్టాలని తెలిపారు. పూర్తిగా చెట్లను తొలగించకుండా, అవసరమైన మేరకు కొమ్మలను మాత్రమే కత్తిరించాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలో గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు, తీసుకున్న చర్యలు, ప్రస్తుతం చేపడుతున్న పనులు, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. అనంతరం రోడ్డు భద్రత సమీక్షా సమావేశాన్ని అక్టోబర్ మొదటి వారంలో, 14వ తేదీ లోపు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సమావేశానికి కేవలం వివరాలతో కాకుండా శాఖల వారీగా చేపట్టిన పనులు, పురోగతి, తదుపరి కార్యాచరణపై స్పష్టమైన ప్రెజెంటేషన్లతో అధికారులు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణయ్య, ఆర్టీవో మెంబర్ పోషల్ రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, ఆర్టీవో మున్నీ, సీ ఐ శివ శంకర్, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ట్రాఫిక్ ఇన్స పెక్టర్ కృష్ణచైతన్య, నేషనల్ హైవే అధికారి, తదితరులు పాల్గొన్నారు.

## పోచంలోద్ది ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా గిరిజన సంక్షేమ శాఖా ఉప సంచాలకులు జాదవ్ అంబాజీ



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18: (విజన్ ఆంధ్ర )కోమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల్ పోచంలోద్ది ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారుఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులహాజరు, తరగతి గదుల బోధన, వసతి గృహ నిర్వహణ, భోజనశాల, వంటశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులలతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, ఆహారం నాణ్యత, వసతి సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారూ. పాఠశాలలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం అందేలా అధికారులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు విద్యార్థినులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు, ఆకస్మిక తనిఖీతో పాఠశాల నిర్వహణపై మరింత బాధ్యతతో పనిచేయాలని సిబ్బందికి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీ స్పష్టం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన వేడుకల భద్రతను పరిశీలించిన ఎస్సై వెంకటేశ్వర్లు



నారాయణపేట, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) నారాయణపేట పట్టణంలోని కొండారెడ్డిపల్లి చెరువు వద్ద గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్, విద్యుత్ శాఖ, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. గణేష్ నిమజ్జన సందర్భంగా భక్తులు, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఎలక్ట్రికల్ ఏఈ, మున్సిపల్ సిబ్బందితో కలిసి నిమజ్జన ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, అవసరమైన చోట్ల క్లీనింగ్ పనులు చేపట్టేలా మున్సిపల్ సిబ్బందికి సూచనలు చేశారు. చెరువులో ప్రస్తుతం నీటిమట్టం తక్కువగా ఉన్నందున విగ్రహాల నిమజ్జనం సమయంలో భక్తులు నీటిలోకి వెళ్లకుండా, ప్రమాదాలకు అవకాశం లేకుండా లోతట్టు ప్రాంతాన్ని గుర్తించి, ఆ ప్రాంతంలోనే విగ్రహాలను నిమజ్జనం చేసే విధంగా ప్రత్యేక రూట్ మార్గాన్ని ఏర్పాటు చేశారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, వాహనాలు మరియు భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందన్నారు. నిమజ్జన ప్రదేశంలో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, నీటిమట్టం తక్కువగా ఉన్న పరిస్థితుల్లో ప్రమాదాలు జరగకుండా లోతట్టు ప్రాంతాన్ని గుర్తించి, విగ్రహాల నిమజ్జనానికి అనువైన మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో పిల్లలు, వృద్ధులు నీటిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్వాహకులు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో నిమజ్జన మార్గంలో విద్యుత్ తీగలు, ఇతర విద్యుత్ సంబంధిత ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది ద్వారా చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నిమజ్జనం అనంతరం కూడా పారిశుద్ధ్య చర్యలు చేపట్టేలా సమన్వయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు, యువత పోలీస్ శాఖకు సహకరించి నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని టౌన్ ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

## రక్షిత త్రాగునీటి సరఫరాకు చర్యలు

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18,( విజన్ ఆంధ్ర)జిల్లాలోని మారుమూల గ్రామాలలో ప్రజలకు రక్షిత త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లింగాపూర్ మండలం కంచనపల్లి గ్రామపంచాయతీ సందర్శించి త్రాగునీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రక్షిత త్రాగునీరు వినియోగించకపోవడం వల్ల వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. పరిసర గ్రామ పంచాయతీలను కలుపుకుని ఒక ఉమ్మడి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు, అవసరాలను తెలుసుకుని, త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అందుబాటులో ఉన్న వనరులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, నీతి ఆయోగ్ కో-ఆర్డినేటర్ డా. బాలరాజు రాజారాం సర్పంచ్ కనక పార్వతి, ఉప సర్పంచ్ కనక జ్యోతి రామ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటా: మాజీ మంత్రి జోగు రామన్న



ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర):ఆదిలాబాద్ పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఘనంగా నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు జోగు రామన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులతో కలిసి విశ్వకర్మ దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయనను డప్పు చప్పుళ్ల మధ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జోగు రామన్న మాట్లాడుతూ... విశ్వకర్మ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లవేళలా అండగా ఉంటానని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ పథకం కింద అర్హులందరికీ తగిన సహాయం అందాలని, స్థానిక ఎమ్మెల్యే కూడా విశ్వకర్మల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని విశ్వకర్మ ఆలయ అభివృద్ధికి, కమిటీ హాల్ నిర్మాణానికి రూ. 25 లక్షలు కేటాయించి పూర్తి చేశామని గుర్తుచేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే, బీసీ సంఘాల నాయకులతో కలిసి మంత్రులను కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం సభ్యులు సంతోష్, దిలీప్, దత్తు నాగరావు, వెంకటి, రాకుండే సంతోష్, మార్శెట్టి గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# తల్లుల ఆరోగ్యమే ఆరోగ్యవంతమైన తరానికి పునాది

### -గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
### -జిల్లా కలెక్టర్ ప్రియాంక



ఉట్కూర్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) తల్లుల ఆరోగ్యమే ఆరోగ్య వంతమైన తరానికి పునాది అని జిల్లా కలెక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. శుక్రవారం ఉట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామ రైతు వేదికలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక పాల్గొని గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యక్రమాల్లో మహిళలతో పాటు పురుషులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో కుటుంబంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు గర్భధారణ ప్రారంభం నుంచే తల్లి ఆరోగ్యం, పోషకాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే అందించే ముర్రుపాలు (కొలస్ట్రం) ఎంతో విలువైనవని, మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. ఆరు నెలల లోపు శిశువులకు తేనె, నీరు తదితర ప్రత్యామ్నాయ ఆహారాలను ఇవ్వకూడదని తెలిపారు. బాలింతలు సంప్రదాయ నమ్మకాల పేరుతో కొన్ని ఆహార పదార్థాలను తీసుకోకుండా ఉండటం సరికాదని, వైద్యుల సూచనల మేరకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే శిశువుకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందుతాయని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. గర్భధారణ సమయంలో, ప్రసవం అనంతరం, బాలింతగా ఉన్న సమయంలో తగిన పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. మహిళల ఆరోగ్యం తదుపరి తరాల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల నడవడికను పిల్లలు అనుసరిస్తారని, అందువల్ల తల్లిదండ్రులు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించి పిల్లలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేయకుండా చట్టపరమైన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ తెలిపారు. బాలికలు తగిన వయస్సు వచ్చే వరకు విద్యను కొనసాగిస్తూ ఆరోగ్యంగా ఎదిగేలా కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. చిన్నారులకు అధిక ఉప్పు, నూనెతో తయారైన ప్యాకేజ్డ్ స్నాక్స్, జంక్‌ఫుడ్ అలవాటు చేయకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ఇంట్లో లభించే పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలతో పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని కోరారు. "మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది" అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణగర్భిణీల ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య సేవలు అందేలా ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీల్లో రక్తహీనతను నిరంతరం పర్యవేక్షించాలని, హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్న వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి అవసరమైన వైద్యం అందేలా చూడాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపం లేదా తక్కువ బరువుతో ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి అందిస్తున్న అదనపు పోషకాహారం సక్రమంగా అందుతున్నదీ, వారు తీసుకుంటున్నదీ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మహిళలు, పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో నిరుగుర్తి గ్రామం ఆదర్శంగా నిలిచేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక కోరారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్న ప్రాసన జరిపించారు. ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, గ్రామ సర్పంచి రాములు, ఉప సర్పంచి సంతోష్ కుమార్,సీడీపీవో వెంకటేశ్వరమ్మ, సూపర్ వైజర్ అంజమ్మ, అంగన్ వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి ఉపాధి అవకాశాలను పెంచడంలో వెదురు సాగు కీలక పాత్ర పోషిస్తుంది కలెక్టర్ రాహుల్ శర్మ.



భూపాలపల్లి జిల్లా 18 సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) వెదురును 'పచ్చని బంగారం'గా అభివర్ణిస్తూ, దాని సాగు, వినియోగం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెదురు వేగంగా అభివృద్ధి చెందే సహజ వనరుగా ఉండటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహద పడుతుందన్నారు. వెదురుతో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా సంప్రదాయ వృత్తిదారులు, మేదర సంఘాల సభ్యులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. వెదురు సాగును ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వెదురు ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు, ఆధునిక డిజైన్‌లు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సారిస్తే సంప్రదాయ వృత్తిదారులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేదర సంఘ నాయకులు గైని చంద్రశేఖర్, బూర పద్మ, చందా ప్రసాద్, కుంచనపల్లి శ్రీధర్, రాజయ్య, శంకరయ్య, సంపత్, మస్కు జయ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన జిల్లా మేదర సంఘ నాయకులకు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇ. ఇందిర కృతజ్ఞతలు తెలిపారు.

## పంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలి



నారాయణపేట , సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) ఈ నెల 20వ తేదీ ఆదివారం కోస్గిలో నిర్వహించనున్న పంచజన్య సంకల్ప సభను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గ్రేటర్ హైదరాబాద్ ఎల్‌బీ నగర్ టీఆర్ఎస్ నాయకులు రాంకోటి , నల్లగొండ జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి , నారాయణపేట జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గవినొళ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం దామరగిద్ద మండలం కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పంచజన్య సంకల్ప సభలో ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉద్యోగ కల్పన, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం తదితర ప్రజా సంక్షేమ అంశాలపై పార్టీ అధ్యక్షురాలు కవిత అక్క ప్రజలకు వివరించనున్నారని తెలిపారు. ప్రజల సమస్యలు, భవిష్యత్ అభివృద్ధి, యువతకు ఉద్యోగ అవకాశాలు, రైతుల సంక్షేమం, విద్యా మరియు వైద్య రంగాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సభలో ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వారు పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా ప్రజలు, యువత, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో కోస్గికి తరలివచ్చి పంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో దామర్‌గిద్ద మండల పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, పల్లెబండ నర్సిములు, నర్సాపూర్ లాలప్పతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓపీ రద్దీకి తగ్గట్టుగా సేవలు!

### -ఆసుపత్రి పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
### -సర్జరీలు, ప్రసవాలు పెంచాలి..
### -రామగుండం ప్రభుత్వాసుపత్రిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి



గోదావరిఖని సెప్టెంబర్-18(విజన్ ఆంధ్ర)రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ, ఐపీ సేవలు, సర్జరీలు, ప్రసవాలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. పునరుద్ధరణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి రోజూ సుమారు 1,500 నుంచి 1,600 మంది వరకు ఓపీ రోగులు వస్తున్న నేపథ్యంలో సేవలను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ఇన్‌పేషెంట్ సేవలను బలోపేతం చేయాలని ఆదేశించారు. పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తిచేసి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వైద్య కళాశాల అందుబాటులో ఉండటంతో అన్ని విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. వారి సేవలను సమర్థంగా వినియోగించుకొని క్రమం తప్పకుండా సర్జరీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే అత్యధిక సంఖ్యలో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న వైద్య నిపుణుల సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. ఆసుపత్రి సమీపంలోని డ్రైనేజీ బ్లాకేజీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. పరిసరాల్లో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పారిశుధ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలన్నారు. 85 పడకల నూతన ఆసుపత్రి భవనం వద్ద అవసరమైన అంతర్గత రహదారులు, లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్‌టీపీ సమీపంలో లెవలింగ్ పనులు చేపట్టి రోగులు, వైద్య సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. హిమబిందు, ఆర్ఎంఓ డా. కృప బాయి, టీజీఎంఐడీసీ ఏఈ విక్రమ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

## రీ సర్వేతో రైతులకు మరింత ప్రయోజనం

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18,( విజన్ ఆంధ్ర)భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని కౌటాల మండలం బారేపల్లి గ్రామ శివారులో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను జిల్లా భూ కొలతల అధికారి వినయ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నక్షాలు లేని గ్రామాలలో రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని, భవిష్యత్తులో రైతుల మధ్య గెట్ల తగాదాలు ఉండవని, రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. రికార్డులలో ఉన్నట్టుగా మోకా మీద భూమి విస్తీర్ణం ఉంటుందని, ఎలాంటి భూతగాదాలకు ఆస్కారం లేకుండా అధికారులు సర్వే ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వెదురు వస్తువుల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణ -జిల్లా కలెక్టర్ కె.హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18,( విజన్ ఆంధ్ర)వెదుతో తయారుచేసిన వస్తువులను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తో కలిసి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు పేదవాడి కలప అని, వెదురు పెంచడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. మేదరులు తయారు చేసే వెదురు వస్తువులు చాలా చౌకగా లభిస్తాయని, వాటిని కొనుగోలు చేసి వారి కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించి ప్రోత్సహించడంతో పాటు కాలుష్య నియంత్రణలో భాగస్వాములు కావాలని తెలిపారు. మేదర కులస్తులు తమ నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని తెలిపారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన మేదర కుటుంబాలకు అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వెదురు మొక్కలను నాటి సంరక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా మేదరులు తయారుచేసిన వస్తువులను పరిశీలించారు. అనంతరం వెదురుతో తయారు చేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి జ్ఞాపకను కలెక్టర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నదీమ్, ముఖ్య ప్రణాళిక అధికారి గురువయ్య, జిల్లా మేదర సంఘం ప్రతినిధులు సులువ కనకయ్య, డీకొండ సత్యనారాయణ, మేదర కులస్తులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడికి భరోసా కల్పించిన జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18,( విజన్ ఆంధ్ర)వృద్ధుడి పోషణ విషయంలో అండగా ఉండి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత భరోసా ఇచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయానికి తన కుమారుడు తన పోషణ, బాగోగులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసేందుకు వచ్చిన జిల్లాలోని కాగజ్ నగర్ మండలం బోడేపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే వృద్ధుడి వద్దకు జిల్లా కలెక్టర్ వెళ్లి సమస్యను విని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

# 25 నుంచి కొత్త జిల్లా జెడ్పీ కార్యక్రమాలు

నెల్లూరు సెప్టెంబర్ 18, ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పరిపాలన వికేంద్రీకరణ దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన 15 జిల్లాల్లో ఈ నెల 25వ తేదీ నుంచి జిల్లా పరిషత్ (జడ్పీ) కార్యాలయాల తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుత జడ్పీ పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ఈ నెల 24వ తేదీతో ముగియనుండడంతో, మరుసటి రోజే కొత్త జిల్లాల పరిధిలో నూతన జడ్పీ వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చేందుకు పంచాయతీరాజ్ శాఖ వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. కొత్త జిల్లాల జడ్పీల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇటీవలనే పరిపాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా 15 జడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (అఇూ), అలాగే మరో 15 డిప్యూటీ సీఈవో పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన పంచాయతీరాజ్ శాఖ అధికారులకు త్వరలోనే పదోన్నతులు కల్పించనున్నారు. జడ్పీల విభజన ప్రక్రియ సజావుగా సాగేలా చూడడానికి వీలుగా పాత ఉమ్మడి జిల్లాల కార్యాలయాల నుంచి సిబ్బందిని హేతుబద్ధీకరించి కొత్త జిల్లాలకు కేటాయిస్తున్నారు.

# సత్యం తెరిచిన పుస్తకం

## – రాజకీయ కక్షసాధింపులకు సిద్దిపేట నేల సమాధానం చెప్తుంది
## – మాజీ మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట జిల్లా (విజన్ ఆంధ్ర ప్రతినిధి): సెప్టెంబర్ 18పొలాల పరిశీలన పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న హడావుడి, రాజకీయ కుట్రలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తనీరు హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు వందల మంది పోలీసులు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు, రోప్ పార్టీలు, డ్రోన్ల హంగామాతో సిద్దిపేటలో నా భూములను పరిశీలించడానికి వస్తున్నారని తెలిసింది. అసలు ఇంత భయం, ఈ స్థాయిలో హడావుడి ఎందుకు? దొంగచాటుగా డ్రోన్లు పెట్టి ఫోటోలు తీయాల్సిన అవసరం ఏమొచ్చింది? నా జీవితం తెరిచిన పుస్తకం. ప్రతీ ఎన్నికల అఫిడవిట్‌లో నాకున్న ఆస్తులు, భూముల వివరాలను సర్వే నంబర్లతో సహా స్పష్టంగా, పారదర్శకంగా వెల్లడించాను.రామంచలో నాకు ఉన్నది 13 ఎకరాల భూమి మాత్రమే. నేను దాచింది ఏమీ లేదు, మీరు కొత్తగా వచ్చి బయటపెట్టేదీ ఏమీ లేదు. మీలాగా నేను కబ్జాలకు పాల్పడలేదు, ప్రజల సొమ్మును దోచుకోలేదు. నా పనితీరును, నిబద్ధతను చూసే సిద్దిపేట ప్రజలు నన్ను వరుసగా ఏడుసార్లు గెలిపించి ఆశీర్వదించారన్నారు. సిద్దిపేట అంటేనే ప్రేమ, ఆప్యాయత, ఆతిథ్యానికి మారుపేరు. ఇక్కడికి ఎవరు వచ్చినా కడుపునిండా అన్నం పెట్టి ఆదరించడం మా సంస్కృతి. కాంగ్రెస్ నాయకులు అంతలా భయపడుతూ, పోలీసుల రక్షణలో రావాల్సిన అవసరమే లేదు. నాకు ముందే సమాచారం ఇస్తే మీ అందరికీ మంచిగ కడుపు నిండా అన్నం తినిపించి, దగ్గరుండి నా తోటను, భూములను కంటి నిండా చూపిస్తానన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం లేనిపోని అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోండి. ఉన్నది ఉన్నట్లు మాట్లాడండి. సత్యాన్ని కప్పిపుచ్చడం ఎవరి వల్లా కాదన్నారు.

# మున్నూరుకాపు సంఘం పటేల్స్ వెబ్‌సైట్ ఆవిష్కరణ



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలోని మున్నూరుకాపులను ఒకే తాటిపైకి తీసుకువచ్చి ఐక్యతను పెంపొందించేందుకు కుటుంబ సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ తెలిపారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌తో పాటు ఆసిఫాబాద్ పట్టణంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్‌తో కలిసి వెబ్‌సైట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండా దేవయ్య పటేల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపు కుటుంబాలను అనుసంధానం చేయడంతో పాటు సంఘం కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకు వెబ్‌సైట్ ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం నూతనంగా పదవులు పొందిన ఆసిఫాబాద్ జిల్లా యూత్ అధ్యక్షుడు గాజుల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూదారి సాయి (గోలేటి), కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు మేడిపల్లి రవి, వైస్ ప్రెసిడెంట్ పేరుక మహేష్, కాగజ్‌నగర్ మండల యూత్ అధ్యక్షుడు పార్వతి సురేష్, ఉపాధ్యక్షుడు డెక్కపురి గోపాల్, పట్టణ అధ్యక్షుడు చిట్టంపల్లి అనిల్, ప్రధాన కార్యదర్శి పూదారి సాయి, కోశాధికారి పుల్లిశెట్టి వెంకటేష్‌లకు పదవులు అందజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు సంఘం అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమ శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిశెట్టి సదాశివ్, సిర్పూర్ తాలూకా వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లి తిరుపతి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొండపాక మండలంలోని వెలికట్ట గ్రామంలో భూమిని పరిశీలించిన ఎమ్మెల్సీ బృందం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్రంలోని కెసిఆర్ ఫామ్ లో సర్వే రెండవ రోజు సర్వే గజ్వేల్ ఆర్డీవో సమక్షంలో విధితమే కానీ ఈరోజు ప్రత్యేకంగా ఎమ్మెల్సీలు అందరూ కలిసి హైదరాబాదు నుండి రావడం అది ప్రత్యేక ప్రత్యేకంగా జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ఒకరిపై ఒకరు అభియోగాలు మోపుకుంటూ అసెంబ్లీలో సైతం నువ్వా నేనా అన్నట్టుగా వివరించిన తీరు మనందరం కళ్లగట్టినట్టుగా ఉన్నదని చెప్పుకోవచ్చు ఏది ఏమైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సైతం సర్వేలు చేసి దానికి సంబంధించిన నివేదిక మాత్రం సమర్పించాలని ఆదేశాలు జారీ చేసినారు సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని వెలికట్ట గ్రామంలో సర్వే నంబర్ 271 లో సుమారు ఆరెకరాల భూమిని రాజీవ్ రహదారిని అంటుకొని ఉన్న భూమిని అక్రమంగా ఆక్రమించిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు గారి మామ హనుమంతరావు దీనిని పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీల బృందం ఎమ్మెల్సీల బృందం గజ్వేల్ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి గారు మరియు కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

# ఇందువాసి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

## జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్

గద్వాల సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో)విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగంకు పాల్పడిన గట్టు మండలం, ఇందువాసి గ్రామపంచాయతీ కార్యదర్శి గొల్ల శేఖర్ ను సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజుల కిందట పంచాయతీ సెక్రెటరీ శేఖర్ పై పలు ఆరోపణలు రాగా ఉన్నతాధికారులు పలుమార్లు గ్రామంలో విచారణ చేపట్టడం జరిగిందన్నారు. పంచాయతీకి సంబంధించిన వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కార్యదర్శి విధుల్లో అలసత్వం వహించినట్లు తేలిందన్నారు. సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పించగా ఆయన ఆదేశాల మేరకు శేఖర్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని డిపిఓ పేర్కొన్నారు.

# భద్రకాళి అమ్మవారి హుండీల లెక్కింపు.. రూ.72.30 లక్షల ఆదాయం..!



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర) ;-హుండీల ద్వారా భారీ ఆదాయం :వరంగల్‌లోని చారిత్రక శ్రీ భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అధికారులు, సిబ్బంది సమక్షంలో హుండీలను తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో అమ్మవారికి హుండీల ద్వారా రూ. 72,30,387 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.విదేశీ కరెన్సీ కూడా :హుండీలలో భారతీయ కరెన్సీతో పాటు విదేశాలకు చెందిన కరెన్సీ కూడా లభించింది. మొత్తం 628 విదేశీ కరెన్సీ నోట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో 5 అమెరికా డాలర్లు, 110 కెనడా డాలర్లు, 10 యూఏఈ కరెన్సీ, 60 బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ పౌండ్లు, 10 యూరోలు ఉన్నట్లు వెల్లడించారు. భక్తులు వివిధ దేశాల నుంచి అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పిస్తున్న విషయం ఈ విదేశీ కరెన్సీ ద్వారా స్పష్టమవుతోందిబంగారం, వెండిని తిరిగి హుండీలోనే :హుండీలలో లభించిన మిశ్రమ బంగారం, వెండిని ఆలయ అధికారులు వేరు చేసి భద్రపరిచే బదులు నిబంధనల ప్రకారం తిరిగి హుండీలోనే వేసినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.200 మంది పాల్గొనడంతో :ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బందితో పాటు సుమారు 200 మంది పాల్గొన్నారు. భక్తుల నుంచి వచ్చిన నగదు, ఇతర కానుకలను జాగ్రత్తగా లెక్కించి నమోదు చేశారు. లెక్కింపు పూర్తయిన అనంతరం వచ్చిన ఆదాయాన్ని సంబంధిత బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు

# శాసనసభ వేదికగా వివిధ వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర):తెలంగాణ శాసనసభలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలను లేవనెత్తారు. ఆదివాసీలు, నాయీ బ్రాహ్మణులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు మరియు ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తక్షణ స్పందన కోరారు.మొదటగా, ఆదిలాబాద్ పట్టణంలోని కొమురం భీమ్ కాలనీలో దశాబ్దాలుగా నివసిస్తున్న ఆదివాసీ కుటుంబాలకు వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, వారి నివాసాలకు చట్టబద్ధమైన భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆదివాసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని స్పష్టం చేశారు.అలాగే, తరతరాలుగా కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నాయీ బ్రాహ్మణుల ఉపాధికి భద్రత కల్పించాలని, వారి వృత్తిపై ఇతర వర్గాల పెత్తనాన్ని అరికట్టాలని కోరారు. గ్రామీణ స్థాయిలో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్ల పెండింగ్ సమస్యలను పరిష్కరించి, వారికి తగిన గౌరవం, సంక్షేమం కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు.ప్రజా రవాణా వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని పునఃపరిశీలించాలని కోరారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభ వేదికగా లేవనెత్తిన ఈ సమస్యలన్నింటిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు.

# అనుమతి లేకుండా చెట్లు నరికితే కఠిన చర్యలు అటవీ శాఖ హెచ్చరించిన డిఎఫ్ఓ ..బాలమని.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18: (విజన్ ఆంధ్ర)కోమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అనుమతి లేకుండా చెట్లను నరికివేయడం, అటవీ ఉత్పత్తులను అక్రమంగా తరలించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి సిహెచ్ బాలమణి హెచ్చరించారు.చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు వర్షపాతం, భూగర్భ జలాల సంరక్షణ, వన్యప్రాణుల ఆవాసాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఒక్క చెట్టును నరికివేయడం వల్ల పర్యావరణానికి నష్టం కలగడమే కాకుండా, వన్యప్రాణుల నివాస ప్రాంతాలపై కూడా ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.అటవి శాఖ అనుమతి లేకుండా చెట్లను నరికివేయడం, కలపను అక్రమంగా రవాణా చేయడం, నిల్వ చేయడం వంటి చర్యలకు పాల్పడే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి అక్రమంగా చెట్లు నరికివేస్తున్నట్లు గమనించినట్లయితే సమీపంలోని అటవీ శాఖ కార్యాలయం లేదా సంబంధిత అటవీ అధికారులకు సమాచారం ఈ నంబర్లకు ఇవ్వాలని కోరుకున్నారు. 1.9440810099 డీఎఫ్ఓ ఆసిఫాబాద్2.9441156136 ఎఫ్డిఓ అసిఫాబాద్ 3.9346212281 ఎఫ్ డి ఓ కాగజ్ నగర్ప్రతి ఒక్కరూ అటవీ సంపదను సంరక్షించడంలో అటవీ శాఖకు సహకరించాలని జిల్లా అటవీ శాఖ అధికారి విజ్ఞప్తి చేశారు.

# ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్




మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18,(విజన్ ఆంధ్ర)ఖరీఫ్ సీజన్ లో జిల్లాలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తో కలిసి జిల్లా పౌర సరఫరాలు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, సహకార, కార్మిక శాఖల అధికారులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం సకాలంలో కొనుగోలు చేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన మౌలిక వసతులు, గన్నీ సంచులు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, హమాలీలు, రవాణా తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ముందుగానే నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేసి, రైతులకు చెల్లింపులు నిర్ణీత సమయంలో జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ, కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించడం, ధాన్యం సేకరణ, నిల్వలు, మిల్లులకు తరలింపు తదితర అంశాలను సమన్వయం చేయాలని, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ధాన్యం నాణ్యత, తేమ శాతం, ప్రమాణాలు, నిబంధనలు, కొనుగోలు విధానంపై అవగాహన కల్పించాలని, రైతులు పండించిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత సంస్థలతో సమన్వయం చేసి, కేంద్రాలలో రైతులకు అవసరమైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ధాన్యం విక్రయానికి సంబంధించిన చెల్లింపులు సకాలంలో జరిగేలా బ్యాంకింగ్ వ్యవస్థను సమన్వయం చేయాలని, రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బ్యాంకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సహకార శాఖ ఆధ్వర్యంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహిస్తూ, రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని కొనుగోలు కేంద్రాలలో తూకం, ధాన్యం రాక, నిల్వ, రవాణా తదితర ప్రక్రియలను సంబంధిత శాఖలతో సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్, బస్తాల తరలింపు తదితర పనులకు అవసరమైన హమాలీలు, కార్మికుల లభ్యతను నిర్ధారించి, కార్మికుల సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని, రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి, ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్ నగర్ మండల సమీక్ష సమావేశం



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన మండల సమీక్ష సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కామ్డే అనిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులు, సర్పంచులతో కలిసి సమగ్రంగా సమీక్షించారు. గ్రామాల వారీగా అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్సీ దండే విఠల్ అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సర్పంచులు ఎమ్మెల్సీ దండే విఠల్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ కోరారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన చర్యలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ పథకాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, మండల స్థాయి సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




అలంపూర్ సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో)శ్రీ జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రభుత్వానికి ప్రజాసేవలో మరింత శక్తి,సామర్థ్యం కలగాలని ప్రార్థించినట్లు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు.
శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,కమిటీ సభ్యులతో కలిసి అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయం సందర్శించి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు.ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ కూడా నిర్వహించారు. అనంతరం శ్రీ జోగులాంబ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు అమ్మవారి ప్రసాదం శేష వస్త్రం బహుకరించి ఆశీస్సులు అందజేశారుఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారమై, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని,ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన లబ్ధిదారులకు సమర్థంగా చేరాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కె.హరిత

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18,( విజన్ ఆంధ్ర)జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రపంచ చెవిటి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు న్యాయపరమైన సేవలు, చట్టాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి అనుషా, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, దివ్యాంగ నిర్ధారణ శిబిరాలను జిల్లా ఆసుపత్రిలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దివ్యాంగుల ఇతర సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని, దివ్యాంగులకు కల్పించిన హక్కులు, చట్టం ప్రకారం వారికి దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి మాట్లాడుతూ దివ్యాంగులు న్యాయ సేవలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, దివ్యాంగుల కౌశల్ వికాస్, దివ్యాంగుల రోజ్గార్ సేతు లో భాగంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మానవ అక్రమ రవాణా బాధితులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, నిస్సహాయులైన పిల్లలు, లైంగిక వేధింపుల బాధిత పిల్లలకు న్యాయపరంగా సేవలు అందించేందుకు జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ న్యాయవాదిని నియమించి న్యాయస్థానాలలో ఉచితంగా న్యాయ సేవలు అందించడం జరుగుతుందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, డి పి ఎం రామకృష్ణ, దివ్యాంగులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కల్లెడ మత్స్య సహకార సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర):-వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామంలోని మత్స్య పారిశ్రామిక సహకారసంఘం లిమిటెడ్(రిజిస్ట్రేషన్ నెం.వీ–312) పాలకవర్గఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర సహకార ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీనియర్ ఎన్నికల అధికారి సోమశేఖర్ తెలిపారు. మొత్తం 9 జనరల్ స్థానాలకు రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్లను సెప్టెంబర్ 22, 23, 24 తేదీల్లో ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కల్లెడలోని సంఘం కార్యాలయంలో స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 25నామినేషన్ల పరిశీలన నిర్వహించి, అర్హులైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. సెప్టెంబర్ 26న ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.అనంతరం తుది అభ్యర్థుల జాబితా, ఎన్నికల గుర్తులను ప్రకటిస్తారు. అక్టోబర్ 1న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కల్లెడ సంఘ కార్యాలయంలో పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 1:30 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, అనంతరం ఫలితాలు ప్రకటిస్తారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు నిర్ణీత రుసుముతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫోటో గుర్తింపు కార్డు, ఓటరు గుర్తింపు కార్డు లేదా ఆధార్ కార్డు నకళ్లను సమర్పించాల్సి ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు. అర్హులైన ఓటర్ల జాబితాను కల్లెడ సంఘ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. సంఘ సభ్యులందరూ ఎన్నికల ప్రక్రియకు సహకరించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తోడ్పడాలని ఆయన కోరారు.

# సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరిన మాదిగ జేఏసీ నాయకులు



ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర):ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షేమ పాలన, చారిత్రాత్మక ఎస్సీ వర్గీకరణ నిర్ణయానికి ఆకర్షితులై తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని చిలుకూరు లక్ష్మి గార్డెన్‌లో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాబూరావు సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మోతే బారికరావు, నక్క రాందాస్, మల్యాల మనోజ్, లింగంపల్లి ప్రసన్నకుమార్, తాలా రవికుమార్, కత్తి గంగాధర్, జెల్ల మహేందర్, బట్టు మహేందర్, ఖంపెల్లి ఆనందరావు, మంద సురేష్, కల్లేపల్లి మల్లయ్య, సిందే సంజయ్, అలాగే మహిళా నాయకురాళ్లు నాతరి సరోజ, విజయ సుశీలతో పాటు దాదాపు 50 మంది ముఖ్య కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. నాయకులకు జిల్లా అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాబూరావు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్సీ వర్గీకరణ, సంక్షేమ పథకాలలో మాదిగ సామాజిక వర్గానికి అందుతున్న ప్రాధాన్యత, రాజీవ్ రోజ్‌లలో నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం కల్పిస్తామన్న హామీయే తమ పార్టీ చేరికకు ముఖ్య కారణమని నేతలు తెలిపారు. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మాదిగ జాతికి మరింత న్యాయం జరుగుతుందనే నమ్మకముందని, పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శాయశక్తులా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

# కొమరం భీం కాలనీలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ చిత్రపటానికి పాలాభిషేకం



ఆదిలాబాద్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర):ఆదిలాబాద్ జిల్లా మావల మండలం కొమరం భీం కాలనీలో స్థానిక ఆదివాసీలతో కలిసి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేశారు. కొమరం భీం కాలనీ నిర్వహణ కమిటీ, గ్రామ అభివృద్ధి కమిటీ మరియు తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్ మాట్లాడుతూ... గత 30 సంవత్సరాలుగా కొమరం భీం కాలనీలో నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇళ్ల పట్టాలు, కరెంటు, నీరు, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించాలని ఈరోజు అసెంబ్లీలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడడం ఎంతో సంతోషకరమని, అభినందనీయమని కొనియాడారు. ఆదివాసీల ఆత్మబంధువుగా ఆయన నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్, రాష్ట్ర కార్యదర్శి అర్కా శేషరావు, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోడం రేణుక, రాష్ట్ర కార్యదర్శి ఉయిక ఇందిరా, డివిజన్ అధ్యక్షులు ఆత్రం గణపతి, మావాల మండల అధ్యక్షులు వెడ్మ ముకుంద రావు, మడావి అనసూయ, వెడ్మ మనుకు బాయి, చాహకటి అనసూయ, కుంరం గోవింద్ రావు, వెట్టి బొజ్జు, కనక మనోహర్, సిడం ప్రభు, గేడం ఆనంద్ రావు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18,(విజన్ ఆంధ్ర)ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల తహసిల్దార్ రాఘవేంద్ర తో కలిసి సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. షెడ్యూల్ కులముల సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి భవనం శిథిలావస్థలో ఉన్నందున నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. తెలంగాణ ఆదర్శ పాఠశాల, బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని నక్కలపల్లి గ్రామంలో గల జి.పి. కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా చేపట్టిన హియరింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, వేగవంతంగా చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో స్పష్టంగా ఉండేలా జాబితా రూపొందించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఎల్ఎన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల చదువును మెరుగుపరచాలి

## విధులకు గైర్హాజరయ్యే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




ఎర్రవల్లి సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర బ్యూరో) ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్‌ను పటిష్టంగా అమలు చేసి,విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.

శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలోని 10వ బెటాలియన్‌లోని విద్యా బోధన,ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యా నైపుణ్యాలు సాధికార పాఠశాలపై విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యా నైపుణ్యాలు (ఎఫ్ఎల్ఎన్)ను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, సంఖ్యా నైపుణ్యాల్లో ఆశించిన అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో ఎఫ్ఎల్ఎన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి,విద్యార్థుల అభ్యసన శాతాన్ని పెంచాలన్నారు. విద్యార్థుల 100 శాతం హాజరును ఉండేలా చూడాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ ట్రాకింగ్ రిజిస్టర్‌ను సబ్జెక్టు వారీగా తప్పనిసరిగా నిర్వహిస్తూ,ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని నమోదు చేయాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ రిపోర్ట్ ఆధారంగా విద్యార్థుల అభ్యసన లోపాలను గుర్తించి,తగిన బోధనా వ్యూహాలతో అదనపు బోధన అందిస్తూ వారి నైపుణ్యాలను మెరుగుపరచాలన్నారు.ప్రతి బుధవారం ప్రధానోపాధ్యాయులు సమావేశం నిర్వహించి, విద్యార్థుల అభ్యసన పురోగతిని సమీక్షించి, మెరుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల అభ్యసనాన్ని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు సృజనాత్మకమైన, వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలన్నారు. ప్యానెల్ తనిఖీ బృందాలు షెడ్యూల్ ప్రకారం పాఠశాలలను సందర్శించి, విద్యా ప్రమాణాలు,ఎఫ్ఎల్ఎన్ అమలు, మౌలిక వసతులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. పాఠశాలలోని సానుకూల అంశాలు,లోపాలను స్పష్టంగా నమోదు చేసి నివేదిక సమర్పించాలన్నారు. ఈ నివేదికల ఆధారంగా లోపాలను పరిష్కరించి, పాఠశాలల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ సెల్ సభ్యులు ఉత్తమ బోధనా పద్ధతులను గుర్తించి డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. ప్యానెల్ తనిఖీ బృందాల పనితీరు,పాఠశాలల పరిస్థితిపై నివేదికలు సేకరించి,వాటి ఆధారంగా ఎఫ్ఎల్ యెన్ ను మరింత మెరుగుపరచాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు విద్యార్థులు, ఉపాధ్యాయులందరికీ 100 శాతం ఉండాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు వేసి అనంతరం ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్తున్నట్లు నివేదికలు అందుతున్నాయని తెలిపారు. దీనిపై సమీక్ష అనంతరం కొద్ది రోజుల్లోనే సంబంధిత ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని,విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈఓలు,కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ప్రతి నెల 15వ తేదీలోపు పాఠశాలలను తప్పనిసరిగా సందర్శించి, పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, ఎఫ్ఎల్ఎన్ అమలను పరిశీలించాలన్నారు.టాయిలెట్ సౌకర్యం లేని పాఠశాలల వివరాలతో నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని ఎంఈఓలను ఆదేశించారు.ఆధార్,అపార్, ఎస్‌హెచ్‌వీఆర్,ప్రశస్త్ నమోదులో పురోగతిని మరింత మెరుగుపరచాలన్నారు.ఏక్ పేడ్ మా కీ నామ్, జాతీయ విద్యార్థుల పర్యావరణ పోటీ నషా ముక్త్ విద్యాలయ,డ్రగ్ ఫ్రీ కార్యక్రమం పాఠశాలలో పక్కాగా అమలు చేయాలన్నారు.జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్య అందించేలా ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రేని డిప్యూటీ కలెక్టర్లు రాజ్ కుమార్,మనోజ్ కుమార్ రెడ్డి,డీఈఓ విజయ లక్ష్మి,మండల విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలి

## రేపల్లె ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలి

## రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



గద్వాల సెప్టెంబర్ 18 విజన్ ఆంధ్ర బ్యూరో)షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయించే నిధులను సద్వినియోగం చేసుకునేలా సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన ల్యాండ్, సర్వీస్, అట్రాసిటీస్, తదితర అంశాలపై శుక్రవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, సంతు సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ కేసులను పరిష్కరించేందుకు, బాధితులకు పరిహారం చెల్లించడం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో స్పందించి ముందుకెళ్లాలన్నారు. ప్రభుత్వం రూ.2 వేల కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను బడ్జెట్లో కేటాయించిందని, సంబంధిత వర్గాల వార్డుల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, తదితర నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపితే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీల్లో వివిధ విభాగాల్లో విధులను నిర్వహిస్తున్న కార్మికులకు భీమా సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో కులాంతర వివాహాలు చేసుకున్న వారిని ప్రోత్సహించేందుకు, విదేశీ విద్యానిధి పథకంకు ఎప్పటికప్పుడు నిధులు సమకూరేలా ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లోనూ అర్హులైన విద్యార్థులందరికీ ఉచిత విద్య అందేలా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. దళితులు, గిరిజనులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారంలోనూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవెన్యూ అధికారులను కోరారు. రేపల్లె ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే కాక ఉద్యోగం, వ్యవసాయ భూమి కూడా ఇచ్చేందుకు ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించేలా ప్రతినెల అన్ని మండలాల్లో పౌర హక్కుల దినం నిర్వహించాల్సిందిగా జిల్లా అధికార యంత్రాంగానికి కమిషన్ చైర్మన్ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయించే నిధులను వంద శాతం ఖర్చు పెట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ప్రతినెల అన్ని మండలాల్లో సివిల్ రైట్స్ డే కూడా తప్పకుండా నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. గత ఏడాది కాలంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించి నమోదైన 53 కేసులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంలో సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పరిష్కరించేందుకు డిఎస్పి స్థాయి అధికారులతో విచారణ చేయిస్తున్నామని, బాధితులకు న్యాయం జరిగేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి అవసరమైన కుల ధృవీకరణ పత్రాలు రెవిన్యూ అధికారులు ఇవ్వడమే కాక వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా సహకరిస్తున్నారన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మల్లు రవి పర్యవేక్షణలో కూడా తరచూ జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించి షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రేపల్లె ఘటనపై బాధిత కుటుంబానికి తగు న్యాయం చేయడమే కాక దాడికి పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు దళిత సంఘాల నేతలు కమిషన్ చైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. రేపల్లె ఘటనకు సంబంధించి బాధ్యులపై కేసు నమోదు చేసినందున ప్రభుత్వం నుంచి అందే పరిహారంలో మొదటి విడతగా వచ్చిన రూ.25 వేల చెక్కును కమిషన్ చైర్మన్, కలెక్టర్, తదితరులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే వివిధ సంఘాల నేతలు కమిషన్ చైర్మన్, సభ్యులను సన్మానించి పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అంతకుముందు కమిషన్ చైర్మన్, సభ్యులు రేపల్లె గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, ఎన్జీవో ఆర్గనైజేషన్ మెంబర్ గంధం నాగరాజు, అదనపు కలెక్టర్లు మధుమోహన్ నర్సింగరావు అదనపు ఎస్పి శంకర్ ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కురుమన్న, శైలజ, మల్లికార్జున్, సురేష్ నాయక్, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి నాగరాజు, కార్పొరేషన్ ఈవో సుదర్శన్, ఎస్టి అభివృద్ధి అధికారి యాదమ్మ, ఇతర జిల్లా అధికారులు, తహసిల్దార్లు, తదితరులు, పాల్గొన్నారు.

# ఘనంగా "అలమ్నై 1982-86 మూడవ బ్యాచ్ రూబీ రీయూనియన్ సంబురాలు




హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర)మాణిక్య సంవత్సర ప్రారంభోత్సవ వేడుకలో కిట్స్ వరంగల్ పూర్వ విద్యార్థులు కిట్స్ వరంగల్ యొక్క సీనియర్ ప్రొఫెసర్ లని షాలువ మరియు మెమెంటోతూ ఘనంగా సత్కరించారు అని ముఖ్య అతిథి, ఫార్మర్ రాజ్యసభ యం పి., చైర్మన్, కిట్స్ వరంగల్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు వెల్లడించారు. ఈ రోజు, కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్, వరంగల్ అలమ్నై అసోసియేషన్ ( కిట్స్‌వా– కిట్స్ వరంగల్ పూర్వ విద్యార్థుల సంఘం) వారు " 1982–86 మూడవ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల రూబీ రీయూనియన్ (40 సంవత్సరాలు)" ఘనంగా నిర్వహించబడింది అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంని ముఖ్య అతిథి, ఫార్మర్ రాజ్యసభ యం పి., చైర్మన్, కిట్స్ వరంగల్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, ప్రత్యేక అతిథి (1986 బ్యాచ్ పూర్వ విద్యార్థి, ఐ ఐ ఐ టి ఢిల్లీ మాజీ డైరెక్టర్ మరియు బిట్స్ పిలానీ (గ్రూప్ వైస్ ఛాన్సలర్) ప్రొఫెసర్ వి. రామగోపాల్ రావు; గౌరవనీయులైన ఉపాధ్యాయులు మరియు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి కలిసి జ్యోతి ప్రజ్వలన చేయడం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా రూబీ జూబ్లీ వేడుకల సందర్భంగా, ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఐ ఐ ఐ టి ఢిల్లీ మాజీ డైరెక్టర్ & బిట్స్ పిలానీ గ్రూప్ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ వి. రామగోపాల్ రావు, ఈ వృత్తి విద్యా సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే బలమైన పూర్వ విద్యార్థుల బృందాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ పూర్వ విద్యార్థులు నిరుపేద విద్యార్థుల ప్రయోజనం కోసం ఒక ఎండోమెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తారు. వారు ఉన్నత స్థాయి నుండి కింది స్థాయి వరకు స్నేహపూర్వకంగా, మంచి సంబంధాలను కొనసాగిస్తూ, భవిష్యత్ తరాల ఎదుగుదలకు, ప్రయోజనానికి గణనీయంగా దోహదపడే ఒక పటిష్టమైన ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్‌ను ఏర్పరుస్తారు. ఇటువంటి ఐక్యత, సహకారం సంస్థ అందించిన బలమైన విలువలను ప్రతిబింబిస్తాయని ఆయన నొక్కి చెప్పారు. నిజాయితీ, వృత్తి నైపుణ్యం, సామాజిక బాధ్యత ద్వారా కిట్స్‌బ్ల్యూ (వారసత్వాన్ని నిలబెట్టాలని విద్యార్థులను, పూర్వ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, ఫార్మర్ రాజ్యసభ యం పి., చైర్మన్, కిట్స్ వరంగల్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు మాట్లాడుతూ, రూబీ జూబ్లీ వేడుకల సందర్భంగా అధ్యక్షోపన్యాసం చేశారు. తన ప్రసంగంలో, భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న వర్ధమాన పోకడలు మరియు ఆవిష్కరణలకు విద్యాసంస్థలు, విద్యార్థులు అనుగుణంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, సాంకేతిక పరిజ్ఞానంలోని తాజా పరిణామాలపై ఆయన విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని, స్థిరమైన మరియు బలమైన సంబంధాల కోసం స్నేహాన్ని కొనసాగించాలని ఆయన సలహా ఇచ్చారు. ఈ రూబీ పునఃసమావేశాన్ని ఒక చిరస్మరణీయమైన మరియు స్ఫూర్తిదాయకమైన సందర్భంగా మార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ, మన గర్వించదగిన పూర్వ విద్యార్థులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలపై సెమినార్లు మరియు వర్క్‌షాప్‌లు నిర్వహించడం, ఇంటర్న్‌షిప్‌లు మరియు స్టార్టప్‌ల కోసం పారిశ్రామిక సందర్శనలు, ప్రయోగశాలలలో అత్యాధునిక పరికరాలను సమకూర్చడం, ఇంకా ముఖ్యంగా యూజీ మరియు పీజీ విద్యార్థుల ప్రయోజనం కోసం క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు మరియు ఇంటర్న్‌షిప్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రస్తుత కిట్స్ వరంగల్ విద్యార్థుల బృందానికి తమ మద్దతును అందిస్తున్నారని హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు, కిట్స్ వరంగల్, కోశాధికారి పి. నారాయణ రెడ్డి, కిట్స్ వరంగల్ ఉపాధ్యక్షు లు, కె దేవిప్రసాద్, గంధం వెంకటయ్య నాయుడు (చీఫ్ ఇంజనీర్ – నీటిపారుదల శాఖ), అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్త మరియు ఈ బ్యాచ్ పూర్వ విద్యార్థి అయిన నాయుడు వెంకటేష్, మరియు వెంకటకృష్ణ (అమెరికాకు చెందిన గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ మరియు సీఈఓ) వంటి వారు, కిట్స్వా పూర్వ విద్యార్థుల వ్యవహారాలు & బాహ్య సంబంధాల శాఖ, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి మరియు ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శ్రీకాంత్, ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఓ. ఆంజనేయులు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, పరిపాలనా అధికారి ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 120 మందికి పైగా పూర్వ విద్యార్థులు, పీఆర్‌ఓ డాక్టర్ డి. ప్రభాక రా చారి, పూర్వ విద్యార్థుల సంఘం (కిట్స్వా) సభ్యులు, విశ్రాంత అధ్యాపకులు పాల్గొన్నారు.

# డ్యామ్ భద్రత దృష్ట్యా పోలీసుల కీలక నిర్ణయం

## జూరాల వద్ద నిమజ్జనాలకు నిషేధం:సీఐ టంగుటూరి శ్రీను

గద్వాల సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం జూరాల ప్రాజెక్టు డ్యామ్ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనాలను పూర్తిగా నిషేధించినట్లు గద్వాల సీఐ టంగుటూరి శ్రీను శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. డ్యామ్ భద్రత, జలవిద్యుత్ ఉత్పత్తి, నీటి ప్రవాహం, నిర్వహణతో పాటు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిమజ్జనం కోసం జూరాల డ్యామ్ వద్దకు ఎవరూ రావద్దని సీఐ సూచించారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు, భక్తులు, యువత పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. డ్యామ్ పరిసరాల్లో గుంపులుగా చేరడం, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి నిమజ్జనం కోసం డ్యామ్ వద్దకు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు. నిర్వాహకులు ముందుగానే భక్తులకు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

# శ్రీ సాయి స్కూల్ మట్టి వినాయకుని నిమజ్జనం



నారాయణపేట, సెప్టెంబర్ 18 ( విజన్ ఆంధ్ర) నారాయణ పేట జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి స్కూల్ లో ఐదు రోజులు మట్టి వినాయకునికి ప్రత్యేక పూజలు చేసి కొండపల్లి చెరువులో నిమజ్జనం చేశారు. గణపయ్య లడ్డు వేలంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు పోటాపోటీగా పాల్గొన్నారు. 10 వ తరగతి విద్యార్థులు 10,001 రూపాయలకు లడ్డును వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వసంత రావు మాట్లాడుతూ గణపయ్య ను పూజిస్తే అన్ని విఘ్నాలు తొలగి సకల సంపదలు, ఆయురారోగ్యాలు,కోరుకున్న కోరికలు తీరుతాయని తెలిపారు. భక్తి, దేశ భక్తి కల్గిన విద్యార్థులు జీవితంలో గొప్ప స్థాయికి ఎదుగుతారని తెలిపారు. మంచి మార్గంలో నడుచుకొనుటకు ఎలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అమీనా, బాలప్ప, హెచ్. నర్సింహా,హరీష్, సునీల్ రెడ్డి, రాధ కిషన్, సురేందర్ గౌడ్,రాహుల్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల వల్ల నాడులన్నీ ప్రేరేపించబడి మానసిక వికాసం పెంపొంది చదువుల్లో రాణిస్తారు



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర);-వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలంలోని స్థానిక ఉన్నత పాఠశాల కొంకపాక లో జరిగే జోనల్ స్థాయి ఎస్జీఎఫ్ఐ క్రీడలు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారి అల్లం దాసు బిక్షపతి అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ రాయబారపు రమాదేవి మాట్లాడుతూ పిల్లల్లో క్రీడలు శారీరక వికాసం తో పాటు మానసిక వికాసం కూడా పెంపొంది చదువుల్లో రాణిస్తారని, విద్యా ఉద్యోగ అవకాశాల్లో కూడా ప్రాధాన్యత లభిస్తుందని కాబట్టి విద్యార్థులు చదువులతో సమాంతరంగా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. సభాధ్యక్షులు బిక్షపతి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సమానగా స్వీకరించాలని నేటి ఓటమి రేపటి గెలుపుగా మార్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మరియు రాయపర్తి మండల విద్యాధికారులు శ్రీధర్, శ్రీనివాసులు పర్వతగిరి మండల మాజీ విద్యాశాఖాధికారి లింగా రెడ్డి గ్రామ ఉపసర్పంచ్ హరిప్రసాద్ జిల్లా ఎస్జీఎఫ్ ఐ సెక్రటరీ అనిల్, జోనల్ సెక్రటరీ మహబూబ్ పాషా, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రఘువీర్ మూడు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు గ్రామ వార్డు మెంబర్లు వైద్య సిబ్బంది ఇతర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు గ్రామ ప్రజలూూ తదితరులు

# ప్రతి ఒక్కరూ పరిశు భ్రత పాటించాలి

## జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర)వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు తదితర అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెత్తాచెదారాన్ని తొలగించడం, పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయాలని అన్నారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరినీ స్వచ్ఛతా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు.

గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు దేశం అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. స్వచ్ఛతను ఒక కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని ఆమె సూచించారు.

# విద్యార్థుల ప్రతిభకు 'జ్ఞానధార' చక్కని వేదిక

## జ్ఞానధార వాయిస్ బియాండ్ క్లాస్ రూమ్స్' త్రైమాసిక పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో)విద్యార్థులలోని సృజనాత్మకత, ఆలోచనా శక్తి, ప్రతిభను వెలికితీసేందుకు 'జ్ఞానధార' మంచి వేదికగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ ఆవరణంలోని తెలంగాణ గిరిజన గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో రూపొందించిన 'జ్ఞానధార వాయిస్ బియాండ్ క్లాస్‌రూమ్స్' త్రైమాసిక పత్రిక తొలి సంచికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,విద్యార్థులలోని సృజనాత్మకత,ఆలోచనా శక్తి, ప్రతిభను వెలికితీసేందుకు 'జ్ఞానధార' మంచి వేదికగా నిలుస్తుందని తెలిపారు. విద్య కేవలం పాఠ్యపుస్తకాలు, పరీక్షలకే పరిమితం కాకుండా,విద్యార్థులు తమ ఆలోచనలు, అభిప్రాయాలు, కలలను స్వేచ్ఛగా వ్యక్తపరచేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. 'జ్ఞానధార'లో విద్యార్థులు రాసిన కవితలు, కథలు,వ్యాసాలు,చిత్రాలు,ఇతర సృజనాత్మక రచనలు పొందుపరిచారని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ పత్రిక దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించి,వారి రచనలకు మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులు,మెంటర్లు, సంపాదక బృందాన్ని కలెక్టర్ అభినందించారు. జ్ఞానధార' భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది, విద్యార్థుల ప్రతిభకు, ఆలోచనలకు మంచి వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధు మోహన్,నర్సింగ రావు, ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సుచిత్ర, తదితరులు పాల్గొన్నారు.

# రోళ్లకల్‌లో అభివృద్ధి పనులపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర);-పర్వతగిరి మండలం రోళ్లకల్ గ్రామంలో వివిధ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్, సూపరింటెండెంట్ విష్ణుమూర్తి కలిసి గ్రామంలో పర్యటించి పలు కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. ముఖ్యంగా కొత్తగా చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, అర్హత, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించారు. అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు, నిర్మాణాల పురోగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని, పనులను వేగవంతం చేసుకోవాలని లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న అవెన్యూ ప్లాంటేషన్ ఫినిషింగ్ వర్క్‌ను అధికారులు పరిశీలించారు. మొక్కల సంరక్షణ, వాటి చుట్టూ చేపడుతున్న పనులు, ప్లాంటేషన్ అభివృద్ధి తదితర అంశాలను పరిశీలించి, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామంలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్, సూపరింటెండెంట్ విష్ణుమూర్తి, గ్రామపంచాయతీ కార్యదర్శి సుమన్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ నాలం రాజు తదితరులు పాల్గొన్నారు.

# డీజేలకుఅనుమతి లేదు, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## స్పష్టం చేసిన ఎస్పి డాక్టర్ వినీత్



నారాయణపేట, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా పరిధిలో గణేష్ ఉత్సవాలు, శోభాయాత్రలు ప్రశాంతం గా, భక్తిశ్రద్ధలతో, మత సామరస్యంతో నిర్వహించు కోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలకు, గణేష్ ఉత్సవ నిర్వాహకులకు సూచించారు.

ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని, ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు. డీజేల స్థానంలో పరిమిత శబ్దంతో స్పీకర్లను ఉపయోగించుకోవడంతో పాటు, మన సంప్రదాయాలను ప్రతిబింబించేలా డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాలు, ఇతర సంప్రదాయ కళారూపాలతో శోభాయాత్రలు నిర్వహించుకోవాలని సూచించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, సత్య యాదవ్, నందు నామాజీ తో పాటు పలువురు యువకులు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారితో నేరుగా మాట్లాడి గణేష్ ఉత్సవాల సందర్భంగాతీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలు, డీజేల నిషేధం, ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలను వివరించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణీలు, యుక్త వయస్కులు తదితరుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధిక శబ్దంతో కూడిన డీజేలను వినియోగించకూడదని ఎస్పీ సూచించారు. గణేష్ పండుగ ప్రతి ఒక్కరికీ ఆనందాన్ని పంచే పండుగ. జిల్లాలో ఒక్క ప్రాణానికి కూడా నష్టం జరగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలు నిర్వహించాలి. ఒక్క ప్రాణం కోల్పోయినా ఆ కుటుంబానికి మాత్రమే కాకుండా మొత్తం సమాజానికి అది విషాదమే. అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అందరూ పోలీసులకు సహకరించాలి" అని ఎస్పీ తెలిపారుగణేష్ ఉత్సవాలు, శోభాయాత్రల సందర్భంగా డీజేలు వినియోగించరాదని సంబంధిత అధికారుల ద్వారా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయబడినట్లు ఎస్పీ తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, జిల్లా కలెక్టర్,ఆర్డీఓ ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల మేరకు డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డీజేలను ఏర్పాటు చేసి నిబంధనలను ఉల్లంఘించినా, నిషేధ ఉత్తర్వులను ధిక్కరించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఉత్సవ నిర్వాహకులు, డీజే యజమానులు, ఆపరేటర్లు ఈ విషయాన్ని తప్పనిసరిగా గమనించాలని సూచించారు. నిబంధనల అమలులో భాగంగా నారాయణపేట జిల్లా పరిధిలో ఇప్పటివరకు 120 మంది డీజే యజమానులు, ఆపరేటర్లను పోలీసులు బైండోవర్ చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాలను భక్తి, సంప్రదాయం, సోదరభావంతో నిర్వహిస్తూ "డీజేలకు స్వస్తి సంప్రదాయ కళలకు ప్రాధాన్యం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎస్పీ కోరారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

## ఉప సర్పంచ్‌ల మండల ఫోరం అధ్యక్షుడు చిట్ల నారాయణ



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్18:(విజన్ ఆంధ్ర) అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప సర్పంచ్‌ల మండల ఫోరం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చోర్పల్లి ఉప సర్పంచ్ చిట్ల నారాయణ అన్నారు. ఆసిఫాబాద్ మండలం చోర్పల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కమ్మరి పెంటయ్య, ఉప సర్పంచ్ చిట్ల నారాయణ వార్డు సభ్యులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా చిట్ల నారాయణ మాట్లాడుతూ "అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా సంక్షేమ పథకాలకు దూరం కాకూడదు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేస్తాం" అని స్పష్టం చేశారు. స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా మారడంతో పాటు లబ్ధిదారులకు రేషన్ పొందడంలో సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులు అర్హతకు సంబంధించిన కీలక పత్రాలని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కార్డు అందే వరకు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పాలన అధికారి చందు, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు కమ్మరి పోచయ్య, అనిత, రాజేష్, రేషన్ డీలర్ చిట్ల జనార్ధన్, గ్రామస్థులు రొమాజీ, రావుజీ, బిక్కు, అంకులు తదితరులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు వెంటనే ప్రారంభించాలి

## అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర)వర్ధన్నపేట నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు ఇంతవరకు ప్రారంభం కాకపోవడంపై వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్యను అందించాలనే ఉద్దేశంతో వర్ధన్నపేట నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి కి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కి వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.200 కోట్ల మేర పరిపాలనా అనుమతులు మంజూరు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఎదురుచూపులు నెలకొన్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు. ద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ, పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ కీలకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా స్పందించి, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలను వేగవంతం చేసి త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో ఉచిత బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం ప్రవేశ పెట్టడం అభినందనీయం,ముఖ్యంగా గర్ల్స్ హాస్టళ్లలో భవన నిర్మాణాలు కాంపౌండ్ వాల్స్ ఇతర మౌలిక వసతులతో పాటు రాత్రి వేళలు కూడా సెక్యూరిటీ సిబ్బందిలను ఏర్పాటు చేయాలని సభలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

# ఎన్ఐటీ వరంగల్ 24వ స్నాతకోత్సవం

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర).జాతీయ సాంకేతిక సంస్థ వరంగల్ 24వ స్నాతకోత్సవాన్ని 2026 సెప్టెంబర్ 19 మరియు 20 తేదీల్లో ఎన్ఐటీ వరంగల్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహించనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ మరియు డాక్టరల్ ప్రోగ్రామ్‌లకు చెందిన మొత్తం 1,997 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. సెప్టెంబర్ 19న ప్రధానంగా అండర్‌గ్రాడ్యుయేట్ పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేయనుండగా, సెప్టెంబర్ 20న పోస్ట్‌గ్రాడ్యుయేట్ మరియు పీహెచ్‌డీ పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. రెండు రోజుల కార్యక్రమాలు ఉదయం 10:00 గంటలకు ప్రారంభమవుతాయి24వ స్నాతకోత్సవంలో ప్రదానం చేయనున్న డిగ్రీలుఅండర్‌గ్రాడ్యుయేట్ డిగ్రీలు: 930పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీలు: 945పీహెచ్‌డీ డిగ్రీలు: 100ఎగ్జిట్ డిగ్రీలు: 22మొత్తం: 1,997 డిగ్రీలుటెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సంతోష్ కుమార్ ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెమీకండక్టర్ పరిశ్రమలో ఆయన నాయకత్వం, సాంకేతిక ఆవిష్కరణలు, ఇంజినీరింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ, అలాగే సాంకేతిక రంగంలో పట్టభద్రులకు అందుబాటులో ఉన్న అభివృద్ధి అవకాశాలపై విలువైన దృక్కోణాలను అందించనుంది. స్నాతకోత్సవానికి ఎన్ఐటీ వరంగల్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ డా. బి. వి. ఆర్. మోహన్ రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. డా. బి. వి. ఆర్. మోహన్ రెడ్డి సైయంట్ వ్యవస్థాపక చైర్మన్ మరియు బోర్డ్ సభ్యుడు. సాంకేతికత ఆధారిత పారిశ్రామికవేత్తగా, సాంకేతిక మరియు ఇంజినీరింగ్ రంగాల్లో, అలాగే పరిశ్రమ ▪ విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఆయన విశేష సేవలందించారు. పట్టభద్రుల విజయాలను ఘనంగా జరుపుకోవడంతో పాటు, ఇంజినీరింగ్ మరియు సాంకేతిక రంగాలకు విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను కూడా ఎన్ఐటీ వరంగల్ సత్కరించనుంది. అసాధారణ సాంకేతిక మరియు ఇంజినీరింగ్ సేవలకు గుర్తింపుగా ఇద్దరు ప్రముఖులకు గౌరవ డిగ్రీలు



ప్రదానం చేయనుంది. డా. పద్మనాభన్ కె. మీనన్‌కు విమానయాన మరియు అంతరిక్ష ఇంజినీరింగ్ రంగంలో "ఇన్నోవేటివ్ అప్లికేషన్స్ అఫ్ ఆటోమేటిక్ కంట్రోల్ టెక్నాలజీస్ టూ అవియేషన్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ " అనే అంశంలో చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి . ఎస్సీ ) డిగ్రీ ప్రదానం చేయబడుతుంది. ఆనంద్ రామమూర్తికి "అడ్వాన్సింగ్ ఇండియా 'స్ సెమికండక్టర్ అంబిషన్స్ త్రు విషనరీ టెక్నాలజీ లీడర్షిప్ " అనే అంశంలో చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా గౌరవ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ( పీహెచ్డీ .) డిగ్రీ ప్రదానం చేయబడుతుంది. ఈ స్నాతకోత్సవంలో అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు, ప్రాజెక్ట్ వర్క్, డిసర్టేషన్‌లు మరియు డాక్టరల్ పరిశోధనల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కూడా సత్కరించనున్నారు. డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ ▪ విద్యా ప్రతిభ (బి .టెక్ .)సిద్ధి బార్పుటే ▪ బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్; అన్ని బీటెక్ ప్రోగ్రామ్‌లలో అత్యధిక ప్రతిభ కనబరిచినందుకు. రోల్ ఆఫ్ ఆనర్ గోల్డ్ మెడలిస్ట్స్ ▪ యూజీ ప్రియాన్షు కుమార్ సింగ్ ▪ బీటెక్ సివిల్ ఇంజినీరింగ్; తరగతిలో ప్రథమ స్థానం. నలజాల జోషిత్ ▪ బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్; తరగతిలో ప్రథమ స్థానం. వలుసా రఘువరన్ ▪ బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్; తరగతిలో ప్రథమ స్థానం. దొండపాటి లోకేశ్వర్ ▪ బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్; తరగతిలో ప్రథమ స్థానం. మదగాని సాత్విక్ ▪ బీటెక్ మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్; తరగతిలో ప్రథమ స్థానం. సిద్ధి బార్పుటే ▪ బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్; తరగతిలో ప్రథమ స్థానం. జయంతి అను బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్; తరగతిలో ప్రథమ స్థానం. అమన్ అబ్దుల్సమద్ ఇనామ్‌దార్ ▪ బీటెక్ బయోటెక్నాలజీ; తరగతిలో ప్రథమ స్థానం. డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ విద్యా ప్రతిభ (గ్రా+)అడెపు అంజలి ఎం. టెక్ స్మార్ట్ ఎలక్ట్రిక గ్రిడ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం; అన్ని ఎం. టెక్ ప్రోగ్రామ్‌లలో ప్రథమ స్థానం. జాలుమెడి భరణి ▪ ఎం. ఎస్‌సి. (టెక్) ఇంజినీరింగ్ ఫిజిక్స్, ఫిజిక్స్ విభాగం; ఎంబీఏ , ఎంసీఏ మరియు ఎమ్మెస్సీ . ప్రోగ్రామ్‌లలో ప్రథమ స్థానం. ఉత్తమ ప్రాజెక్ట్ వర్క్, డిసర్టేషన్ మరియు థీసిస్ అవార్డులుబుద్ద జెశ్వంతి ▪ బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం. ఉత్తమ బి .టెక్ . ప్రాజెక్ట్ వర్క్:"ఎక్స్పిరిమెంటల్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ఏ కంపెక్ట్ డ్యూయల్ సెల్ పాసివే డి ఎం ఎఫ్ సి అండ్ స్టాక్ డిజైన్ ఫర్ పవర్ జనరేషన్ ."అట్కరే సార్థక్ వినోద్ ఎం. టెక్ మెషిన్ డిజైన్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం. ఉత్తమ ఎం .టెక్ . డిసర్టేషన్:"డెవలప్మెంట్ అఫ్ ఏ హైబ్రిడ్ డాటా- డ్రివన్ ప్రిడిక్షన్ మోడల్ ఫర్ బోల్ట్ లూజ్నెస్ డిటెక్షన్ ."డా. అపూర్వ బోరా ▪ కెమిస్ట్రీ విభాగం. త్తమ పీహెచ్డీ . థీసిస్:"డెవలప్మెంట్ అఫ్ కాస్ట్- ఎఫెక్టివ్ ట్రాన్సషన్ మెటల్ - బేస్డ్ ఎలక్ట్రాకేటలీస్ట్స్ ఫర్ ఆల్కలినే అండ్ ఆల్కహాల్ హైబ్రిడ్ వాటర్ ఎలక్ట్రాలిసిస్ అండ్ డైరెక్ట్ మెత్తనోల్ ఫ్యూయల్ సెల్ అప్లికేషన్స్ ."ఎన్ఐటీ వరంగల్ పట్టభద్రులకు మరియు అవార్డు గ్రహీతలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారి భవిష్యత్ ప్రయాణం విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తోంది. 24వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంలో, పట్టభద్రుల విజయాలను మరియు విశిష్ట గౌరవ గ్రహీతల సేవలను విస్తృత ప్రజానీకానికి తెలియజేయడంలో మీడియా అందిస్తున్న విలువైన సహకారాన్ని ఎన్ఐటీ వరంగల్ ఎంతో అభినందిస్తోంది. ఈరోజు మీడియా సమావేశానికి విచ్చేసినందుకు మరోసారి ధన్యవాదాలు. మీ విలువైన సమయం, భాగస్వామ్యం మరియు నిరంతర ప్రోత్సాహానికి ఎన్ఐటీ వరంగల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

# పొన్నాల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా మహా గణనాథుని నిమజ్జన యాత్ర..!

- దుర్గా నగర్‌లో భక్తిశ్రద్ధలతో కొనసాగిన నిమజ్జన వేడుకలు..!
- ముఖ్య అతిథులుగా హాజరైన వివిధ పార్టీల నాయకులు, బహుజన ఉద్యమ నేతలు..!



కాప్రా/సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : దుర్గా నగర్‌లో పొన్నాల లలిత (ఎక్స్ వార్డు మెంబర్) ఆధ్వర్యంలో మహా గణనాథుని నిమజ్జన యాత్రను ఘనంగా నిర్వహించారు. పొన్నాల మహేందర్ ఆధ్వర్యంలో సాగిన యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. భక్తుల సందడితో దుర్గా నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మంద కార్తిక్ మాట్లాడుతూ, గణేష్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాం తంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేశపాక రామ చందర్, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు, మేడ్చల్ ఇన్‌చార్జి కొరాపాక అంజి మాది గ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇటుక కిషన్, హైదరాబాద్ ఇన్‌చార్జి, మల్లి కార్జున్ గౌడ్,టేకులపల్లి రామచందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు,దళిత రత్న అవార్డు గ్రహీతలు సీనియర్ జర్నలిస్టులు ఏళ్ల సంతోష్ కుమార్, ఇడపాక సురేష్, సీనియర్ జర్నలిస్టులు ఎం చిరంజీవి, శివ అద్వైత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి పడితే చర్యలు తప్పవు

- కార్యాలయాలకు వచ్చే బాధితులకు గౌరవమివ్వాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించడం అధికారుల ప్రాథమిక బాధ్యతని, ప్రజాస్వామ్యంలో ప్రజల్లో పాలనపై నమ్మకం కలిగేలా వ్యవహరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక (సబ్ ప్లాన్) నిధులు పక్కదారి పట్టకుండా పక్కాగా పర్యవేక్షించాలని, నిబంధనలకు విరుద్ధంగా మళ్లిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శుక్రవారం వనపర్తి జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి, కమిషన్ సభ్యులతో కలసి వివిధ శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.

**కేసుల విచారణ వేగవంతం చేయాలి**

ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసుల్లో విచారణను చట్టప్రకారం వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని చైర్మన్ స్పష్టం చేశారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులతో పాటు ఎఫ్ఎస్ఎల్ (ఫోరెన్సిక్) కేసులు పెండింగ్‌లో లేకుండా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. బాధితులకు అందాల్సిన పరిహారం, విదేశీ విద్య, కులాంతర వివాహాల ప్రోత్సహకాలు సకాలంలో చెల్లించాలని, పెండింగ్ వివరాలను నివేదిక రూపంలో అందించాలని ఆదేశించారు. ఈ నెల 22న ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో చర్చించి బకాయి నిధుల విడుదలకు చొరవ చూపుతామన్నారు. జిల్లాలోని పోడు భూములు, అటవీ భూముల సమస్యలపై నివేదిక ఇస్తే సీఎంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

**రోస్టర్ విధానం పక్కాగా ఉండాలి**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన రిజర్వేషన్ నిబంధనలు, రోస్టర్ విధానం, రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన భద్రతా పరికరాలు, జీతాలు వేళకు అందించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే తీర్చాలని సూచించారు. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల నియామకాల్లో ఎస్టీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

**అంబేద్కర్ కళాభవన్, స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి**

వనపర్తి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ కళాభవన్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు 'విజిబి రామ్‌జీ' కింద నూతన భవనాల మంజూరుకు నివేదికలు సమర్పించాలన్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, మౌలిక వసతులకు ప్రతిపాదనలు పంపాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిపారు. ప్రతి నెలా తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే నిర్వహించడంతో పాటు ప్రతి మూడు నెలలకోసారి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించాలని ఆదేశించారు. సమావేశానికి ముందు కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతారెడ్డి చైర్మన్‌కు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలుకగా, పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ సమీక్షలో కమిషన్ సభ్యులు లక్ష్మణ్, రాంబాబు నాయక్, అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్, ఎస్సీ సంక్షేమాధికారి రాంజీ రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిరాజుద్దీన్, సామాజికవేత్త గంధం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధ



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 18 (విజన్ఆంధ్ర) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను జిల్లాలోని అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తహశీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు ఎన్. వై. గిరి తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులందరూ తమకు సమీపంలోని ఎంపీడీవో లేదా తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు లేదా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 19న ఓటర్ల జాబితా ప్రచురణతో పాటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 24న నామినేషన్ల స్వీకరణ, సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 26న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించడంతో పాటు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల పోలింగ్ తేదీ ను తాత్కాలికంగా అక్టోబర్ 4వ తేదీగా నిర్ణయించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# 'మీ పాప ఆత్మహత్య చేసుకోదనే గ్యారంటీ ఏంది?'

- విద్యార్థిని తల్లిదండ్రులను ప్రశ్నించిన ప్రిన్సిపాల్
- అక్క ఆత్మహత్యతో విషాదంలో ఉన్న కుటుంబానికి మరో షాక్
- గురుకులం ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



భీమదేవరపల్లి: అక్క ఆత్మహత్యతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబానికి గురుకుల పాఠశాల యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మరింత ఆవేదనకు గురిచేసిందని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపించారు. 'మీ పాప ఆత్మహత్య చేసుకోదనే గ్యారంటీ ఏంది?' అంటూ ప్రిన్సిపాల్ తమను ప్రశ్నించారని వారు తెలిపారు. అనంతరం తమ కుమార్తెకు బదిలీ ధ్రువపత్రం ఇచ్చి మరో పాఠశాలకు పంపిస్తామని చెప్పారని ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురైన తల్లిదండ్రులు శుక్రవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని డాక్టర్ పి.వి. రంగారావు బాలికల గురుకుల పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు.

**నెల రోజుల క్రితం అక్క ఆత్మహత్య**

ముల్కనూరు గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని వంగరలోని బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. నెల రోజుల క్రితం ఆమె కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ముల్కనూరులోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఆమె అక్క ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అంత్యక్రియలు, కర్మక్రియలు పూర్తయ్యే వరకు విద్యార్థిని కూడా కుటుంబ సభ్యుల వద్దే ఉన్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. కర్మక్రియలు పూర్తైన అనంతరం కుమార్తెను తిరిగి గురుకుల వసతి గృహంలో దింపేందుకు తీసుకెళ్లగా, ప్రిన్సిపాల్ తమతో మాట్లాడారని తల్లిదండ్రులు చెప్పారు. విద్యార్థినికి బదిలీ ధ్రువపత్రం ఇచ్చి మరో పాఠశాలకు పంపిస్తామని చెప్పినట్లు ఆరోపించారు.

**'నా బిడ్డను ఎందుకు పంపిస్తున్నారు?'**

తమ కుమార్తె ఇప్పటికే అక్కను కోల్పోయి తీవ్ర మానసిక వేదనలో ఉందని, ఇలాంటి సమయంలో ఆమె చదువుతున్న పాఠశాల నుంచి పంపించడం వల్ల మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు తెలిపారు. అదే పాఠశాలలో చదువు కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాలని కోరినా ప్రిన్సిపాల్ అంగీకరించలేదని వారు ఆరోపించారు. గతంలో పాఠశాలలో ఓ విద్యార్థిని మృతి చెందిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం తమ పెద్ద కుమార్తె కూడా ఆత్మహత్య చేసుకుందని, 'ఈ పాప కూడా ఆత్మహత్య చేసుకోదనే గ్యారంటీ ఏంది?' అని ప్రిన్సిపాల్ ప్రశ్నించారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు తమను తీవ్రంగా కలిచివేశాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**గట్ల నర్సింగాపూర్‌కు పంపిస్తామన్నారని ఆరోపణ**

విద్యార్థినికి బదిలీ ధ్రువపత్రం ఇచ్చి గట్ల నర్సింగాపూర్ పాఠశాలకు పంపిస్తామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు కూడా సమాచారం ఇచ్చామని ప్రిన్సిపాల్ చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమార్తె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఎలాంటి తప్పు చేయని తమ కుమార్తెను ఎందుకు మరో పాఠశాలకు పంపిస్తున్నారో స్పష్టంగా తెలియజేయాలని వారు డిమాండ్ చేశారు. కుటుంబం ఇప్పటికే పెద్ద కుమార్తెను కోల్పోయిన పరిస్థితుల్లో చిన్న కుమార్తె చదువుకు ఆటంకం కలిగించే నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు.

**గురుకులం ఎదుట ఆందోళన**

తమ కుమార్తె చదువు కొనసాగించేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ తల్లిదండ్రులు శుక్రవారం గురుకుల పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. విద్యార్థిని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లేదా సంబంధిత ఉన్నతాధికారుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

# గొట్టిముక్కులలో చేయూత పెన్షన్ దరఖాస్తుల పరిశీలించిన కలెక్టర్



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 18విజన్ఆంధ్ర) : దోమకొండ మండలం గొట్టిముక్కుల గ్రామంలో చేయూత పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. చేయూత పెన్షన్ పరిశీలనలో భాగంగాయాప్ ద్వారా వితంతు పెన్షన్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుదారుల వివరాలు, సంబంధిత ధ్రువపత్రాల పరిశీలన అనంతరం యాప్‌లో వివరాలను నమోదు చేసి అప్‌లోడ్ చేస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటిస్తూ, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను నిర్ణీత విధానంలో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యాప్ ద్వారా వితంతు పెన్షన్ దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆది శ్రీనివాస్‌కు సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

# అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ప్రభుత్వ విప్‌ను అభినందించిన ముఖ్యమంత్రి

- ప్రజాసేవలో మరింతగా కొనసాగాలని ఆకాంక్ష.
- రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచన



వేములవాడ, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో హైదరాబాద్ఆది శ్రీనివాస్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రజాసేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధికి, ప్రజాపాలనలో భాగస్వామిగా కొనసాగాలని ఆకాంక్షించారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- లబ్ధిదారులను ఒప్పించి పనులు ప్రారంభించేలా చూడాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకునేలా అధికారులు చర్యలు వేగవంతం చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ హాలులో తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ భవనాలకు స్థల సేకరణ, డెంగీ నివారణ చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి, వారికి అవగాహన కల్పించి పనులు మొదలుపెట్టించే బాధ్యతను ఎంపీడీఓలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న పేదలకు స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు ఇప్పించాలని చెప్పారు. అలాగే గోడలు నిర్మించుకుని, పైకప్పు కవేలాలు లేదా రేకులతో ఉన్న పేదలను గుర్తించి, ఇందిరమ్మ పథకం కింద రూఫ్ వేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోని గుడిసెలు, కవేల ఇళ్లను సర్వే చేసి అర్హులైన నిరుపేదల జాబితాను నివేదించాలని ఆదేశించారు.

**స్థల గుర్తింపులో ఆలస్యం తగదు**

ఉపాధి హామీ పథకం కింద మంజూరైన అంగన్‌వాడీ భవనాలు, వీఓ భవనాలు, గోదాముల నిర్మాణాలకు వెంటనే స్థలాలను గుర్తించి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. స్థల సేకరణ ప్రక్రియ ఇప్పటికే ఆలస్యమైందని, ఇకపై వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో, పారదర్శకంగా పూర్తి చేసే బాధ్యత తహసీల్దార్లదేనని పేర్కొన్నారు.

**పరిశుభ్రత లోపిస్తే చర్యలు**

జిల్లాలో డెంగీ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా డెంగీ పాజిటివ్ కేసు నమోదైతే వెంటనే ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులు చేపట్టి, పరిసర ప్రాంతాల ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు ఎన్. ఖీమ్యా నాయక్ (స్థానిక సంస్థలు), టి. వినోద్ కుమార్ (రెవెన్యూ), ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ పీడీ విటోబా, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గణనాథులను దర్శించుకున్న డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి

- వనపర్తిలోని పలు మండపాల్లో ప్రత్యేక పూజలు



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర) : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో కొలువుదీరిన గణనాథులను డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. పట్టణంలోని 12, 30, 32వ వార్డులతో పాటు పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. మండపాల వద్దకు చేరుకున్న ఆయనకు ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు వేద మంత్రోచ్చరణలు, డప్పు మేళాల నడుమ ఘన స్వాగతం పలికారు. గణనాథుడి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా ఉండాలని ప్రార్థించినట్లు శివసేన రెడ్డి తెలిపారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, దర్శనానికి వచ్చే భక్తులకు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు యాదవ్, నాయకులు చంద్రమౌళి, మధుసూదన్, శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు క్రాంతి కుమార్ గౌడ్, నక్క రాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు శివ కుమార్ నాయుడు, అరవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలి

- అల్వాల్ లో ఉద్యమ కారులు డిమాండ్



అల్వాల్, సెప్టెంబర్ 18,(విజన్ ఆంధ్ర): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలని అల్వాల్ లో పలువురు ఉద్యమకారులు డిమాండ్ చేశారు. అల్వాల్ జేఏసీ రిలే నిరవధిక దీక్ష లో భాగంగా శుక్రవారం రెండవ రోజు అమరవీరుల శిబిరంలో కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడంతో పాటుగా కు తమకు ఇచ్చిన హామీలన్ని తూచా తప్పకుండా ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ దీక్షలో పట్లోళ్ల సురేందర్ రెడ్డి, రషీష్ భాస్కర్, సత్తయ్య కూర్చున్నారు. ఈ దీక్షకు దయాకర్, సంతోష్, సుధీర్, రమేష్, సంగమేశ్వర్, నరసింహ తదితరులు హాజరై తమ సంఘీభావం తెలిపారు

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

- కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి
- మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ కు వినతి



మల్కాజిగిరి, సెప్టెంబర్ 18,(విజన్ ఆంధ్ర): అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి కోరారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు, మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్ ని కలిసి పలు అభివృద్ధి పనులకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి మాట్లా డుతూ.. ధోబీఘాట్ అభివృద్ధి కోసం రూ 45 లక్షల నిధులు మంజూరు చేయాలని,అలాగే వాయుపురి కాలనీలో మిగిలిన అంతర్గత రోడ్లను నిర్మించాలని,భరణి కాలనీ లో మరో రహదారి నిర్మిం చాలని కోరారు. ఆయా అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేసి, ఈ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆయన జోనల్ కమిషనర్ ని కోరా రు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్. ఆర్. ప్రసాద్, ధోబీఘాట్ అధ్యక్షులు కృష్ణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ళయినా నిధులు శూన్యం.

*అర్బన్ సమస్యలపై అనేకసార్లు లేఖలు అందజేశా అసెంబ్లీలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.*



నిజామాబాద్ సెప్టెంబర్18:(విజన్ ఆంధ్ర ) కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినా ప్రత్యేక నిధులు విడుదల కాలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి మూడు సార్లు లేఖలు ఇచ్చినా స్పష్టత లేదన్నారు. కళాభారతి, మాధవనగర్ బ్రిడ్జి పనులకు బిల్లులు చెల్లించలేక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారన్నారు. అలాగే నిజామాబాద్ బస్‌స్టాండ్ పరిస్థితి మండల కేంద్రం బస్‌స్టాండ్‌లా ఉందని, దీని అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందని విమర్శించారు. ఇక జీజీహెచ్ ప్రభుత్వ ఆసుపత్రిపై గతంలో సమీక్షలు జరిగినా పరిస్థితుల్లో మార్పు లేదన్నారు. ప్రధానంగా ఆసుపత్రి మార్చురీలో ఫ్రీజర్లు లేక దుర్వాసన వస్తోందని, జనరల్ వార్డుల్లోనూ సమస్యలు ఉన్నాయన్నారు. ఆందోళన. 800 మంది విద్యార్థులకు ఒక బాలికల ప్రభుత్వ పాఠశాల ( పబ్లిక్ స్కూల్ ) ఏర్పాటు ప్రతిపాదన చేసినా నిజామాబాద్‌లో ఇప్పటివరకు ఒక్క ఇటుక కూడా పేర్చలేదని విమర్శించారు.

# వెల్టూరులో రూ.11.75 కోట్లతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'

- స్థలాన్ని పరిశీలించినఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- కార్పొరేట్ ధీటుగా ప్రభుత్వ చదువులు
- సెమీ రెసిడెన్షియల్ విధానంలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు
- ఉచిత రవాణా సౌకర్యం, రూ.1,400 విలువైన విద్యార్థి కిట్లు
- ఉపాధ్యాయులకు విదేశీ బోధనా పద్ధతులపై ప్రత్యేక శిక్షణ

వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను అందుబాటులోకి తీసుకురావడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో రూ. 11.75 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ప్రతిపాదిత స్థలాన్ని శుక్రవారం ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల నిర్మాణం, విద్యార్థులకు కావలసిన వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు.

***కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు***

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు పరిమితమైన ఆధునిక విద్యా ప్రమాణాలను సర్కారు బడుల్లో ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. సెమీ రెసిడెన్షియల్ విధానంలో రూపుదిద్దుకుంటున్న ఈ పాఠశాలల్లో నాణ్యమైన



బోధనతో పాటు క్రీడలు, వ్యక్తిత్వ వికాసం, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలకు చేరుకోవడానికి ప్రత్యేక బస్సుల ద్వారా రవాణా సౌకర్యాన్ని ఉచితంగా కల్పిస్తున్నామని చెప్పారు.

***విదేశీ విద్యా విధానాలపై ఉపాధ్యాయులకు అవగాహన***

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి, అక్కడి ఆధునిక విద్యా వ్యవస్థ, సాంకేతిక వినియోగం, ఉత్తమ బోధనా పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అక్కడి వినూత్న విధానాలను మన పాఠశాలల్లో అమలు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరుగుతాయన్నారు.



*రూ. 1,400 విలువైన కిట్లు ఉచితం*

తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రతి విద్యార్థికి రూ. 1,400 విలువైన విద్యా సామగ్రి కిట్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక వసతులతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గట్టి పునాది వేస్తున్నామని పునరుద్ఘాటించారు. అనంతరం ఎమ్మెల్యే మేఘారెడ్డి స్థానిక విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి, వారితో సెల్ఫీలు దిగి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పెద్దమందడి, వెల్టూరు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు తుపాకి పేలి ఆర్ఐ మృతి

- పుష్పగుచ్ఛశీ సమర్పించి నివాళులర్పించిన పోలీస్ కమిషనర్





నిజామాబాద్ సెప్టెంబర్18:(విజన్ ఆంధ్ర ) : నేడు నిజామాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ యందు ఎన్.ఎస్.ఓ ( నైట్ సెక్యూరిటీ ఆఫీసర్) డ్యూటీ ముగించుకొని వచ్చిన తర్వాత ఉదయం సమయంలో ఆయుధం క్లీన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు మిస్ఫైర్ కావడం వల్లన రిజర్వ్ ఇన్స్పెక్టర్ హెచ్. సతీష్ (41) మరణించడం జరిగింది. ఇట్టి సంఘటన స్థలాన్ని హుటాహుటిననిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఐపీఎస్., పర్యవేక్షించారు. అనంతరంనిజామాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ లో పోస్టుమార్టం అనంతరం పోలీస్ కమీషనర్ పుష్ప గుచ్ఛలు ఉంచి ఘనంగా నివాళులుఅర్పించారు. ఈ సందర్భంగా నివాళులు అర్పించిన వారిలో అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్ , నిజామాబాదు ఏసిపి ప్రకాష్ , ఆర్మూర్ ఎసిపి శ్రీ వెంకటేశ్వర్ రెడ్డి , బోధన్ ఎసిపి శ్రీనివాసులు , ఏ.ఆర్ ఏ సి పి కృష్ణ స్వామి , సి.సి.ఎస్ ఏ సి పి శ్రీశైలం , టాస్క్ ఫోర్స్ ఎ.సి.పి నరేందర్ , సి.టి.సి ఎ సి పి రాజశేఖర్ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు శ్రీ శ్రీధర్ రెడ్డి మల్లేశం మరియు సిఐలు , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు , ఎస్.ఐ లు , ఆర్ఎస్ఐలు , పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుల శ్రీను , యావత్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.నివాళుల అనంతరము ప్రత్యేక అంబులెన్స్ లో తన స్వస్థలం అయినటువంటి ఇల్లెందు మండలం ఖమ్మం జిల్లాకు తరలించారు.

# రైతులకు ఏ దశలోనూ ఇబ్బందులు తలెత్తకూడదు

- అదనపు కలెక్టర్ భుజంగరావు
- ధాన్యం కొనుగోళ్లపై కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ, సన్నాహక సమావేశం




నిజామాబాద్, సెప్టెంబర్ 18 :(విజన్ ఆంధ్ర )ఖరీఫ్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. రైతులు ఏ దశలోనూ ఇబ్బందులు పడకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని అన్నారు. ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో శుక్రవారం సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహించనున్న నిర్వాహకులతో సన్నాహక సమావేశం, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి కొనుగోలు కేంద్రంలోనూ రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సరిపడా సంఖ్యలో తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధాన్యం సేకరణ ముగిసేంత వరకు పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఏమైనా సమస్యలు గమనించిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. రైతుల నుండి ఏ చిన్న ఫిర్యాదు సైతం రాకుండా చూసుకోవాలని, ధాన్యం సేకరణలో క్షేత్రస్థాయి అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూరుస్తామని. అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట గోడౌన్లకు తరలించేలా తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, ఏఎస్ఓ అరవింద్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగుబాయి, తూనికలు కొలతల శాఖ అధికారి షుజాత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్ములా ఈ కేసుతో కేటీఆర్‌పై వేధింపులు ఎన్నాళ్లు?

- బీఆర్ఎస్ నేత జంపన్న.




ములుగు, సెప్టెంబర్ 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఫార్ములా ఈ కేసు పేరుతో కేటీఆర్‌ను వేధించడం ఎన్నాళ్లని బీఆర్ఎస్ ములుగు నేత భూక్య జంపన్న ప్రశ్నించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్, ఈ-మొబిలిటీ అభివృద్ధి కోసమే కేటీఆర్ ఫార్ములా ఈ రేస్ తెచ్చారని, ఇదే బాటలో ఇతర నగరాలు, తమిళనాడు కూడా అంతర్జాతీయ ఈవెంట్లు నిర్వహిస్తున్నాయని అన్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కేసుల రాజకీయాలు చేస్తోందని, తప్పుంటే కోర్టులో నిరూపించాలని, యువతకు ఉద్యోగాలు, పెట్టుబడులే ప్రాధాన్యత కావాలని డిమాండ్ చేశారు.

# త్రిశూల్ యూత్ పదో వార్షికోత్సవానికి కవితకు ఆహ్వానపత్రం

- వేడుకలకు హాజరుకావాలని కోరిన నిర్వాహకులు
- పదేళ్ల ప్రస్థానాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు




విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 18: త్రిశూల్ యూత్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వాహకులు కవితను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. సంస్థ పదేళ్ల ప్రస్థానం, యువత కోసం చేపట్టిన కార్యక్రమాలను ఆమెకు వివరించారు. రానున్న వార్షికోత్సవ వేడుకలకు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి, లక్ష్మణ్, సంతోష్, అనిల్‌కుమార్, ఆదిత్య, విష్ణు, తిరుమల తేజ, సమీర్, అరుష్ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో విజయవంతంగా కొనసాగుతున్న స్టార్ హెల్త్ ఉచిత ఆరోగ్య సేవా కేంద్రం

- 3,800 మందికి పైగా లబ్ధి.

నిజామాబాద్ సెప్టెంబర్ 18 :( విజన్ ఆంధ్ర) నిజామాబాద్‌లోని ప్రగతి నగర్‌లో స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య చికిత్సలయం నిజామాబాద్‌లో విజయవంతంగా కొనసాగుతున్న స్టార్ హెల్త్ ఉచిత ఆరోగ్య సేవా కేంద్రం. ఇప్పటి వరకు 3,800 మందికి పైగా లబ్ధిపొందారు. నిజామాబాద్‌లోని ప్రగతి నగర్‌లో స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య సేవా కేంద్రానికి స్థానికుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు ఈ కేంద్రాన్ని 3,800 మందికి పైగా ప్రజలు సందర్శించి, సకాలంలో వైద్య సేవలను అందుకున్నారు. పిరమల్ స్వాస్థ్య భాగస్వామ్యంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (జూ=) కింద నడుస్తున్న ఈ క్లినిక్ ద్వారా స్థానిక కుటుంబాలకు నివాస ప్రాంతాలకే సమీపంలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ రోజూ సగటున 15కి పైగా విజిటర్స్ నమోదవుతుండగా, ముఖ్యంగా 40 నుంచి 80 ఏళ్ల వయస్సు గల వృద్ధులు, మధ్యవయస్కులు ఈ సేవలను ఎక్కువగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో ఎంబీబీఎస్ డాక్టర్ల ఉచిత కన్సల్టేషన్లతో పాటు మధుమేహం, హైపర్‌టెన్షన్ వంటి దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇప్పటివరకు ఈ సెంటర్‌లో 1,900 మందికి పైగా మధుమేహం, 2,700 మందికి పైగా హైపర్‌టెన్షన్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అలాగే, 1,900 మందికి పైగా ల్యాబరేటరీ పరీక్షలు, 3,300కి పైగా ఫార్మసీ సేవలతో పాటు అర్హులైన వారికి 150కి పైగా న్యూమోకాకల్ టీకాలను ఉచితంగా అందించారు. హైపర్‌టెన్షన్, జ్వరం, మధుమేహం వంటి సర్వసాధారణ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన ఔషధాలు, హెల్త్ కౌన్సిలింగ్ సకాలంలో అందుతుండటంతో స్థానికులు ఎంతో ఊరట పొందుతున్నారు. ఈ సందర్భంగా స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ & ఛత్తీస్‌గఢ్) శ్రీనివాస్ కేబీబీ మాట్లాడుతూ స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలను మరింతగా అందుబాటులోకి తేవాల్సిన అవసరాన్ని నిజామాబాద్‌లోని ఆరోగ్య సేవా కేంద్రానికి లభిస్తున్న స్పందన చాలా బాగుందన్నారు. ఈ సెంటరులో ప్రతి రోజు సగటున 15కి పైగా




విజిట్స్ నమోదవుతున్నాయి. తరచుగా 40 నుంచి 80 ఏళ్ల వయస్సు వారు సందర్శిస్తున్నారు. సాధారణంగా హైపర్‌టెన్షన్, మధుమేహం మరియు జ్వరంలాంటి ఆరోగ్య సమస్యల కోసం సంప్రదిస్తున్నారు. ఉచిత కన్సల్టేషన్లు, స్క్రీనింగ్స్, డయాగ్నొస్టిక్ టెస్టులు మరియు ఔషధాల ద్వారా నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఆరోగ్య సంరక్షణ సేవలు సకాలంలో అందేలా మేము తోడ్పాటు అందిస్తున్నాం అని తెలిపారు. దేశవ్యాప్తంగా మా ఆరోగ్య సేవా కేంద్రాలు 1.5 లక్షల మందికి పైగా ప్రజలకు చేరువయ్యాయి. ప్రాథమిక మరియు ప్రివెంటివ్ ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత అందుబాటులోకి తేవడంపై మేము ప్రధానంగా దృష్టి పెడుతున్నాం" అని తెలిపారు. స్టార్ హెల్త్ సంస్థ దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాల్లో 32 ఆరోగ్య సేవా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1.5 లక్షల మందికి పైగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చింది. కేవలం నిజామాబాద్‌లోనే కాకుండా ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలలో కూడా ఈ సీఎస్ఆర్ సేవలను విస్తరించింది. పట్టణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో వైద్య సేవలందని వర్గాలకు ప్రాథమిక మరియు ప్రివెంటివ్ ఆరోగ్య సంరక్షణను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆరోగ్య సేవా కేంద్రం నిర్వహణ మరియు సేవలకు సంబంధించి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ కేబీబీతో పాటు, తెలంగాణ రీజినల్ హెడ్ సురేష్, క్లినిక్ డాక్టర్ డా. సాయి చరణ్, అలాగే స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పీఆర్ఓ తేజస్వి బండారి తదితరులు పాల్గొన్నారు.

# స్లాటర్ హౌస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

- అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలతో కౌసర్ మొహియుద్దీన్ చొరవ.
- కలెక్టర్‌ను కలిసిన సయ్యద్ అఫాన్
- కలెక్టర్‌ను కలిసిన ఎంఐఎం ప్రధాన కార్యదర్శి సయ్యద్ అఫాన్
- సానుకూలంగా స్పందించిన మంచిర్యాల కలెక్టర్



మంచిర్యాల టౌన్ సెప్టెంబర్ 18 విజన్ ఆంధ్ర మంచిర్యాల పట్టణంలో స్లాటర్‌హౌస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ మజ్లిస్ పార్టీ తరపున చేసిన విజ్ఞప్తికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సాహెబ్ సానుకూలంగా స్పందించారు.సదర్-ఎ-మజ్లిస్ జనాబ్ బ్యారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ సాహెబ్ ఆదేశాల మేరకు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు స్లాటర్‌హౌస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మెమోరాండం సమర్పించారు.ఈ క్రమంలో మజ్లిస్ మంచిర్యాల జనరల్ సెక్రటరీ సయ్యద్ అఫాన్ శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి, ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సాహెబ్ సమర్పించిన మెమోరాండాన్ని అందజేశారు. స్లాటర్‌హౌస్ నిర్మాణం కోసం నిధులు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు.ఈ విషయంపై కలెక్టర్ కుమార్ దీపక్ సానుకూలంగా స్పందిస్తూ, స్లాటర్‌హౌస్ నిర్మాణానికి నిధులు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్లాటర్‌హౌస్ నిర్మాణం కోసం చొరవ తీసుకున్న సదర్-ఎ-మజ్లిస్ బ్యారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ , అలాగే సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు మంచిర్యాల ఖురేషీ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు.

# 9 రోజులుగా రైస్ మిల్లుల నిరవధిక సమ్మె - డీఎంకు వినతి

ములుగు, సెప్టెంబర్ 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు గత 9 రోజులుగా జిల్లాలో రైస్ మిల్లులు నిరవధిక సమ్మెలో ఉన్నట్లు ములుగు జిల్లా ఇండస్ట్రీస్ డీఎం సిద్ధార్థ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, కార్యదర్శి సహోదరి రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఉపాధ్యక్షులు అక్కల రఘోత్తం, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.




# ఏసీబీ వలలో గోవిందరావుపేట తహసీల్దార్

- రూ.14 వేల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టివేత



గోవిందరావుపేట / ములుగు, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర): ములుగు జిల్లాలో అవినీతి అధికారి ఏసీబీ వలలో చిక్కాడు. గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్ కుమార్ రూ.14 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు అడ్డంగా దొరికిపోయారు.

**అసలేం జరిగింది?**

భూమి పౌతి (వారసత్వ) మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్న ఓ రైతు కుటుంబం నుండి తహసీల్దార్ సృజన్ కుమార్ లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితులు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో, అధికారులు ముందస్తు ప్రణాళికతో వలపన్నారు. రసాయనం పూసిన నోట్లను బాధితుల ద్వారా తహసీల్దార్ కు ఇప్పించి, ఆయన లంచం తీసుకుంటుండగానే ఏసీబీ డీఎస్పీ ఆధ్వర్యంలోని బృందం దాడి చేసి పట్టుకుంది. ఆయన చేతులపై ఫినాప్తలీన్ పరీక్ష నిర్వహించగా పాజిటివ్ గా తేలినట్లు తెలుస్తోంది. టేబుల్ పై ఉన్న నగదు, రసాయన పరీక్షలో గులాబీ రంగులోకి మారిన ద్రావణం సీసాలు ఫోటోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**కార్యాలయంలో సోదాలు:**

ప్రస్తుతం గోవిందరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. లంచానికి సంబంధించిన ఆధారాలు, ఇతర ఫైళ్లు, రికార్డులను పరిశీలిస్తున్నారు. తహసీల్దార్ ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సోదాలు పూర్తయిన తర్వాత అధికారికంగా కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వివరాలతో కూడిన పూర్తి ప్రకటనను ఏసీబీ విడుదల చేయనుంది. ఈ ఘటనతో ములుగు జిల్లా రెవెన్యూ వర్గాల్లో కలకలం రేగింది. రైతుల నుండి సాధారణ పౌతి మార్పిడి లాంటి పనులకు కూడా లంచం డిమాండ్ చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అనుమతి లేకుండా.. ఎస్+4 నిర్మాణం!

- దొమ్మర పోచంపల్లిలో అక్రమ అంతస్తుల కూల్చివేత
- నిర్మాణాలపై దుండిగల్ సర్కిల్ అధికారుల నిఘా
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్న డిప్యూటీ కమిషనర్

కుతుబుల్లాపూర్, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర): అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణంపై దుండిగల్ సర్కిల్ అధికారులు చర్యలు చేపట్టారు. దొమ్మర పోచంపల్లిలోని ప్లాట్ నంబర్ 7, సర్వే నంబర్ 168లో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఎస్+4 అనధికారిక అంతస్తులను శుక్రవారం కూల్చివేశారు. టౌన్ ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లు గుర్తించిన అధికారులు





కూల్చివేత ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అనుమతులు





ఒకలా తీసుకుని అదనంగా అంతస్తులు నిర్మించే వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

**అక్రమ నిర్మాణాలపై నిఘా**

సర్కిల్ పరిధిలో తక్కువ విస్తీర్ణం ఉన్న స్థలాల్లో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతులకు భిన్నంగా అదనపు నిర్మాణాలు చేపడుతున్న వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**కూల్చివేతలు కొనసాగుతాయి**

నిబంధనలను ఉల్లంఘించిన అనధికార నిర్మాణాలను గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు, కూల్చివేతలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టీపీఎస్ సాయి తేజ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# గణపతి నిమజ్జన కార్యక్రమాలను సరైన సమయంలో పూర్తి చేయాలి.....

- నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి...
- నిమజ్జన ఉత్సవాలలో డీజేలకు అనుమతి లేదు.
- మండపాలలో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రింట్ మీడియా, శాంతినగర్, ఖానాపూర్, క్రాంతి నగర్, గణపతి మండపాల ను దర్శించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)గణపతి నవరాత్రి ఉత్సవాలను ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నందు ప్రశాంత వాతావరణంలో జరగడానికి యువతతో నేరుగా మాట్లాడుతూ పోలీసు ప్రజల సత్సమండాలను మెరుగుపరచడానికి జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రధాన గణపతి మండపాలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా దర్శించి పూజా కార్యక్రమాల నిర్వహించి గణనాథుని సేవలో పాల్గొన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ లోని ప్రింట్ మీడియా గణపతి మండపం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్, ఖానాపూర్, గందేవార్ తోట ప్రాంతాలలోని పలు ప్రధాన గణపతి మండపాలను, టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రాంతి నగర్, భాగ్యనగర్, మహాలక్ష్మి వాడ లోని పలు ప్రధాన గణపతి మండపాలను దర్శించి గణపతి మండప కమిటీ సభ్యులతో నేరుగా మాట్లాడి నిమజ్జనాన్ని సరైన సమయంలో పూర్తి చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దాదాపు పట్టణంలోని 10 మండపాలను దర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. మండపాల వద్ద జిల్లా ఎస్పీ గారిని ఘనంగా సత్కరించిన గణపతి మండప కమిటీ సభ్యులు. మండపాలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమర్జనం ఉత్సవాలలో ఎలాంటి డీజే లకు మరియు లేజర్ లైట్ లకు, పేపర్ చెల్లె యంత్రాలకు అనుమతి లేదని తెలిపారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100/112 ద్వారా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. గణపతి నిమర్జనాన్ని సరైన సమయంలో పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, టూ టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ టి మురళి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విమానాశ్రయ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలి...

- సీఎం సమీక్షకు పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలి - జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్ జిల్లా ( విజన్ ఆంధ్ర బ్యూరో)ఆదిలాబాదు జిల్లాలో విమానాశ్రయ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులతో గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 22న రాష్ట్ర ముఖ్యమంత్రి విమానాశ్రయ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విమానాశ్రయ ప్రాజెక్టు ప్రస్తుత పురోగతి, భూసేకరణ, సర్వే తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి సమీక్ష సమావేశానికి అవసరమైన అన్ని వివరాలు, నివేదికలను తాజా సమాచారంతో సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించిన పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ, సర్వే తదితర ప్రక్రియలను వేగవంతం చేసి, విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలను సకాలంలో చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్, ఆర్డీవో జగదీశ్వర్ రావు, సర్వే శాఖ ఏడీ ప్రభాకర్, ఏవో వర్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సదుపాయాలతో "బైట్స్" డెంటల్ క్లినిక్ ప్రారంభం

- మెరుగైన ట్రీట్మెంట్ అందించిండమే తమ లక్ష్యం : డాక్టర్. హాష్మి




హైదరాబాద్ సెప్టెంబర్ 2026, (ఆకెళ్ళ విశ్వనాథ్): పరిశుభ్రమైన దంతాలు, ఆరోగ్యకరమైన చిగుళ్ళు, ప్రకాశవంతమైన చిరునవ్వులను అందించాలన్న మంచి ఉద్దేశంతో "మీ చిరునవ్వే మా ప్రాధాన్యత" అనే ఆశయం, సంకల్పంతో "బైట్స్" డెంటల్ క్లినిక్ ను హై-లైన్ ఎన్క్లేవ్, నీరూస్ పక్కన, కింగ్ కోటి, హైదరాబాద్ లో గురువారం నాడు సాయంత్రం బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య ముఖ్యఅతిథి, డీన్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్, డాక్టర్. సయ్యద్ జహంగీర్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించామని 'బైట్స్ డెంటల్ క్లినిక్' ఓనర్, ప్రముఖ డెంటల్ సర్జన్, డాక్టర్. ఎస్. ఎ. రాఫెయ్ హాష్మి, బి.డి.ఎస్., ఐఎన్బిడిఇ (యు ఎస్ ఎ), క్లినిక్ పార్ట్నర్ డెంటల్ సర్జన్ డాక్టర్. మొహమ్మద్. ముబషీర్, బి.డి.ఎస్., డిహెచ్ఎ (యు ఎ ఇ) తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్. రాఫెయ్ హాష్మి మాట్లాడుతూ, తమ 'బైట్స్ డెంటల్ క్లినిక్' లో అనుభవజ్ఞులైన దంతవైద్యుల పర్యవేక్షణలోనోటి ఆరోగ్య అవసరాల కోసం చికిత్స ప్రణాళిక, పూర్తి మౌఖిక పరీక్ష, స్కేలింగ్, అన్ని వయసుల వారికి చికిత్స మార్గదర్శకత్వం, మెరుగైన దంతవైద్యం, సౌందర్య సాధనాలు, ఇంప్లాంట్లు, దంతాల కలుపులు, పిల్లల దంతవైద్యం,సమలేఖనములు,లేజర్ డెంటిస్ట్రీ వంటి అత్యాధునిక సదుపాయాలతో సామాన్యులకు అందుబాటులో ఉండే ధరలలో, ప్రొఫెషనల్ ట్రీట్మెంట్ ను అత్యాధునిక టెక్నాలజీ సదుపాయాలతో అందజేస్తామని తెలిపారు. దంతాల ఆరోగ్యం, ప్రత్యేక సంరక్షణ, బెటర్ స్మైల్ కోసం నిపుణుల సలహాలను, ఉచిత కన్సల్టేషన్ ను తాము అందిస్తున్నట్టు తెలిపారు. తమ 'బైట్స్ డెంటల్ క్లినిక్' లో రూట్ కెనాల్ ట్రీట్మెంట్, ఇంప్లాంట్స్, బ్రేసెస్, అలైజనర్స్, ఎక్స్ట్రాక్షన్స్, టీత్ వైటనింగ్, టూత్ జువెలరీ, పీడియాట్రిక్ డెంటిస్ట్రీ, లేజర్ డెంటిస్ట్రీ వంటి ట్రీట్మెంట్లను ఆధునిక టెక్నాలజీ పరికరాలతో హైలెవెల్ డెంటల్ ట్రీట్మెంట్ ను అందిస్తున్నామని డాక్టర్. హాష్మి, డాక్టర్. ముబషీర్ తెలిపారు. ప్రారంభ ఆఫర్ లో భాగంగా నెలరోజుల పాటు దంతాల 'స్కేలింగ్' అలాగే 'ఫిల్లింగ్స్' పై 50 శాతం డిస్కౌంట్ ను తమ కస్టమర్లకు అందజేస్తున్నట్లు తెలుపుతూ, తమ 'బైట్స్ డెంటల్ క్లినిక్' లో డాక్టర్స్ అందుబాటులో ఉండే సమయాలు సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 11 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అలాగే ఆదివారంనాడు మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 6 వరకు ఉంటారని తెలిపారు. ట్రీట్మెంట్ కోసం అపాయింట్మెంట్ ను ఖరారు చేసుకోవడానికి, ఎటువంటి వివరాలకైనా 91- 8106107923 నెంబర్ కు కాల్ చేసి మాట్లాడవచ్చని, లేదా వాట్స్ అప్ కాల్ చేయవచని డాక్టర్. హాష్మి తెలియజేశారు. నోటి సమస్యలతో, పంటి నొప్పితో ఎంతో బాధతో తమ వద్దకు వచ్చిన పేషెంట్లకు మంచి మెరుగైన ట్రీట్మెంట్ ను అందజేసి వారిని సంతోషంగా ఆనందంగా, చిరునవ్వుతో తిరిగి పంపించడమే తమ 'బైట్స్ డెంటల్ క్లినిక్' ప్రధాన ఉద్దేశం అని డాక్టర్. రాఫెయ్ హాష్మి ఈ సందర్భంగా తెలియజేశారు.

# వ్యవసాయ పొలాల్లో గంజాయి సాగు.. 385 మొక్కలు స్వాధీనం

- రూ.38.50 లక్షల విలువైన గంజాయి మొక్కలు పట్టివేత.. ఇద్దరిపై కేసులు
- గంజాయి సాగు, విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు: ఎస్పీ అఖిల్ మహాజన్
- సమాచారం అందించిన వారికి నగదు బహుమతులు.. వివరాలు గోప్యంగా ఉంచుతాం



ఆదిలాబాద్ జిల్లా, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర బ్యూరో): జిల్లాలో గంజాయి నిర్మూలనకు పోలీసులు చేపడుతున్న చర్యల్లో భాగంగా ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పొటంలొద్ది గ్రామ శివారులో వ్యవసాయ పొలాల్లో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు వేర్వేరు ఘటనల్లో మొత్తం 385 గంజాయి మొక్కలను పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.38.50 లక్షలు ఉంటుందని వెల్లడించారు. పొటంలొద్ది గ్రామానికి చెందిన మెస్రం గంగారాం పటేల్ వ్యవసాయ పొలంలో తనిఖీలు నిర్వహించగా 315 గంజాయి మొక్కలు గుర్తించారు. వ్యవసాయ విస్తరణ అధికారి పరిశీలనలో అవి గంజాయి మొక్కలేనని నిర్ధారణ కావడంతో స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.31.50 లక్షలుగా అంచనా వేశారు. మరో వ్యవసాయ పొలంలో మెస్రం నాగు సాగు చేస్తున్న 70 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. రెండు ఘటనల్లోనూ నిందితులు సంఘటనా స్థలంలో లేకపోవడంతో పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులు మెస్రం గంగారాం పటేల్, మెస్రం నాగుపై ఎన్డీపీఎస్ చట్టం కింద రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. గంజాయి సాగు చేసే రైతులకు ప్రభుత్వ పథకాలు అందకుండా సిఫార్సులు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 250 ఎకరాల వ్యవసాయ భూముల్లో గంజాయి సాగు చేసిన వారికి ప్రభుత్వ పథకాలు నిలిపివేయాలని సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారాన్ని జిల్లా ఎస్పీ నిర్వహిస్తున్న 8712659973 వాట్సాప్ నంబర్కు పంపాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు నగదు బహుమతులు, రివార్డులు అందిస్తామని తెలిపారు. గంజాయి వ్యసనానికి గురైన యువతకు తల్లిదండ్రులు సమాచారం అందిస్తే డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ దాడుల్లో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, రూరల్ ఎస్సై వి. విష్ణువర్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డెంగ్యూ ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మర పారిశుధ్య చర్యలు

- జ్వరం లక్షణాలు ఉన్నవారి నుంచి నమూనాలు సేకరించాలి
- ఎన్టీఆర్ కాలనీలో డ్రైడే పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


ప్రజలు జాగ్రత్తలు వహించాలి

వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర) : డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో వెంటనే ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, జ్వర లక్షణాలు ఉన్నవారి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. వనపర్తి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన 'డ్రైడే' కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల డెంగ్యూ కేసు నమోదైన ఇంటితో పాటు పరిసర ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని, లార్వా నివారణ చర్యలు నిరంతరం చేపట్టాలని సూచించారు. డ్రైడే కార్యక్రమాన్ని కేవలం వారానికి ఒక రోజుకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతిరోజూ నీటి నిల్వలను గుర్తించి ఖాళీ చేయించేలా పనిచేయాలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ పాత్రలలో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- పరిశుభ్రత నిత్య జీవితంలో భాగం కావాలి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





వనపర్తి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. శుక్రవారం ఏదుల మండలం చెన్నారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల పరిసరాలతో పాటు ఇళ్లు, గ్రామాల్లోనూ పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. స్వచ్ఛమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం అందజేసిన యూనిఫాంలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు బాగా చదువుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. స్వచ్ఛతా హీ సేవా పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్ బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. అనంతరం 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో ఆయన మొక్క నాటారు. పాఠశాల ఆవరణలోని శిథిలావస్థకు చేరిన ప్రమాదకర పాత భవనాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. అలాగే పాఠశాల క్రీడా మైదాన భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి, త్వరగా హద్దులు నిర్ధారించాలని స్పష్టం చేశారు. గ్రామంలోని గ్రంథాలయం, ఆరోగ్య ఉపకేంద్రం పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరగా, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, గోపాల్పేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్య శిలా రెడ్డి, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రత్యేక పిల్లలకు 'భవిత'.. రైతులకు బాసట

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- పెబ్బేరులో నూతన భవిత కేంద్రం, రూ.44 లక్షలతో నిర్మించిన మార్కెట్ యార్డ్ గదుల ప్రారంభం




వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18(విజన్ ఆంధ్ర) : విద్యా, వ్యవసాయ రంగాల మౌలిక వసతుల బలోపేతానికే ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. శుక్రవారం పెబ్బేరు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించారు. స్థానిక పాఠశాల ఆవరణలో నిర్మించిన నూతన 'భవిత' కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారి సామర్థ్యాలకు అనుగుణంగా విద్య, శిక్షణ అందించేందుకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, కమ్యూనికేషన్ నైపుణ్యాలతో పాటు స్వయం ఆధారిత శిక్షణ ఇచ్చి, వారిని సాధారణ పాఠశాల విద్యకు అనుసంధానించేందుకు భవిత కేంద్రం దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి సమాన విద్యా అవకాశాలు కల్పించి, వారిలోని ప్రతిభను వెలికితీయడమే సమగ్ర విద్య ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.

*మార్కెట్ యార్డులో మెరుగైన సేవలు*

అనంతరం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.44 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు పరిపాలనా కార్యాలయ గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ నూతన భవనంతో యార్డు పరిపాలనా కార్యకలాపాలకు అదనపు వసతులు అందుబాటులోకి వచ్చాయని, అధికారులు, సిబ్బంది విధులను సౌకర్యవంతంగా నిర్వహించేందుకు వీలుకలుగుతుందని చెప్పారు. రైతులు, వ్యాపారుల కొనుగోలు, విక్రయాలకు అనుకూలమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు తగినట్లుగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరా,కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు, నాయకులు కోదండరామిరెడ్డి, మాజీ సర్పంచులు సురేందర్ గౌడ్, వెంకటేష్ సాగర్, యుగేందర్ రెడ్డి, రంజిత్ కుమార్, యపర్ల రాంరెడ్డి, రాములు యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తొలిసారి పురగిరి క్షత్రియ కుల ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు.



ములుగు సెప్టెంబర్ 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మున్సిపాలిటీలో పురగిరి క్షత్రియ (పెరిక) కుల ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాతలుగా చీదర్ల భాస్కర్ - వనిత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, జిల్లా నాయకులు రియాజ్, కౌన్సిలర్లు పొడల ఓం ప్రకాష్, పావని, నవీన్, సాంబయ్య, సరిత, వాణి, స్వాతి, పద్మ తదితరులు పాల్గొన్నారు. పెరిక కుల జిల్లా అధ్యక్షులు అక్కల రవి, జిల్లా ఉపాధ్యక్షులు దిడ్డి రాజ్ కుమార్, ములుగు పెరిక కుల అధ్యక్షులు చీదర్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శి దిడ్డి వీరేందర్ నాథ్ వర్మ, కోశాధికారి పెట్టెం రాజేందర్, ఉపాధ్యక్షులు బుద్దె మల్లయ్య, అక్కల రఘోత్తం, ప్రచార కార్యదర్శి తీర్థలా రాజ్ కుమార్, బరుపటి ప్రభాకర్, కార్యదర్శి జూకంటి రాజు తదితర కుల పెద్దలు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## జిల్లా స్థాయికి ఎంపికైన బిట్స్ విద్యార్థులు



ములుగు, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర): ములుగు మండల కేంద్రమైన జాకారంలో జరిగిన మండల స్థాయి గేమ్స్ ఎంపికలో బిట్స్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్-14, అండర్-17 బాల బాలికలకు నిర్వహించిన కబడ్డీ, ఖో-ఖో పోటీల్లో అండర్-14 కబడ్డీ విభాగంలో రావుల మంజు భార్గవి, యాప నంద్విక జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో దబ్బగట్ల హర్షిత్, హరిగొప్పుల మనస్విని ఎంపికయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ మహమ్మద్ మజీబ్ అభినందించారు. చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్, పూర్ణేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాణాంతక వ్యాధులతో బాధపడే ఎస్సీ, ఎస్టీలకు కేంద్రం ఉచిత వైద్య సాయం.



ములుగు సెప్టెంబర్ 18 విజన్ ఆంధ్ర ప్రతినిధి : తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఎస్సీ, ఎస్టీలకు డాక్టర్ అంబేద్కర్ మెడికల్ ఎయిడ్ స్కీం కింద అందించే వైద్య సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కోరారు. కేంద్ర సామాజిక న్యాయ శాఖ పరిధిలోని అంబేద్కర్ ఫౌండేషన్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీలు అర్హులని, గుండె, కిడ్నీ, క్యాన్సర్, మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సలు, అవయవ మార్పిడి వంటి చికిత్సలకు ఆర్థిక సాయం లభిస్తుందని పేర్కొన్నారు. మంజూరైన మొత్తాన్ని నేరుగా ఆసుపత్రి ఖాతాలో జమ చేస్తారని, దరఖాస్తును శస్త్రచికిత్సకు 15 రోజుల ముందే డైరెక్టర్, డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్, 15 జన్ పథ్, న్యూఢిల్లీ చిరునామాకు పంపాలని సూచించారు.

## రూ.5 లక్షల ప్రొసీడింగ్ పత్రం అందజేసిన ఎమ్మెల్యే



నిజామాబాద్ సెప్టెంబర్18:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ రూరల్ : ఇందల్వాయి మండలం మల్లాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో గ్రామస్తులకు అందజేశారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. సర్పంచ్ మోహన్, ఉప సర్పంచ్, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు ఉన్నారు.

## ములుగులో చలో వరంగల్ కరపత్రం ఆవిష్కరణ

- 27న బహిరంగ సభకు పిలుపు



ములుగు, సెప్టెంబర్ 18, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఈ నెల 27న హనుమకొండలోని హంటర్ రోడ్ డి కన్వెన్షన్ లో జరగనున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ ముంజల బిక్షపతి గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ రిటైర్డ్ ప్రొఫెసర్ చంద మల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి పొదిళ్ల సాయిబాబా, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మేకల సుమన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా దక్కాలని, సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధన కోసం 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ములుగు జిల్లా నుండి పెద్ద ఎత్తున బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జేరుపోతుల కరుణాకర్, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మల్యాల మనోహర్, వాజేడు మండల కన్వీనర్ చిరంజీవి, ఎల్. అశోక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దేవ, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ గొంగళ్ల కట్టయ్య, బొచ్చు సాంబయ్య, బీఎస్పీ జిల్లా కార్యదర్శి బాణాల కొమురయ్య, బాణాల ప్రభాకర్, సామాజిక న్యాయ వేదిక జిల్లా అధ్యక్షులు, తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గుల్లగట్టు సంజీవ్, బైకాని మోహన్, దామోదర్, మోడం మొగిలి గౌడ్, గౌడ జేఏసీ నాయకులు శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారా జాతి అభ్యున్నతికి కలిసికట్టుగా పోరాడుదాం.

**- మైదాన ప్రాంత గిరిజనులకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలి.**

**- గిరిజన నేత మాజీ మంత్రి రవీందర్ నాయక్**



నిజామాబాద్ సెప్టెంబర్18:( విజన్ ఆంధ్ర ) : బంజారా జాతి అభ్యున్నతికి బంజారా లు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని గిరిజన నేత మాజీ మంత్రి రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారా జాతి ఎస్టీలుగా గుర్తింపు పొంది 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి తనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించడం ఎంతో సంతోషం కలిగిందని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు ఎంతో వ్యత్యాసం ఉందని కిందిస్థాయి నుండి పై స్థాయి వరకు ఉన్నత పదవులను అధిరోహిస్తున్నారని ఆయన అన్నారు. బ్రిటిష్ కాలంలో బంజారాలను నేర ప్రవృత్తి గల వ్యక్తులుగా పరిగణించాలని భారతదేశ స్వతంత్రం తర్వాత మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ తమకు ప్రత్యేక గుర్తింపునివ్వడం అర్శించదగ్గ విషయమని కొనియాడారు. బంజారా జాతి కి ఆసియా ఖండంలోనే ఘనమైన చరిత్ర కలదని, ఆస్తి గాని ఆస్తులు గాని ఆశించకుండా ఉన్నారని 18 60వ సంవత్సరంలో బ్రిటిష్ పరిపాలనలో బంజారాల సహాయం కోరడంతో దానికి బంజారా లు ససేమిరా తమ సహాయము ఇవ్వకపోవడంతో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం వారిని నేరజాతిగా పరిగణించారని తెలిపారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేక అంశాలపై చర్చలు జరిపేమని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు6 శాతం మాత్రమే ఉన్నారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అది కాస్త పది శాతం రిజర్వేషన్ అయిందని, ప్రధానమంత్రి ఇందిరాగాంధీ బంజారా జాతిని ఆరోజు గుర్తించిందని ఈరోజు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి బంజారాలకు ప్రత్యేక స్థానం రాష్ట్రంలో కల్పించిందని అన్నారు. సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని అచ్చంపేటలో నిర్మించడానికి ప్రభుత్వం 150 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, అన్నారు. ఆ విధంగా బంజారా లు అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అదేవిధంగా తండాలలో గిరిజనులకు ఎలాంటి సౌకర్యం లేనందున గిరిజన రెవిన్యూ తాండగా మార్చాలని ఆయన కోరారు. 50 సంవత్సరాలు పురస్కరించుకున్న సందర్భంగా నిజామాబాద్ జిల్లా నుండి బంజారా భారత్ స్లోగన్ ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా ప్రతినిధులు శివలాల్ బాబురావు డాక్టర్ బిలోజి నాయక్, హరి సింగ్ బంజారా విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ శాస్త్రీయ నృత్య పోటీలో ఇందూరి చిన్నారి కామాక్ష్య ప్రతిభ



నిజామాబాద్ సెప్టెంబర్18:( విజన్ ఆంధ్ర) : ఇందూరి చిన్నారి కామాఖ్య (విభా శ్రీ తేలి) జాతీయ శాస్త్రీయ నృత్య పోటీలో తన అసమాన ప్రతిభను చాటుకుంది.హైదరాబాద్‌లోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (CBIT)లో నిర్వహించిన Dyuthi 2026 National Performing Arts FestivalýË భాగంగా È]Ðq AANGIKAM National Classical Dance Competitionలో చిన్నారి కామాఖ్య కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించింది.తన అపూర్వమైన హావభావాలు, అభినయం, నృత్య భంగిమలు, లయబద్ధమైన కదలికలతో జడ్జిలను మాత్రమే కాకుండా, కార్యక్రమానికి హాజరైన అశేష ప్రేక్షకులను సైతం మంత్ర ముగ్ధులను చేసింది.నృత్యమే ప్రాణంగాడ నృత్యమే వేదంగా అతి చిన్న వయస్సులోనే నృత్యంలో ఓనమాలు దిద్ది, "ఇంతింతై వటుడింతై" అన్నట్లుగా తన ప్రతిభను అంచెలంచెలుగా చాటుకుంటూ ముందుకు సాగుతున్న చిన్నారి కామాఖ్యకు ఇది మరో మైలురాయి.తన అద్భుతమైన ప్రదర్శనకు గుర్తింపుగా గౌరవనీయులు వేదాంత రాధే శ్యామ్ గారి చేతుల మీదుగా క్యాష్ అవార్డు మరియు మెమెంటో అందుకుని సత్కారం పొందింది.చిన్నారి కామాఖ్య తన ప్రతిభతో తల్లిదండ్రులకు, గురువులకు, ఇందూరు ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది.చిన్నారి కామాఖ్యకు హృదయపూర్వక అభినందనలుడ భవిష్యత్తులో మరెన్నో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తన నృత్య ప్రతిభను చాటాలని ఆకాంక్షిద్దాం.

# కొండగట్టు అంజన్న ఆలయానికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి

**- అసెంబ్లీలో గళమెత్తిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**- గత పాలకులు రూ. 500 కోట్లు అని చెప్పి ఐదు పైసలు కూడా ఇవ్వలేదు**

**- ప్రమాదాల నివారణకు నూతన ఘాట్ రోడ్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి**



మల్యాల, సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర): తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజనేయ స్వామి దేవాలయ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించి పనులు చేపట్టాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రభుత్వాన్ని కోరారు శుక్రవారం శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని కొండగట్టు క్షేత్ర అభివృద్ధి, భక్తుల రక్షణపై కీలక అంశాలను సభ దృష్టికి తీసుకెళ్లారు కొలిచిన భక్తుల కొంగుబంగారమైన కొండగట్టు అంజన్న క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో పాటు చుట్టూ కొండలు పచ్చని ప్రకృతి నడుమ ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో విలసిల్లుతోందని తెలిపారు ఇంతటి ప్రాశస్త్యం కలిగిన క్షేత్రాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు గతంలో కేసీఆర్ ఆలయాన్ని రెండుసార్లు సందర్శించి ఒకసారి రూ.100 కోట్లు మరోసారి రూ.500 కోట్లు ఇస్తామని ప్రకటించినప్పటికీ కనీసం ఐదు పైసలు కూడా విడుదల చేయకుండా భక్తులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అన్ని దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తోందని అదే తరహాలో కొండగట్టు ఆలయానికి కూడా పక్కా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు

ఘాట్ రోడ్డు పనులు వేగవంతం చేయాలి:

గతంలో కొండగట్టు ఘాట్ రోడ్డుపై జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 65 మంది అమాయకులు మృత్యువాత పడ్డ ఘటన యావత్ దేశాన్ని కలచివేసిందని గుర్తుచేశారు అయినప్పటికీ గత పాలకులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి రోడ్డు ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే సురక్షితమైన నూతన ఘాట్ రోడ్డు నిర్మాణం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు ఈ విషయమై ఇటీవల తాను ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి విన్నవించగా వారు వెంటనే స్పందించి అధికారులతో సర్వే చేయించారని వెల్లడించారు సర్వే పూర్తయినందున వెంటనే నిధులు మంజూరు చేసి నూతన ఘాట్ రోడ్డు పనులను ప్రారంభించాలని సభాపతి ద్వారా ప్రభుత్వాన్ని కోరారు

# మల్టీ వర్కర్ పేరుతో పలు లావాదేవీలు..
# జీతం ఒకటి.. చెల్లింపులు మరొకటా..?

**- సులానగర్ గ్రామపంచాయతీలో మల్టీ వర్కర్ పేరుతో నమోదైన లావాదేవీలపై ప్రశ్నల వర్షం..**

**- డీజిల్ నుంచి డ్రైనేజీ పూడికతీత వరకు.. బిల్లులు, వౌచర్లు, బ్యాంకు చెల్లింపులు పరిశీలిస్తేనే అసలు విషయం!**




**టేకులపల్లి సెప్టెంబర్ 18 విజన్ ఆంధ్ర** సులానగర్ గ్రామపంచాయతీలో 2023-20242025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కొన్ని లావాదేవీలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. గ్రామపంచాయతీలో మల్టీ వర్కర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తికి సాధారణ నెలవారీ వేతనం చెల్లించడంతో పాటు, వివిధ పనులు, మరమ్మతులు, ఇంధనం, సామగ్రి కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులు అతని పేరుతో లేదా అతనికి సంబంధించిన విధంగా నమోదై ఉన్నట్లు సమాచారం. దీంతో పంచాయతీ నిధుల వినియోగంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఒకే వ్యక్తికి.. ఎన్నో రకాల చెల్లింపులు..?**

అందుబాటులో ఉన్న లావాదేవీల వివరాల ప్రకారం గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు డీజిల్/ఇంధనం కొనుగోలు, డ్రైనేజీల పూడికతీత, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు, బుష్‌కట్టర్ మరమ్మతులు, పీవీసీ మెటీరియల్ కొనుగోలు, రిజిస్టర్లు, పురుగుమందులు తదితర అంశాలకు చెల్లింపులు జరిగినట్లు తెలుస్తోంది.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. మల్టీ వర్కర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఏ హోదాలో ఈ చెల్లింపులకు సంబంధితుడయ్యారు? ఆయన కేవలం పంచాయతీ సిబ్బందిగా విధులు నిర్వహించారా? లేక పంచాయతీకి సరఫరాదారుగా కూడా వ్యవహరించారా? పనులు నిర్వహించిన వ్యక్తిగా చెల్లింపు పొందారా? లేక కొనుగోలు చేసి సరఫరా చేసిన వ్యక్తిగా బిల్లులు సమర్పించారా? ఈ అంశానికి స్పష్టమైన సమాధానం అధికారిక రికార్డుల్లోనే ఉండాలి.

**ట్రాక్టర్ డీజిల్‌కు లెక్క ఉందా.?**

పంచాయతీ ట్రాక్టర్‌కు డీజిల్ కొనుగోలు చేసినట్లు చెల్లింపులు ఉంటే, ప్రతి కొనుగోలుకు తేదీ, పరిమాణం, ధర, బిల్లు నంబర్, వాహనం వినియోగ వివరాలు ఉండాలి.ఆ తేదీల్లో ట్రాక్టర్ వాస్తవంగా ఎక్కడ పనిచేసింది? ఎన్ని రోజులు పనిచేసింది? ఎంత దూరం ప్రయాణించింది? ఎంత డీజిల్ వినియోగించింది? అనే వివరాలను ట్రాక్టర్ లాగ్‌బుక్‌తో డీజిల్ బిల్లులను సరిపోల్చితే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

**పూడికతీత పనులు.. వాస్తవంగా జరిగాయా..?**

డ్రైనేజీ పూడికతీతకు చెల్లింపులు జరిగి ఉంటే, ఆయా పనులు జరిగిన ప్రాంతాలు, తేదీలు, పని పరిమాణం, ఉపయోగించిన కార్మికులు, చెల్లింపు విధానం వంటి వివరాలు రికార్డుల్లో ఉండాలి.పూడికతీత పనులకు మస్టర్ లేదా పని ధృవీకరణ ఉందా? పని పూర్తయినట్లు ఎవరు ధృవీకరించారు? ఫోటోలు లేదా ఇతర ఆధారాలు ఉన్నాయా? అన్నది పరిశీలించాల్సిన అంశం.

**పైప్‌లైన్ మరమ్మతులు.. మెటీరియల్ ఎక్కడ..?**

పైప్‌లైన్ లీకేజీల మరమ్మతుల పేరుతో పీవీసీ మెటీరియల్ కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉంటే,




కొనుగోలు చేసిన పైపులు, జాయింట్లు, వాల్వులు తదితర సామగ్రి వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదై ఉన్నాయా? ప్రస్తుతం అవి పంచాయతీ వినియోగంలో ఉన్నాయా? అన్నది కూడా కీలకమే.కొనుగోలు బిల్లు ఒకవైపు.. స్టాక్ రిజిస్టర్ మరోవైపు.. క్షేత్రస్థాయిలో ఉన్న సామగ్రి మరోవైపు సరిపోల్చితేనే కొనుగోలు వాస్తవికతపై స్పష్టత వస్తుంది.

**బుష్‌కట్టర్ మరమ్మతు.. ఎవరి బాధ్యత..?**


బుష్‌కట్టర్ మరమ్మతులకు చెల్లింపులు ఉంటే ఆ యంత్రం పంచాయతీకి చెందినదేనా? మరమ్మతు ఎక్కడ చేయించారు? మరమ్మతు బిల్లు ఎవరి పేరుతో ఉంది? యంత్రం వాస్తవంగా పనిచేసిందా? వంటి వివరాలు కూడా రికార్డుల్లో పరిశీలించాల్సి ఉంటుంది.

**కొనుగోలు ప్రక్రియ పాటించారా..?**

రిజిస్టర్లు, పురుగుమందులు, పీవీసీ మెటీరియల్ తదితర సామగ్రి కొనుగోలు చేసినప్పుడు కొటేషన్లు తీసుకున్నారా? సరఫరాదారులను ఎలా ఎంపిక చేశారు? బిల్లు ఎవరి పేరుతో ఉంది? సరఫరా స్వీకరించినట్లు ఎవరు ధృవీకరించారు? అన్నది మరో కీలక అంశం.ఒకవేళ ఉద్యోగి పేరుతోనే సరఫరా లేదా ఇతర సేవలకు చెల్లింపులు జరిగి ఉంటే, ఆ చెల్లింపుల స్వభావం, అనుమతులు, సంబంధిత నిబంధనలు పరిశీలించాల్సిన అవసరం ఉంటుంది.

**బ్యాంకు స్టేట్‌మెంట్‌తో అసలు లెక్క తేలేనా.?**

లావాదేవీలపై స్పష్టత కోసం కేవలం పంచాయతీ రికార్డులు మాత్రమే కాకుండా బ్యాంకు స్టేట్‌మెంట్, ఈ-గ్రామస్వరాజ్, పీఎఫ్‌ఎంఎస్ చెల్లింపు వివరాలు, క్యాష్‌బుక్ తదితరాలను పరస్పరం సరిపోల్చాల్సి ఉంటుంది.రికార్డులో ఒక మొత్తం ఉంటే బ్యాంకు నుంచి అదే మొత్తం వెళ్లిందా? చెల్లింపు ఎవరికి వెళ్లింది? ఏ తేదీన వెళ్లింది? ఒకే వ్యక్తికి వేర్వేరు పేర్లతో లేదా వేర్వేరు పనుల కింద




చెల్లింపులు జరిగాయా? అనే అంశాలు పరిశీలిస్తే మరింత స్పష్టత రావచ్చు.

**జీతం.. అదనపు చెల్లింపులు..?**
**రెండింటి మధ్య తేడా ఏమిటి?**

మల్టీ వర్కర్‌కు చెల్లించే నెలవారీ వేతనం ఒక రకమైన చెల్లింపు. అదే వ్యక్తికి ఇతర పనులు లేదా సరఫరాల పేరుతో అదనపు మొత్తాలు చెల్లించి ఉంటే, అవి ఏ ప్రాతిపదికన చెల్లించబడ్డాయి? సంబంధిత పనికి ప్రత్యేక అనుమతి ఉందా? పని ఆ వ్యక్తి విధుల్లో భాగమేనా? లేక ప్రత్యేక సేవ/సరఫరా కింద పరిగణించారా? అన్నది అధికారికంగా వెల్లడించాల్సిన అంశం.

**విచారణ జరిగితే బయటపడే అంశాలివే..?**

ఈ వ్యవహారంపై రికార్డుల ఆధారంగా సమగ్రంగా పరిశీలిస్తే ప్రధానంగా ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది.మల్టీ వర్కర్‌కు 2023-20242025-2026 సంవత్సరం లో మొత్తం ఎంత వేతనం చెల్లించారు? వేతనం కాకుండా అదే వ్యక్తికి లేదా అతనికి సంబంధించిన సంస్థ/ఖాతాకు ఎన్ని చెల్లింపులు జరిగాయి? ప్రతి చెల్లింపు ఏ పనికి లేదా ఏ కొనుగోలుకు సంబంధించినది? ఆయా చెల్లింపులకు బిల్లులు, వౌచర్లు ఉన్నాయా? వర్క్ ఆర్డర్లు, కొటేషన్లు, అనుమతులు ఉన్నాయా? ట్రాక్టర్ డీజిల్ బిల్లులు లాగ్‌బుక్‌తో సరిపోతున్నాయా? పూడికతీత పనులకు పని ధృవీకరణ, మస్టర్ లేదా ఇతర ఆధారాలున్నాయా? కొనుగోలు చేసిన పీవీసీ మెటీరియల్, రిజిస్టర్లు, పురుగుమందులు స్టాక్ రిజిస్టర్‌లోనమోదయ్యాయా. బుష్‌కట్టర్ మరమ్మతు వాస్తవంగా జరిగిందా?చెల్లింపులు ఎవరి బ్యాంకు ఖాతాలకు వెళ్లాయి? ఒకే పనికి లేదా ఒకే వస్తువుకు పునరావృత చెల్లింపులు జరిగాయా? పంచాయతీ తీర్మానాలు, అధికారుల అనుమతులు ఉన్నాయా?

**రికార్డులు బయటపెడితేనే.. వాస్తవం ఏదో.?**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న లావాదేవీ వివరాలు మాత్రమే ఆధారంగా ఎలాంటి తుది నిర్ధారణకు రావడం సాధ్యం కాదు. అయితే ఒకే మల్టీ వర్కర్‌కు వేతనంతో పాటు ఇతర చెల్లింపులు జరిగినట్లు రికార్డుల్లో ఉంటే, వాటి వెనుక ఉన్న బిల్లులు, వౌచర్లు, పనుల ధృవీకరణ, బ్యాంకు చెల్లింపులు, స్టాక్ వివరాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. గ్రామపంచాయతీ నిధులు ప్రజాధనం కావడంతో ప్రతి రూపాయి ఖర్చుకు సరైన లెక్క, ఆధారం, పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉంది. అందువల్ల సులానగర్ గ్రామపంచాయతీలో 2023-20242025- 2026ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ లావాదేవీలపై సంబంధిత ఉన్నతాధికారులు రికార్డులను సమగ్రంగా పరిశీలించి, చెల్లింపుల స్వరూపం, పనుల వాస్తవికత, కొనుగోళ్ల ఆధారాలు, నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

**నా దృష్టికి రాలేదు.. వస్తే చర్యలు తప్పవు.విక్రమ్**

సులానగర్ గ్రామపంచాయతీలో మల్టీ వర్కర్‌కు సంబంధించిన వేతనాలతో పాటు ఇతర చెల్లింపులపై టేకులపల్లి ఎంపీ ఓ విక్రమ్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా, ఇప్పటివరకు ఈ విషయానికి సంబంధించిన సమాచారం నా దృష్టికి రాలేదు. సంబంధిత రికార్డులు, బిల్లులు, వౌచర్లు, చెల్లింపుల వివరాలు నా దృష్టికి వస్తే వాటిని పరిశీలిస్తాను. నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా ఉన్నట్లు తేలితే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాను అని తెలిపారు.అధికారి స్పందన నేపథ్యంలో సులానగర్ గ్రామపంచాయతీకి సంబంధించిన వేతన చెల్లింపులు, ఇతర లావాదేవీలు, బిల్లులు, వౌచర్లు, బ్యాంకు చెల్లింపులు, స్టాక్ రిజిస్టర్లు తదితర రికార్డులను పరిశీలిస్తేనే ఈ వ్యవహారంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ప్లాస్టిక్ రహిత గ్రామంగా గొట్టిముక్కుల

**- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు సమిష్టిగా కృషి చేయాలి**

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 18 (విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం గొట్టిముక్కుల గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ప్లాస్టిక్ రహిత గ్రామ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గ్రామపంచాయతీ చేపడుతున్న చర్యలను అభినందించారు.గ్రామ సర్పంచ్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. కమ్యూనిటీల వారీగా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు కొనుగోలు చేసి, వివిధ శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల్లో వాటిని వినియోగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తద్వారా పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని తగ్గిస్తున్నట్లు వివరించారు. గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా గ్రామపంచాయతీకి తీసుకువచ్చి అందజేసేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామపంచాయతీకి తీసుకువచ్చి అందజేసే వారికి ప్రోత్సాహకంగా స్టీల్ వాటర్ బాటిళ్లను అందిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా, ఐకేపీ సంఘ భవనంలో కమ్యూనిటీ కార్యక్రమాల కోసం నిత్య వినియోగానికి ఒక దాత 300 స్టీల్ ప్లేట్లను విరాళంగా అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు.

ఆరు మహిళా సంఘాలకు కోటి రూపాయల బ్యాంక్ లింకేజీ రుణాలు కార్యక్రమంలో భాగంగా కెనరా బ్యాంక్ ద్వారా ఆరు మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద మొత్తం కోటి రూపాయల రుణాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా రుణాలకు సంబంధించిన చెక్కులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంఘాల ప్రతినిధులకు అందజేశారు. మహిళా



సంఘాలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆదాయాభివృద్ధి కార్యకలాపాలను చేపట్టి ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు.

***ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి***

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, గొట్టిముక్కుల గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చేపడుతున్న చర్యలు అభినందనీయమని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ఒక్కరి బాధ్యత కాదని, ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నీరు, నేల, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గించి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్లాస్టిక్‌కు నో చెప్పండి వ్యాధులను నివారించండి.. నీరు, నేల, పర్యావరణాన్ని పరిరక్షించండి" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. గొట్టిముక్కుల గ్రామంలో చేపడుతున్న కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ, మరింత మందిని భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు.

***విద్యార్థులతో అవగాహన కార్యక్రమం***

ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించే స్కిట్‌ను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్, అధికారులు అభినందించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి ప్రతి ఇంటికి జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుగా పునర్వినియోగ జూట్ బ్యాగులను వినియోగించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డీఆర్డీఏ పీడీ దామోదర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, డీఎల్‌పీఓ శ్రీనివాస్, కెనరా బ్యాంక్ అధికారులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.